

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com



visit us @ http://epaper.suryaa.com
గురువారం | 3 జనవరి 2019 | హైదరాబాద్
సంపుటి 12 | సంచిక 65
| పేజీలు 12+16 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళ పక్ష తిథి : త్రయోదశి తె.3.53, నక్షత్రం. అనూరాధ మ.12.34 వర్జ్యం సా.6.25 నుంచి 8.04 వరకు
రాహుకాలం: మ.1.30 నుంచి 3.00 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.00 నుంచి 10.48 వరకు తిరిగి మ 02.48 నుంచి 3.36 వరకు, సూర్యోదయం : ఉ.6.35 గం; సూర్యాస్తమయం: సా.5.39



విజయ, దేనా, బీవోబీ బ్యాంకుల
విలీనానికి ఆమోదం

• దేశంలో మూడో అతిపెద్ద బ్యాంకుగా బీవోబీ • తొలి రెండు స్థానాల్లో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ • ఉద్యోగుల సర్వీసుపై ప్రభావం ఉండదు • సిబ్బందికి, ఖాతాదారులకు లాభాలే • కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ • భారీ నష్టాలలో ముగిసిన మార్కెట్లు • సెన్సెక్స్ 363, నిఫ్టీ 117 పాయింట్లు నష్టం

5 లో

బిందు, కనకదుర్గలకు
అయ్యప్ప దర్శనం

• అయ్యప్ప ఆలయంలో నవ చరిత్ర • ఇద్దరు మహిళలకు స్వామి దర్శనం • దశాబ్దాల సంప్రదాయాన్ని తోసిరాజన్న ఇద్దరు మహిళలు • విలపించిన భక్తులు • పంతం నెగ్గించుకున్న కేరళ సర్కార్ • భక్తుల సంఖ్య స్వల్పంగా ఉండడంతో పని ముగించిన పోలీసులు • ఆలయం అపవిత్రమైందని వాపోతున్న భక్తులు



6 లో

మూడు నెలల్లో కాళేశ్వరం



• కాళేశ్వరం వద్ద కాఫర్‌డ్యామ్ పనులు మూడు నెలల్లో పూర్తి కావాలి • వంద శాతం నీరందించేలా పనుల్లో వేగం పెంచాలి • ప్రతి రోజు రెండు టీంఎసిల నీటిని ఎత్తిపోసే దిశగా పనులు జరగాలి • త్వరలోనే పంపుల ట్రయల్ రన్ నిర్వహించాలి • ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంపై అసంతృప్తి • పనుల్లో నిర్లక్ష్యం సహించను • రెండవ రోజు ప్రాజెక్టుల బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు • సుందిళ్ల బ్యారేజ్ పనులపై ముఖ్యమంత్రి ఫైర్ • రివెట్మెంట్ పనుల నిర్లక్ష్యంపై అధికారులు, గుత్తేదారులపై ఆగ్రహం • అసంతృప్తితో పనులు చూడకుండానే వెనుదిరిగిన ముఖ్యమంత్రి

కరీంనగర్–సూర్యప్రధానప్రతినిధి: మార్చి 31 నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి స్థాయిలో జరుగాలని రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారులను, గుత్తేదారులను, ఇంజనీర్లను ఆదేశించారు.

బుధవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రెండవ రోజు ప్రాజెక్టుల బాట పట్టిన కేసిఆర్ కరీంనగర్‌లోని ఉత్తర తెలంగాణ భవనం నుండి ఉదయం హెలిక్యాప్టర్ ద్వారా సుందిళ్ల బ్యారేజి, అన్నారం పంపు హౌజ్, గోలివాడ పంపుహౌజ్‌లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా సుందిళ్ల బ్యారేజి వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన పోటో ఎగ్జిబిషన్‌ను సిఎం పరిశీలిం చారు. ప్రాజెక్టు పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా గోలివాడ పంప్‌హౌజ్‌ను కేసిఆర్ పరిశీలించారు. సుందిళ్ల బ్యారేజి పరిధిలో 74 గేట్లను అమరిక పూర్తి అయిందని, 17కిలోమీటర్ల మేర ఉన్న ఫ్లడ్‌బ్లాక్ పనులు వేగంగా సాగుతు న్నాయన్నారు. 89.64 శాతం ఎక్స్‌కవేషన్ పనులు, 76.39 శాతం ఎర్త్ పనులు జరిగాయని, మిగిలినవి జన వరి చివరి నాటికి పూర్తి అవుతాయని అధికారులు



మిగతా 6లో

16 ఎంపీలను గెలిపిస్తే మనమే కింగ్ మేకర్



• 16 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంటే ఢిల్లీని శాసించవచ్చు • దేశానికి ఆదర్శం టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన • రైతుబంధును అమలు చేసేందుకు మూడు రాష్ట్రాలు రెడీ • ప్రధాని మోడీ కూడా ఈ పథకాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు • రైతన్నలకు మేలు జరిగే పథకాన్ని సీఎం కేసీఆర్ రూపొందించడం • ప్రతి టీఆర్ఎస్ కార్యకర్తకు గర్వకారణం • ఉద్యమనాయకుడే రెండవసారి సీఎం కావడం దేశంలో అరుదైన రికార్డు • టీఆర్ఎస్‌పై నమ్మకంతో 75 శాతం స్థానాలు కట్టబెట్టిన ప్రజలు • ప్రజలకిచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రణాళికబద్ధంగా అమలు చేద్దాం • రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల ఓట్లు గల్లంతు • టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు

వివరాలు 6లో

క్యాబినెట్‌కు పంచాయతీ గండం

• ఇప్పట్లో మంత్రివర్గం లేనట్లే! • విస్తరణకు 'పంచాయతీ' అడ్డంకీ • షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ అమలు • మంత్రివర్గ విస్తరణకు మోకాలడ్డు • అసెంబ్లీ సమావేశాలు సైతం వాయిదా • ఆగిపోయిన అధికారుల బదలీలు • టీఆర్ఎస్ ఆశావహుల్లో ఆందోళన

తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ ఇప్పట్లో లేనట్టే..!. ఇప్పుడు.. అప్పుడు అంటూ ఆశలపల్లకిలో ఊరేగుతున్న టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇటీవల సీఎం కేసీ ఆర్ సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుం దని స్పష్టం చేసిన విషయం తెలిసిందే!. అయితే సం క్రాంతి తర్వాత కూడా మంత్రి వర్గ విస్తరణకు గ్రామ పంచాయితీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన అడ్డంకిగా మారింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రానుం డడంతో ఈ నెలాఖరు వరకు కూడా మంత్రివర్గాన్ని విస్తరింపచేసే అవకాశం లేదు. మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు మరో నెల వరకు ఊపిరిబిగపట్టుకొని ఆగాల్సిందే మరీ..!. తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగరా మోగిన నేపథ్యంలో ఎల్లుండి (శుక్రవారం) ఎన్నికల పరిశీలకులతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించనుంది.


ఫైల్ ఫోటో

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఇక, పంచాతీయ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో రాష్ట్రంలో ఎన్ని కల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో తెలం గాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేపట్టరాదని కూడా స్పష్టం చేసింది.

సరైన ముహూర్తాలు లేక : అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ.. సరైన ముహూర్తాలు లేకపోవడంతో ఇప్పటికీ సీఎం కేసీఆర్ మంత్రివర్గ విస్తరణ చేపట్టని సంగతి తెలిసిందే. అయితే ఇటీవల సీఎం కేసీఆర్ మీడియా సమావేశం సందర్భంగా సంక్రాంతి పీడదినాలు వెళ్లిన తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చెప్పిన విషయం తెలిసిందే!. ప్రస్తుతం పంచాయితీ ఎన్నికల కోడ్ పూర్తయ్యేవరకు ఇక మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు ఐఎఎస్, ఐపీఎస్‌లతో సహా అధికారులెవరినీ

మిగతా 6లో

అంతే ఇంతే!



కేంద్రంలో మార్పు కావాలని కోరుకుంటున్నదేమో!

రాక్షస పాలన మనకొద్దు



• తుది నియోజకవర్గానికి ప్రజా సంకల్ప యాత్ర
• ఇచ్ఛాపురం నియోజకవర్గంలోకి జగన్
• జననేత పాదయాత్రకు తరలిన పార్టీ శ్రేణులు

(సూర్యబ్యూరో శ్రీకాకుళం)టీడీపీ రాక్షస పాలనను, అంత మొందించేందుకు రాష్ట్ర ప్రధాన, ప్రతిపక్ష నేత, రాష్ట్ర ప్రజల ఆశల రేడు, వై.ఎసఎ జగనఎ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర బుధవారం ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధికి చెందిన సోంపేట మండలం రాణిగాంలోకి ప్రవేశించింది. రాణిగాం, తురకశాసనం మీదుగా పాలవలస సమీపంలో ప్రాత్రినివురం వరకు పాదయ్త్రా కొనసాగింది. వై.ఎస్.జగన్ పాదయ్త్రాలో ఉద్ధాన గ్రామాలు పరవశించిపోయాయి. ఇసుకవేస్తే రాలనంత జనం జననేతను చూసేందుకు ఎగపడ్డారు. పలాస నియోజకవర్గ శివారు అంబుగాం , ఇచ్చాపురం నియోజకవర్గ పరిధిలోగల రాణిగాంలో పాదయ్త్రా అడుగుపెట్టగానే జగన్‌కు ఘనంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి

మిగతా 6లో

రాఫేల్ రగడ
తలాక్ తగవు



• ఉభయ సభల్లో కొనసాగిన విపక్షాల నిరసనలు • సభలో కాగితం పడవలు వదిలిన విపక్షాలు • రాఫెల్ రహస్యాలు పారికర్ బెడ్రూమ్‌లో • ఆధారాలు విడుదల చేసిన కాంగ్రెస్ • అధికార విపక్షాల నడుమ ముదిరిన మాటల యుద్ధం • రివ్యూ పిటిషన్‌తో మళ్లీ సుప్రీం ముందుకు ప్రశాంత్ • పార్లమెంట్ వాయిదా

వివరాలు లోపలి పేజీల్లో

టీఆర్ఎస్‌లో చేరడం లేదు : ట్విట్టర్‌లో మాజీ ఎంపీ అజారుద్దీన్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ టీఆర్ఎస్‌లో చేరబోతున్నారంటూ కొద్దిరోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో కూడా పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తను పార్టీ మారబోతున్నట్లు వస్తున్న వార్తలపై అజారుద్దీన్ స్పందించారు. తాను టీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్టు వస్తున్న వార్తలు పూర్తి అవాస్తవమని ఆయన తేల్చేశారు. ట్వీట్ ద్వారా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం టికెట్‌ను అజారుద్దీన్ ఆశించారని, టీఆర్ఎస్ ఈ విషయంలో హామీ ఇచ్చిందని, దీంతో త్వరలోనే ఆయన కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి గులాబీ కండువా కప్పుకోనున్నట్లు వార్తలొచ్చాయి. ఇటీవల తన స్నేహితుడు ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ కుమార్తె పెళ్లి వేడుకకు వెళ్లిన అజారుద్దీన్ తన మనసులోని మాటను అదే వివాహానికి హాజరైన టీఆర్ఎస్ అధినేత ముందుంచారని, కేసీఆర్ కూడా సుముఖత వ్యక్తం చేశారని ప్రచారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అజారుద్దీన్‌ను మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీకి నిలపాలని భావిస్తున్నట్లు సమాచారం.



పల్లెల్లో ‘పంచాయతీ’.!

జోష్‌గా టీఆర్ఎస్ నేతలు ● పోటీకి సై అంటున్న యువత

● గ్రామాల్లో వేడెక్కిన ఎన్నికల వాతావరణం ● పోటీకి ఎవరిని దింపాలన్న ఆలోచన ● అన్ని పార్టీల అభ్యర్థుల ఎన్నికలపై కసరత్తు ● కొన్ని గ్రామాల్లో ‘వేలంపాట’కు సర్వం సిద్ధం ● ఎన్నికల ఖర్చుకు భయపడి మరికొందరు దూరం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలంగాణ పల్లెల్లో ‘పంచాయితీ’ ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటనతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నికల్లో ప్రధానపార్టీలకు చెందిన సానుబూతిపరుల ఎంపికపై దృష్టిసారించారు. ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా ఎవర్ని దించితే గెలుపు అవకాశాలుంటాయన్న దానిపై ముఖ్యంగా టీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ పార్టీలకు చెందిన గ్రామ నేతలు, కార్యకర్తలు కసరత్తు ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో పంచాయితీ ఎన్నికలకు పోటీ లేకుండా ‘వేలంపాట’ నిర్వహించాలని, వేలం ద్వారా వచ్చిన డబ్బును గ్రామాభివృద్ధికి, లేక గ్రామంలోని దేవాలయాల నిర్మాణానికి వెచ్చించాలంటూ ఇప్పటికే తీర్మాణాలు చేసినట్లు సమాచారం. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో భారీ ఎత్తున డబ్బు ఖర్చుచేయడం, ఓటర్లకు అంతే తాయిలాలు, డబ్బులు పంపిణీ చేయడంతో గ్రామ పంచాయితీ ఎన్నికలు సైతం భారీ ఖర్చుతో కూడుకున్నట్లు అంచానా వేసిన కొంతమంది సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిరాకరిస్తున్నారు. గతంలోసర్పంచ్‌లుగా పనిచేసిన వారు కూడా ఖర్చుకు వెరసి పోటీకి దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువకులు భారీ ఎత్తున పోటీ పడుతున్నారు. ఇందులో కూడా కొంతో గొప్పో డబ్బులున్న యువకులు పోటీకి సిద్ధం అంటూ షోషల్ మీడియాలో ప్రకటిస్తున్నారు.

టీఆర్ఎస్ సానుబూతి పరులు ముందుకు

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాధరణతో టీఆర్ఎస్ ఘనవిజయం సాధించడంతో ఆ పార్టీకి చెందిన గ్రామ ముఖ్యనేతలు, కార్యకర్తలు పోటీ చేసేందుకు పోటీ పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే గెలుపుతో పంచాయితీ ఎన్నికల్లో సైతం తాము గెలుస్తామన్న ధీమాతో ఉన్నారు. ఇదిలాఉంటే పంచాయితీ ఎన్నికలు భారీ ఖర్చుతో కూడుకున్నవని, సర్పంచ్ పదవితో ఒరుగబెట్టేదీ ఏమీ ఉండదంటూ గ్రామాల్లోని పెద్దలు విముఖత చూపుతున్నారు. ఈ సారి పంచాయితీల్లో పోటీ చేసేందుకు ముఖ్యంగా యువత ఉత్సాహం చూపుతున్నారు. విపక్షపార్టీలైన కాంగ్రెస్, టీడీపీలతో పాటు మరికొన్ని పార్టీలు పంచాయితీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలన్న గట్టి పట్టుదలతో అభ్యర్థుల ఎంపిక




ప్రక్రియపై కసరత్తు ప్రారంభించారు.

ఎమ్మెల్యేల సహాయం

ఇటీవల ఎమ్మెలుగా గెలిచిన వారి నుంచి ఆ పార్టీకి చెందిన నేతలు పంచాయితీ ఎన్నికల బరిలో వారి సహాయం కోరుతున్నారు. ఖర్చుతో కూడుకున్న ఎన్నికలు కావడంతో ఆర్థిక సహాయం అందిస్తే గెలుస్తామని వారితో మాటామంతీ కొనసాగిస్తున్నారు.

సాహిత్యం-సమగ్ర పరిశీలన పుస్తకాన్ని ఆవిష్కరించిన కేటీఆర్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ బిఎస్.రాములు రచించిన సాహిత్యం-సమగ్ర పరిశీలన పుస్తకాన్ని మాజీ మంత్రి, టీఆర్ఎస్ పార్టీ గౌరవాధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు ఆవిష్కరించారు. ఈ గ్రంథంలో రాములు తన బాల్య జీవితం నుంచి బిసి కమిషన్ ఛైర్మన్ దాకా అనేక ఘట్టాలను తెలియజేశారు. కథలు, నవలలు, సాహిత్య గ్రంథాలు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రతి నెల ప్రచురించిన పుస్తకాల విశిష్టత, సాహిత్య విశ్లేషణలను సంక్షిప్తంగా అనేక కోణాల్లో పరిశీలించారు. ఈ పుస్తకానికి కత్తి పద్మారావు, బన్న ఐలయ్య, అంపశయ్య నవీన్‌లు ముందుమాట రాశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.

సర్కార్‌కు కోర్టు మొట్టికాయలు



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధిః సినీ హీరో ప్రభాస్ గెస్ట్ హౌస్ సీజ్ చేసిన కేసులో రెవెన్యూ అధికారులకు హైకోర్టు మొట్టికాయలు వేసింది. ప్రభాస్ పెట్టుకున్న రెగ్యులరైజేషన్ దరఖాస్తును పరిశీలనలోకి ఎందుకు తీసుకోలే దని.. రెగ్యులరైజేషన్‌ను తిరస్కరిం చినట్టు ఉత్తర్వులు ఉన్నాయా? అంటు సూటిగా ప్రశ్నించింది. దీనిపై స్పందిం చిన ప్రభుత్వం తరపు న్యాయవాది పూర్తి వివరాలను నేడు కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. రాయదుర్గంలోని తన గెస్ట్ హౌస్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసారు. దీనిపై హైకోర్టులో ప్రభాస్ పిటీషన్ వేసారు. ఈ పిటిషన్ పై విచారణకు స్వీకరించిన ధర్మాసనం తెలంగాణ రెవెన్యూ అధికారులను కోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాలను జనవరి 3న కోర్టుకు సమర్పిస్తామని చెప్పడంతో కేసును రేపటికి వాయిదా వేసింది..

ప్రజాకూటమిలోని పార్టీల దారెటు ?



ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలల్లో ప్రజాకూటమిని తిరస్కరించిన ప్రజలు

● లోక్‌సభ ఎన్నికల నాటికి కలిసి ఉండే పార్టీలేవి ● ఇప్పటికే సొంత ఎజెండాను సిద్ధం చేసుకుంటున్న కోదండరామ్ ● సీపీయంతో కలిసి పోయేందుకు సీపీఐ తాజా ప్రయత్నాలు ● టీడీపీ పొత్తుపై కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ టీడీపీ తెలంగాణ జన సమితి సీపీఐ జట్టుగా ఏర్పడి ప్రజాకూటమిగా బరిలోకి దిగిన సంగతి తెల్సిందే. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయదుందుభి మోగించి ఏకంగా 88 స్థానాలను కైవసం చేసుకొని తెలంగాణలో ఎదురులేని శక్తిగా నిలిచింది. కాగా ప్రజాకూటమిగా ఏర్పడిన విపక్షాలను ఓటరు ఏ మాత్రం పట్టించుకున్నట్లు కనబడలేదు. ప్రజాకూటమిలోని కాంగ్రెస్ 16 సీట్లు టీడీపీ రెండు స్థానాలు దక్కించుకున్నాయి. ఇక కూటమిలోని తెలంగాణ జన సమితి సీపీఐ పార్టీలు కనీసం ఖాతా కూడా తెరవలేదు. ఈ ఫలితాలపై ఎవరికి వారు సన్నాయి నొక్కులు నొక్కుతుండటం విశేషం. ఇంకా నాలుగైదు నెలలో లోక్ సభ ఎన్నికలు ఉండటంతో ఈ ఎన్నికల్లో ప్రజాకూటమి ఉంటుందా? లేదా అనే చర్చ జరుగుతోంది. ఈ కూటమి నుంచి తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం తప్పుకుంటారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ఆయన ప్రకటించారు. ఈనేపథ్యంలో కోదండరాం ప్రజాకూటమిగా లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీపై దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాకూటమి ఓటమిపై కారణాలు తయారుచేసి హైకమాండ్ కు కాంగ్రెస్ పెద్దలు నివేదికలు కూడా పంపించారు. టీడీపీతో పొత్తు కూటమిని కొంత ఇబ్బంది పాలుచేసినా వేరే కారణాలే ఎక్కువ ప్రభావితం చేశాయని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ అభిప్రాయపడుతున్నారు. అందుకే లోక్ సభ ఎన్నికల్లో కూటమిని కొనసాగించినా తప్పులేదని అభిప్రాయం పీసీసీ వర్గాల్లో ఉన్నట్లు చర్చ నడుస్తుంది. ప్రజాకూటమి ఓటమిపై కోదండరాం స్పందిస్తూ అభ్యర్థులను త్వరగా ఎంపిక చేయకపోవడం ప్రచారానికి సమయం లేకపోవడం కారణమని తాజాగా విశ్లేషించారు. టీఆర్ఎస్ పై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నా తాము సమర్థవంతంగా వినియోగించుకోలేకపోయామని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో దొర్లిన పొరపాట్లు ఇక ముందు జరుగకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. ఇక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ పొత్తు విషయంలో సానుకూలంగానే ఉన్నారు. కావున ప్రజాకూటమిలో టీడీపీ కొనసాగే అవకాశం ఉంది. కాంగ్రెస్ కూడా జాతీయస్థాయిలో బీజేపీకి వ్యతిరేక శక్తులను కలుపుకొని లోక్ సభ ఎన్నికల్లో ఎదుర్కొవాలని చూస్తుంది. ఇప్పటికే మహారాష్ట్రలో ఎన్సీపీతో సీట్ల సర్దుబాటు కూడా జరిగిపోయింది. ఇక తెలంగాణలో ఉన్న కూటమిని కాదనుకునే విధంగా కాంగ్రెస్ వ్యవహరించడం లేదు. లోక్ సభ ఎన్నికల్లో కూడా ప్రజాకూటమి ఆలోచనతో వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. కానీ కోదండరాం మాత్రం కాంగ్రెస్ కూటమితో కలిసివెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో లోక్ సభ ఎన్నికల వరకు ప్రజాకూటమిలో ఏదైనా మార్పు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయా? లేక విడిగా పోటీ చేస్తాయనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

‘త్వరలో సర్వీసు రూల్స్ సాధిస్తాం’



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః సంక్రాంతి పండగ కానుకగా ఉపాధ్యాయులకు యాజమాన్యాల వారీగా పదోన్నతులు కల్పించేలా షెడ్యూల్ విడుదల చేయించి రాష్ట్రంలోని ఉపాధ్యాయ ఖాళీలన్నీ భర్తీ చేయిస్తామని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పూల రవీందర్ అన్నారు. సర్వీస్ రూల్స్‌పై సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరపున పోరాడుతున్నామన్నామని, అతి త్వరలోనే సర్వీస్ రూల్స్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 45శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇప్పిస్తామని, ఇందుకుగాను ముఖ్యమంత్రితో చర్చించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 2018 జూన్ 2నుంచి పీఆర్సీని అమలు చేస్తే నగదు రూపంలో బకాయిలు ఇప్పిస్తామన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులి సరోత్తంరెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ వయస్సు 61ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు త్వరగా ఇచ్చి పదవీ విరమణ చేసే ఉపాధ్యాయులను కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్ జీవోను త్వరగా అమలు చేయాలని కోరారు.కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు రాంచం ద్రం, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్రావ్, అశోక్‌రావు, సదానందం, శైలజ, పట్టాభి, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా చార్మినార్

● వర్షపునీటి కాలువ పునరుద్దరణ
● మునిసిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః చార్మినార్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రాత్రి వేళ చార్మినార్ మెరిసిపోయే విధంగా లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మున్సిపల్, సమాచార, పౌరసంబధాలశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పాతబస్తీలో వర్షపునీటి కాల్వలను పరిశీలించారు. చార్మినార్ పరిసరాలను సందర్శించిన అనంతరం పాతనగరంలో శాలిబండ, హిమ్మత్‌పుర, అబ్దుల్లా బిల్డింగ్, ముర్గిచౌక్, సిటీకాలేజ్, నయాపూల్ ప్రాంతాలలో ఉన్న వర్షపునీటి కాల్వలను పరిశీలించారు. శాలిబండ ప్రాంతంలో దశాబ్దాల క్రితం నిజాం పరిపాలన సమయంలో ఏర్పాటుచేసిన పాత వర్షపునీటి కాల్వలు ఇప్పటికి సమర్ధంగా పనిచేస్తున్నాయని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అన్నారు. 1908లో మూసి వరదలు సంభవించాయి. మోక్షగుండం విశ్వేశ్వరయ్య మార్గదర్శకత్వంలో ఈ డ్రైన్లను నిర్మించారని అధికారులు ముఖ్యకార్యదర్శికి వివరించారు. ఆ సమయంలోనే నగరంలో మంచినీటి సరఫరా వ్యవస్థకు డిజైన్ చేశారు. వారంలోగా నయాపూల్ పరిసరాలలో పరిశుభ్రతను మెరుగుపరచాలని జోనల్ కమీషనర్‌ను ఆదేశించారు ఆర్చ్ బ్రిడ్జికి లైటింగ్, ఫిన్సింగ్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఛీఫ్ ఇంజనీర్ జియావుద్దీన్, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



‘ఉద్యోగ, ఉపాధ్యాయులకు 43శాతం ఐఆర్ ప్రకటించాలి’



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 43 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ మహాసభలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వెల్లడించారు. పాఠశాల విద్యా రంగంలో సానుకూల సంస్కరణల అమలుకు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో గ్రామీణ విద్యా సదస్సులు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, సిలబస్, సీసీఈ తదితర అంశాలను అధ్యయనం చేసి లోపాల సవరణకు కృషి చేయాలని మరో తీర్మానం చేశామన్నారు. ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని యూటీఎఫ్ నాయకులు కోరారు.

కోర్టులో ఆర్డినెన్స్ చెల్లుతుందా ?

● మంత్రివర్గం నిర్ణయం లేకుండా ఆర్డినెన్స్ చెల్లదంటున్న బీసీలు ● గత హర్యానా ప్రభుత్వం జారీ చేసిన ఇటువంటి ఆర్డినెన్స్‌ను కొట్టివేసిన కోర్టు ● ఈ ఆర్డినెన్స్‌తో 1400 సర్పంచ్ పదవులు బీసీలకు దూరం ● భద్రా చలం జిల్లాలో ఒక్క బీసీకీ దక్కని సర్పంచ్ స్థానం ● మేడ్చల్ జిల్లాలో 12, వరంగల్లో 18 సర్పంచ్ స్థానాలు మాత్రమే బీసీలకు ● 550 మండలాల్లోని 42 మండలాల్లో బీసీలకు ఒక్క సీటూ దక్కని వైనం ● బీసీలకు పంచాయతీ ఎన్నికలలో 34శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీల డిమాండ్ ● రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించిన బీసీ సంఘాలు ● పంచాయతీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లపై నేడే హైకోర్టులో చర్చ

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలల్లో రిజర్వేషన్లు అమలు చేస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ బీసీలు వేసిన పిటిషన్‌పై హైకోర్టులో నేడు విచారణకు రానుంది. న్యాయస్థానం వెలువరించే తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కాగా..తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఆర్డినెన్స్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే. అలాగే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ ఎన్నికలల్లో రిజర్వేషన్ల అమలులో తమ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. గతంలో హర్యానా రాష్ట్రంలో మంత్రి వర్గం నిర్ణయం లేకుండా జారీ చేసిన ఆర్డినెన్స్‌ను న్యాయస్థానం కొట్టివేసిందని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో మంత్రి వర్గం నిర్ణయం లేకుండా జారీ చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఒకవేళ హైకోర్టు ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను కొట్టివేస్తూ తీర్పును వెల్లడిస్తే..ఎన్నికల వాయిదా పడటంతో పాటు ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదే. కాగా.. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టి, చట్ట సభలలో బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు చే పట్టాలని బీసీ నేత ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ తెలంగాణ పంచాయతీ ఎన్నికలల్లో బిసిల రిజర్వేషన్లను తగ్గించడం అన్యాయమని విమర్శించారు. ఒక వైపు దీనిపై హైకోర్టులో కేసులున్నా..ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. బుధవారం బషీర్‌బాగ్‌లో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్సు రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. మంత్రి వర్గం నిర్ణయం లేకుండా ఆర్డినెన్సు జారీ చేశారని, ఇది రాజ్యాంగ విరుద్ధం అన్నారు. గతంలో హర్యానా తదితర రాష్ట్రాలలో మంత్రివర్గం లేకుండా జారీ చేసిన ఆర్డినెన్సు కోర్టులు కొట్టి వేశాయని తెలిపారు. బీసీల రిజర్వేషన్లు 34శాతం నుంచి 22కు తగ్గించడంతో దాదాపు 1400 మంది సర్పంచ్ పదవులు, 15వేల మంది వార్డు మెంబర్లు పదవులు బీసీలకు దక్కకుండా పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక చాలా జిల్లాలలో బిసిలకు పెద్ద ఎత్తున అన్యాయం జరుగుతుందన్నారు. భద్రాచలం జిల్లాలో ఒక్క సీటు కూడా బీసీలకు దక్కలేదన్నారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 12, వరంగల్ జిల్లాలో 18 సీట్లు బీసీలకు దక్కాయని, రాష్ట్రంలోని 550



మండలాల్లో దాదాపు 42 మండలాల్లో ఒక్క సీటు కూడా బీసీలకు దక్కడం లేదని, గతంలో బీసీలకు ఎప్పుడూ ఇలా జరుగలేదన్నారు. ఒకవైపు బీసీలు రిజర్వేషన్లు జనాభా ప్రకారం 34 నుంచి 56శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తుంటే..మరోవైపు కోర్టు తీర్పులను సాకుగా చూపిస్తూ రిజర్వేషన్లు తగ్గించడం అన్యాయం అన్నారు. 1993లో 73-74 రాజ్యాంగ సవరణ చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీ, మహిళలకు జనాభా రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగాన్ని సవరించారు. కానీ బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్రాల స్వేచ్ఛకు వదిలిపెట్టారు. బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత లేకపోవడంతో హైకోర్టులు-సుప్రీం కోర్టులు పదే పదే జోక్యం చేసుకొని బిసి రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలు చేస్తున్నారని, అందుకోసం ప్రధానమంత్రి జోక్యం చేసుకొని పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టి బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు చే పట్టాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నీల వెంకటేశ్, భూపేష్ సాగర్, అనంతయ్య, దాసు సురేష్, గజేందర్, నరేష్ గౌడ్, టిఆర్. చందర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ...కాంగ్రెస్ పొత్తుపై నేడు సిడబ్లుసిలో స్పష్టత

విజయవాడ, మేజర్‌న్యూస్: ఆంధ్రప్ర దేశ్ పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరా రెడ్డి గురు వారంనాడు ఢిల్లీలో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి హాజ రుకానున్నారు. ఏపీలో టీడీపీతో పొత్తు పెట్టు కోవాలా వద్దా అనే అంశంపై అధిష్టానంతో రఘు వీరారెడ్డి ప్రధానంగా చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం ఈ అంశంపై ఓ స్పష్టత వచ్చే అవకాశమున్న ట్టు తెలిసింది. కర్నూలులోని నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో రఘువీరా మాట్లాడుతూ టీడీపీతో పొత్తుపై ఏఐసీసీ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ, ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఒమెన్ చాందీ, ఇతర సీనియర్ నేతలు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన చెప్పారు. రఘువీరారెడ్డి చేసిన ఈ ప్రకటనపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. టీడీ పీ, కాంగ్రెస్ పొత్తుపై ఏం నిర్ణయం వెల్లడిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

ప్రభుత్వం అడవుల రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తోంది

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః దేశంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే పర్యావరణం, అడవుల రక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం పెట్టిన బాధ్యతను అధికారులు, సిబ్బంది కచ్చితంగా నెరవేర్చాలి అని అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి పీ.కే.ఝా అన్నారు. అరణ్య భవన్ లో జరిగిన కొత్త సంవత్సర వేడుకల్లో ఉన్నతాధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. హరితహారంతో సహా, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, ప్రాజెక్టుల ప్రత్యామ్నాయ భూముల్లో మొక్కల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణ నిబద్ధతతో చేపటాలని, ఈయేడాది కొత్తగా రెండు వేల మంది కొత్త సిబ్బంది అటవీ శాఖలో చేరుతున్న ప్రక్రియ తుది దశలో ఉందని, ఇది శాఖ మరింత బలోపేతానికి దోహద పడుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ రఘువీర్, పృధ్వీరాజ్, అదనపు అటవీ సంరక్షణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సర్కార్‌పై కొత్త కుట్ర : సినీనటుడు శివాజీ

విజయవాడ, మేజర్‌న్యూస్: చంద్రబాబు ప్రభుత్వంపై కొత్త కుట్రకు మరోసారి ప్రయత్నిస్తున్నారని సినీనటుడు శివాజీ ఆరోపించారు. టీడీపీ నుంచి ఓటర్లను దూరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. చుక్కల భూముల పేరుతో కుట్రకు తెరదీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్కల భూముల రైతులను ప్రభుత్వంపై ఉసిగొల్పేందుకు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. చుక్కల భూములను ఈస్ట్ ఇండియా కంపెనీ రెగ్యులరైజ్ చేసిందన్నారు. ఆ ఫైల్‌ను కొంతమంది అధికారులు తొక్కిపెట్టారని హీరో శివాజీ వెల్లడించారు. కొందరు అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని శివాజీ తెలిపారు. అంత ఇష్టముంటే రాజీనామా చేసి విపక్షపార్టీలో చేరాలని ఆయన సూచించారు. విపక్షానికి ప్రజాసమస్యలు పట్టవని, వారికి కావాల్సింది సీఎం కుర్చీనేనని విమర్శించారు. చుక్కల భూములపై మంత్రులను అధికారులు లెక్కచేయడం లేదని చెప్పారు. చుక్కల భూముల సమస్య రాజకీయ ఎత్తుగడకు అవకాశంగా మారిందని ఆరోపించారు. గట్టిగా మాట్లాడితే భూములు లాక్కుంటామని కలెక్టర్ బెదిరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆ భూములు కలెక్టర్ అబ్బ సొత్తా అని శివాజీ ప్రశ్నించారు. సీఎం బతిమిలాడుతున్నా కలెక్టర్లు వినడం లేదన్నారు. ప్రజలను టార్గెట్ చేసిన అధికారుల కాలర్ పట్టుకుని అడుగుతానన్నారు. అన్ని ఆధారాలను సీఎం చంద్రబాబుకు అందజేస్తానని చెప్పారు. సంక్రాంతిలోగా సమస్యను పరిష్కరించకుంటే నిరాహార దీక్ష చేస్తానని శివాజీ స్పష్టం చేశారు.

ఎంపీ వద్దు...ఎమ్మెల్యేయే ముద్దు

- ఎన్నికల్లో పోటీ విషయంలో అభ్యర్థుల మనోగతం
- ఎమ్మెల్యే అయితే మంత్రి పదవికి అవకాశం
- ఎంపీగా వెళ్లితే ఎంపీగానే పరిమితం కావాల్సి వస్తుంది
- ఎన్నికల్లో కూడా అదనపు ఖర్చు
- ప్రధాన పార్టీలలో బలమైన అభ్యర్థుల మనోగతం
- సిట్టింగ్ సీట్లలో ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పుకు టీడీపీ యోచన ?
- దీంతో టీడీపీ ఎంపీల యూటర్న్ ఆలోచనలు
- వైసీపీలోని ప్రముఖుల ఆలోచన ఇదేనా ?
- అన్ని విధాలా ఎమ్మెల్యే సీటుయే మేలన్న భావన



(ఏపీ-పొలిటికల్ బ్యూరో) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో వచ్చే ఎన్నికల నాటికి అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారే అవకాశమున్నందున్నా, ఎన్నికల గోదాలో దిగే అభ్యర్థుల ఆలోచన విధానంలోనూ పెను మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీలలో ఉత్కంఠభరిత రాజకీయాలు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రధాన పార్టీలో టికెట్టు వస్తే చాలు అన్న ఆలోచనలు అభ్యర్థులకు ఉండేవి. అది ఎంపీ టిక్కెట్టా లేక ఎమ్మెల్యేనా అన్న దాంట్లో పెద్ద వివాదం అయ్యేదికాదు. కానీ ఈ ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది. దీంతో ఫలాన టిక్కెట్టుయే తమకు దక్కాలన్న ఆలోచనలను ఎన్నికల గోదాలో దిగుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు కలిగిఉన్నట్లు తెలుస్తోంది. ఈ సారి ఎన్నికల్లో ఈ ప్రధాన పార్టీలోని ముఖ్యమైన, కీలక నేతలు ఎంపీ సీటు కంటే ఎమ్మెల్యే సీటుయే మేలన్న ఆలోచనలతో ఉన్నట్లు సమాచారం. ఇందుకు ఆ పార్టీ నేతలకు ఉన్న కారణాలు వారికి లేకపోలేదు. ఎంపీ సీటు వల్ల ప్రయోజనం కంటే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగడమే మేలన్న అభిప్రాయంతో ప్రధాన పార్టీలలోని అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది. అధికార టీడీపీకి చెందిన ఎంపీలు కొందరు వచ్చే ఎన్నికల్లో తిరిగి లోక్‌సభ అభ్యర్థిగా కాకుండా ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగాలని యోచిస్తున్నట్లు సమాచారం. వైసీపీలోనూ ఇలాంటి ఆలోచనలు అక్కడక్కడా ఎంపీ అభ్యర్థుల మదిలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎంపీ కంటే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగే అభ్యర్థులు కూడా రాజకీయ విశ్లేకుల వ్యాఖ్యలను అంగీకరిస్తున్నారు.

ఎన్నికల ఖర్చు భారం...మంత్రి పదవీ దక్కదు...?

ఒక లోక్‌సభకు ఎంపీగా ఉండే కంటే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అవ్వడమే మేలన్న అభిప్రాయంతో ఇప్పటికే ఎంపీలుగా ఉన్న వారు, గతంలో ఎంపీ అభ్యర్థులుగా పోటీచేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. మేం చాలా ఏళ్లుగా ఎంపీగా ఉన్న మంత్రి పదవులు పొందలేని పరిస్థితి అని ఎంపీలుగా ఉన్న వారిలో వినిపిస్తున్న మాట. ప్రాంతీయ పార్టీలు ఏదో ఒక జాతీయ పార్టీతో జతకలసి ప్రభుత్వంఏర్పాటు చేసినా కేంద్రంలో వచ్చే మంత్రి పదవులు ఒకటి, రెండు మాత్రమే. ఆ రెండు పదవులకు ఏ ప్రాంతీయ పార్టీ అయినా సరే అందులో ఉండే పోటీ అంతా ఇంతా కాదు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో తన పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యేల ఖర్చు భారం ఎంపీ అభ్యర్థిపైనే పడటం సహజమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే అభిప్రాయంతో ఎంపీలు, ఎంపీ అభ్యర్థులు ఉన్నారు. తన పరిధిలోకి వచ్చే ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచార వ్యయ భారం మీద వేసుకొని, వచ్చే ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో తన ప్రభావం చూపుకోగలిగితేనే ఎంపీగా గెలిచే అవకాశముంటుంది. ఇంత వ్యాయ ప్రయాసం చేసి ఎన్నికల్లో గెలిచినా కేంద్రంలో ప్రాంతీయ పార్టీ అధికారంలోకి రాదు కాబట్టి తన పదవీ కాలం ముగిసే వరకు లోక్‌సభ సభ్యుడిగానే మిగిలిపోవాల్సి వస్తుంది. అలా కాకుండా ఏదో ఒక జాతీయ పార్టీతో జతకలసి సంకీర్ణ ప్రభుత్వంలో చేరినా ప్రాంతీయ పార్టీలకు ప్రధాన పార్టీ ఇచ్చే కేంద్ర పదవులు ఒకటి లేదా రెండు మాత్రమే. ఈ పరిస్థితుల్లో తాము ఎందుకు ఎంపీ ఎన్నికల గోదాలో దిగాలని ప్రధాన పార్టీలలోని కొందరు అభ్యర్థుల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే అసెంబ్లీ బరిలోకి దిగితే ఎంపీ అభ్యర్థి కంటే ప్రచారం వ్యయంలో సగం తగ్గించుకొని ఒక అసెంబ్లీపై దృష్టిసారిస్తే చాలు గెలుపొంది గట్టెక్కవచ్చని వారు భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా తమకు ఇతర నియోజకవర్గాలలో పట్టుండటం వల్ల సహజంగానే వాటిని కాపాడుకొనేందుకు అధికారంలోకి వచ్చినప్పుడు పార్టీ అధినాయకత్వం తమకు మంత్రి పదవులు కూడా కట్టబెడుతుందని ఈ అభ్యర్థుల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా టీడీపీ, వైసీపీ, జనసేన ఇలా అన్ని పార్టీలలో కొందరు అభ్యర్థులు ఎంపీలుగా పోటీచేసే కంటే ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలోకి దిగడమే మేలన్న అభిప్రాయంతో ఉన్నట్లు సమాచారం.

ఇదిలావుంటే ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు ఉండే అవకాశమున్నందున తమ ఆలోచనలకు అనుగుణంగా ఎమ్మెల్యే టిక్కెట్టు కోసం ఇప్పటినుంచే అంతర్గతంగా ఎంపీ అభ్యర్థులు తమ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి తమకు ఎంపీ కంటే ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించండి అని అధిష్ఠానం సన్నిహితుల వద్ద కొందరు అభ్యర్థులు ఇప్పటికే మొరపెట్టుకొంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఏ టిక్కెట్టు ఎవరికి దక్కుతుంది అన్నది ఆసక్తిగా మారబోతోంది.

హోదా కోసం పార్లమెంటులో వైసీపీ ఆందోళన



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం పార్లమెంటులో ఆందోళన చేపట్టింది. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద వైసీపీ రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ హైకోర్టు భవనాల నిర్మాణంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. హైదరాబాద్‌ను తానే నిర్మించానంటూ చెప్పుకుంటున్న చంద్రబాబు నాలుగున్నరేళ్లుగా హైకోర్టు భవనం నిర్మించలేదని ఎద్దేవా చేశారు. హైకోర్టును హైదరాబాద్ నుంచి అమరావతికి తీసుకురావడం చంద్రబాబుకు ఇష్టం లేదని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటి సరిగా అమలు కాలేదని విమర్శించారు. శంకుస్థాపనలతో చంద్రబాబు జనాలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు ప్రతి రాజకీయ పార్టీతో కాపురం చేశారని, ఎన్టీఆర్ సిద్ధాంతాలకు చంద్రబాబు తూట్లు పొడిచారని విమర్శించారు. చంద్రబాబు పవన్‌తో గతంలో వివాహం చేసుకుని విడాకులు ఇచ్చి, మళ్లీ పవన్‌ను వివాహం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. చంద్రబాబుకు నారా పవన్ రాహుల్ నాయుడని సముచితమైన పేరు ఉందని వ్యాఖ్యానించారు.

జనసేనలో టీడీపీ కోవర్టులు : చంద్రబాబు నాయుడు నక్కజిత్తుల రాజకీయం అన్ని వేళలా, అంతటా పనిచేయదని విజయసాయిరెడ్డి ట్విటర్ వేదికగా చంద్రబాబు వ్యవహార శైలిపై మండిపడ్డారు. ఖమ్మంలో గెలిచిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలను చంద్రబాబు నాయుడు టీఆర్ఎస్‌లో చేరిపోమంటున్నారని ఆరోపించారు. తన కోవర్టులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించి ఆ పార్టీని నాశనం చేశారని అన్నారు. జనసేనలోకి కూడా తన కోవర్టులను పంపించి ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను తప్పుదారి పట్టిస్తున్నారని వ్యాఖ్యానించారు.

హామీల అమలులో బాబు విఫలం



విజయవాడ, మేజర్‌న్యూస్: గత ఎన్నికల సమయంలో ప్రజలకు 600 హామీలిచ్చిన చంద్రబాబు ఈ ఐదేళ్ల కాలంలో వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వైసీపీ నేతలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్‌లు తీవ్రంగా విమర్శించారు. విజయవాడలోని వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో వెల్లంపల్లి, మల్లాది విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా 15 ఏళ్లు కావాలని అడిగి దానిని మళ్లీ నీరుగార్చారని బాబుపై మండిపడ్డారు. ప్రత్యేక హోదా కోసం విభజన జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు నిజాయతీగా ఉద్యమించింది వైఎస్ జగన్ మాత్రమేనని అభిప్రాయపడ్డారు. యూటర్న్ బాబు అంటే చంద్రబాబేనని ఎద్దేవా చేశారు. రుణాలు మాఫీ చేస్తానని డ్వాక్రా అక్కచెల్లెమ్మలను, బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి నిరుద్యోగులను చంద్రబాబు మోసగించారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 25 లక్షల ఇళ్లు కట్టిస్తానని మాట ఇచ్చి వైఎస్ హయాంలో కట్టిన ఇళ్లనే చూపిస్తూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పూర్తిగా రుణమాఫీ జరగలేదని తెలిపారు. జన్మభూమి కార్యక్రమం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అసలు వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటు అడిగే హక్కే లేదని తీవ్రంగా మండిపడ్డారు.

ఏ పార్టీతోను పొత్తు పెట్టుకోం



విజయనగరం, మేజర్ న్యూస్: తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని బీజేపీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీ నారాయణ స్పష్టం చేశారు. విజయనగరంలో లక్ష్మీనారాయణ విలేక రులతో మాట్లాడుతూ తెలం గాణాలో ఒంటరిగా పోటీ చేశామని, ఏపీలోనూ ఒంట రిగానే వెళ్తామని చెప్పారు. విభజన హామీలకు సంబం దించి కేంద్రం స్పష్టంగా ఉందని కేవలం రాష్ట్ర ప్రభుత్వమే అయోమయానికి గురిచేసిందని వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల కంటే అధికంగా కేంద్రం, ఏపీకి నిధులు ఇచ్చిందని తెలిపారు. చంద్రబాబు నిజం చెప్పిన దాఖలాలు లేవని అన్నారు. ఆయన చెప్పే ప్రతిమాటా అబద్ధమేనని అన్నారు. జన్మభూమి కమిటీలను రద్దు చేశామని చంద్రబాబు ప్రకటించినప్పటికీ ఇప్పటికీ ఆ కమిటీల ద్వారానే గ్రామాల్లో పాలన నడుస్తోందని విమర్శిం చారు. జన్మభూమి కమిటీలను రాజ్యాంగేతర శక్తిగా మార్చి గ్రామీణ పాలనను నిర్వీర్యం చేసింది టీడీపీ ప్రభుత్వమేనని విమర్శించారు. భారతదేశమంతా చంద్రబాబు చక్రం తిరిగినట్లు తిరిగారు, ఏ ఫ్రంట్ ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. కడప స్టీల్ ప్లాంట్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నూటికి నూరుపాళ్లు సిద్ధంగా ఉందని వెల్లడించారు. చంద్రబాబుకు రాజకీయం తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టడం లేదన్నారు. విభజన హామీలను నెరవేర్చడానికి బాబు సహకరించడం లేదని ఆరోపించారు. సుమారు 15 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు, ఆయన పేరు చెప్పుకునేందుకు ఒక్క ప్రాజెక్టు అయినా కట్టారా అని ప్రశ్నించారు.

అమరావతిలో హైకోర్టు ఏర్పాటు దారుణం

విజయవాడ, మేజర్‌న్యూస్: రాయలసీమకు రావాల్సిన హైకోర్టును అమరావతిలో ఏర్పాటు చేయటం దారుణమని కాంగ్రెస్ నేత తులసిరెడ్డి మండిపడ్డారు. రాయలసీమలో కనీసం హైకోర్టు బెంచ్ అయినా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని తులసిరెడ్డి అన్నారు.

చలి చంపేస్తోంది

- మరో ఆరు రోజులు ఇదే పరిస్థితి
- ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లని జనం
- చలిపులితో వృద్ధుల అవస్థలు
- ఫ్లూ జ్వరం, జలుబుతో ప్రజలు విలవిల



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పై చలి పులి పంజా విసురుతోంది. గతంలో ఎన్నడు లేనంతగా ఉదయం, రాత్రి పూట చలి పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర చలికి ఏపీ, తెలంగాణ గజ గజ వణుకుతన్నాయి. గత కొద్ది రోజులుగా తీవ్ర చలి గాలులు వీస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట నమోదయ్యాయి. ఇదే పరిస్థితి మరో ఆరు రోజులుంటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పగలు, రాత్రిపూట ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పడిపోతున్నాయి. ఉత్తర భారతం నుంచి వీస్తున్న శీతల గాలుల ఉధృతికి చలి తీవ్రత తగ్గడం లేదు. మరో వారంరోజులపాటు దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారి తెలిపారు.

తెలంగాణలోని ఆదిలాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, హైదరాబాద్ ,రంగారెడ్డి తదితర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు తీవ్ర చలి పెడుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేకపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు చల్లటి గాలులతో తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. తీవ్ర చలికి గజ గజ వణికిపోతున్నారు. వివిధ పనులపై భయటికి వెళ్లిన జనం రాత్రి కాకముందే ఇళ్లకు చేరుకుంటున్నారు.

బుధవారం తెల్లవారుజామున ఆదిలాబాద్‌లో 5, మెదక్‌లో 6, రామగుండం, హన్మకొండ, హైదరాబాద్ లలో 9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాత్రి పూట సాధారణం కన్నా 8 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రత ఉండటంతో ప్రజలు చలితో గజ గజ వణికిపోయారు. రాత్రి సమయంలో మంచుతో వాతావరణం బాగా చల్లబడుతోంది. పగలు పొడి వాతావరణం వల్ల గాలిలో తేమ తగ్గుతుంది. మంగళ, బుధవారాల్లో ఏపీలోని అన్నిజిల్లాలో చలి ప్రభావం తీవ్రంగా ఉంది. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. కోస్తా జిల్లాలో సాధారణం కన్నా 3 నుంచి 6 డిగ్రీలు, రాయలసీమలో 3 నుంచి 4 డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యాయి. చింతపల్లిలో బుధవారం 2.5 డిగ్రీల ఉష్ణోగ్రత, కోస్తాలో అత్యల్పంగా జంగమహేశ్వరపురంలో 10.2 డిగ్రీలకు ఉష్ణోగ్రతకు పడిపోయింది. గత పదేళ్లలో ఇంత తక్కువగా ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే తొలిసారి. రాయలసీమలో అత్యల్పంగా ఆరోగ్యవరంలో 12 డిగ్రీలు నమోదు అయింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తీవ్రంగానూ దక్షిణకోస్తా, రాయలసీమలో ఓ మోస్తారుగానూ చలిగాలుల ప్రభావం ఉంది.

రోగాలబారిన జనం : తేమ ఎక్కువగా ఉండే వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్ లు స్వైర విహారం చేస్తున్నాయి. చలి తీవ్రత పెరగడంతో ఫ్లూ జ్వరాలతో ఆస్పత్రుకెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. మున్ముందు చలి తీవ్రత మరింతగా పెరిగే అవకాశాలుండటంతో పొంచి ఉన్న చలి ముప్పును తప్పించుకోవడానికి ముందస్తు జాగ్రాత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

'మోడీ ప్రధానిగా ఉండటం మన దురదృష్టం'



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: నరేంద్ర మోదీ భారత ప్రధానిగా ఉండటం దేశ ప్రజల దురదృష్టమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొద్దిమంది రైతులే రుణాలు తీసుకుంటున్నారని మోదీ అనటం బాధాకరమన్నారు. దేశంలోని రైతులు అందరూ రుణాలు తీసుకుంటున్నారని తెలిపారు. రుణమాఫీ చేయకుండా ఉండటానికే మోదీ అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధన, కేంద్ర వైఖరికి నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర భారీ ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు. ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని సంఘాలు, మేధావులు విభజన హామీలు అమలు చేయాలని కోరుతున్నారని తెలిపారు. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బీజేపీ కనీసం ఐదేళ్లు కూడా ఇవ్వకుండా మొండి చేయి చూపిందని మండిపడ్డారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం ఇప్పటి వరకు 15 వందల కోట్ల రూపాయలే ఇచ్చిందని తెలిపారు. వెనకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం, రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రెవెన్యూ లోటు 16వేల కోట్లు ఉందంటే, కేవలం మూడున్నర వేల కోట్లే ఇచ్చారని పేర్కొన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు.

రాజధానికి తలమానికం 'కృష్ణా'

- వ్యవసాయంపై ఎక్కువ ఫోకస్
- పెరిగిన స్థూల ఉత్పత్తి
- ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట
- మత్స్య సంపదలోనూ మెరుగు
- వచ్చే ఏడాది లక్ష్యం 12.50 లక్షల టన్నులు
- తలసారి ఆదాయంలోనూ టాప్
- రంగాల వారీగా ఫోకస్ చేస్తున్నాం
- త్వరలో బందరు ఓడరేవు పనులకు శ్రీకారం
- 'సూర్య' ప్రత్యేక ఇంటర్వ్యూలో కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం



('సూర్య' ప్రత్యేక ప్రతినిధి-అమరావతి) : 'నవ్యాంధ్రలో రాజధాని అమరావతి పేరు ప్రఖ్యాతులను నలుదిక్కులా సగర్వంగా చాటి చెప్పేలా కృష్ణా జిల్లా అన్నింటికన్నా తలమానికంగా నిలుస్తోంది. రాజధాని జిల్లా అయిన గుంటూరు జిల్లాలో పారిశ్రామికంగా వృద్ధి రేటు గణనీయంగా ఉంది. 24.39 శాతం వృద్ధిరేటు నమోదైంది. ఇక వ్యవసాయంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు గుంటూరు, విశాఖపట్నంలను దాటి కృష్ణా జిల్లా దూసుకుపోతోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆయన 'సూర్య' ప్రధాన ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో 2019 లక్ష్యాలను వివరించారు...'

ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా చైతన్యం కలిగిన కృష్ణా జిల్లా ప్రస్తుతం ఆదాయంలోనూ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం విశేషం. రాజధాని ప్రాంతాలకు సాఫ్ట్‌వేర్ సంస్థలతోపాటు ప్రముఖ విద్యా సంస్థలు తరలివస్తున్నాయి. పట్టి సీమతో రెండు పంటలు పండడమే కాకుండా దిగుబడులు పెరగడం విశేషం. 2018 సంవత్సరంలో అగ్రస్థానంలో ఉన్న కృష్ణా జిల్లా 2019 సంవత్సరంలో అనుకున్న లక్ష్యాలను సాధించే దిశగా కలెక్టర్ లక్ష్మీ కాంతం ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. మత్స్య సంపద ఉత్పత్తిలో కృష్ణా జిల్లా అగ్రస్థానం పొందింది. 2017-18 సంవత్సరానికిగాను 10, 70,094 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం కాగా 11,10,635 టన్నుల ఉత్పత్తి సాధించింది. 2017-17 సంవత్సరంలోనూ 8,64,389 టన్నులు ఉత్పత్తి చేశారు. తీర ప్రాంతం, చేపల, రొయ్యల ఎగుమతితో ఇది సాధ్యమైంది.2018-19లో 12.50 లక్షల టన్నుల ఉత్పత్తి అవుతుండగా దానిని 15లక్షల మెట్రిక్ టన్నులకు పెంచేలా కలెక్టర్ లక్ష్మీకాంతం ముందుకు సాగుతున్నారు. 2017-18లో రూ.98వేల కోట్ల స్థూల ఉత్పత్తి ఉండగా మార్చి 2019 నాటికి దానిని రూ.1,25,000కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే తలసారి ఆదాయం 1,90,000 ఉండగా అది ప్రస్తుతం 2,30,000కు చేరింది. ఉద్యానవనాల సాగులో అదనంగా 50వేల ఎకరాలను పెంచారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మరో 2లక్షల10వేల ఎకరాలకు ఈ ఖరీఫ్‌లో సాగునీరు అందుబాటులోకి రానుంది. ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు, మెగా పశుగ్రాస క్షేత్రాలు నాలుగువేల ఎకరాల్లో అభివృద్ధి చేశారు. గృహ నిర్మాణం కోసం సంబంధించి ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో పట్టణాల్లో ఇప్పటికే 60వేల గృహాలను నిర్మించారు. మార్చి నాటికి మరో 45వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నారు. 970 గ్రామాలకూ ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసే ప్రక్రియను జనవరి 2019 నాటికి పూర్తి చేయనున్నారు. ఇల్లు, షాపులు, మద్యం దుకాణాలు, బ్యాంకులు, ఎండీఓ, ఎంపీడీఓ ఇలా అన్ని కార్యాలయాల్లో ఫైబర్‌నెట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం 72వేల ఫైబర్‌నెట్ కనెక్షన్లు ఉండగా ప్రతి నెలా లక్ష కనెక్షన్లు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. స్వచ్ఛ కృష్ణా, స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమాలతో చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నామన్నారు.

పాల ఉత్పత్తుల్లో నెంబర్ వన్ : మాంస, కోళ్లు గొగ్రెలు, మేకలు 2017-18లో 17 నుంచి 18 శాతం వృద్ధి రేటు ఉండగా 20 శాతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కోడిగుడ్ల ఉత్పత్తిలో ప్రస్తుతం చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో ఉండగా దానికి దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే అటవీ సంపద పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం 1కోటి 70లక్షల మొక్కలు ఉండగా ఇంకా 20 కోట్ల మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. మరో 22 శాతం అటవీ విస్తీర్ణం పెరగాల్సి ఉంది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన గాలి పీల్చి హాయిగా జీవనం సాగించాలంటే ప్రతి ఒక్కరూ 40 మొక్కలు నాటాలి. గ్రామాలలో నర్సరీల ఏర్పాటు చేయడంపై ఫోకస్ చేశారు. ప్రస్తుతం 500 అంగన్‌వాడీ భవనాలు ఉండగా మరో 500 నిర్మించేలా చర్యలు చేపడుతున్నారు. రెవెన్యూలో భూధార్‌తోపాటు పంచాయతీల్లో కూడా సక్రమంగా అమలు చేస్తున్నారు. ప్రస్తుతం జగ్గయ్యపేటలో పైలెట్ ప్రాజెక్టు నడుస్తుండగా కంకిపాడులో ఆటో మ్యుటేషన్ జరుగుతోంది.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు : కృష్ణా జిల్లా తలసారి ఆదాయంలో మొదటిస్థానంలో నిలిచింది. గత నాలుగు సంవత్సరాలుగా టాప్‌లో ఉంది. విద్యా పరంగా 440 స్కూళ్లలో డిజిటల్ క్లాసులను నిర్వహించనున్నారు.



ప్రస్తుతం 320 స్కూళ్లలో డిజిటల్ పూర్తి చేయగా 120 పూర్తి చేయనున్నారు. జనవరి వర్చువల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. బడి ఈడు పిల్లలు బడికి వెళ్లేలా చర్యలు చేపడుతున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో అధిక సంతృప్తి కృష్ణా జిల్లా సాధించింది. అలాగే వైద్యారోగ్య పరంగా ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. మాతృశిశుమరణాలను చాలా వరకు అరికట్టకలిగారు. మలేరియా, డెంగ్యూ, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులు దరి చేరకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. గర్భిణి స్త్రీలు, బాలింతల్లో రక్తహీనత తగ్గించి వారికి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. రేషన్ పంపిణీలో జిల్లాలో లబ్ధిదారులు 85.59 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కృష్ణా జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రజల సంతృప్తి 96 శాతం ఉన్నట్లు తేలింది. రియల్‌టైమ్ గవర్నెన్స్ విధానంలో కృష్ణా జిల్లా 96శాతంతో మొదటిస్థానంలో ఉంది.

పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహం : కలెక్టర్ లక్ష్మీకాంతం

అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉన్నాం. పారిశ్రామిక రంగానికి మరింత ప్రోత్సాహం అందాల్సి ఉంది. కొన్ని పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేస్తున్నాం. మడ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్నాం. కంటైనర్ కార్పొరేషన్ రాబోతోంది. బందరు ఓడరేవుకు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేత శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. పోర్టు భూసేకరణకు 500 ఎకరాల భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తాం. జిల్లాలో 1,40,000 మందికి జనవరిలో ఇళ్లపట్టాలను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. గన్నవరం ఎయిర్‌పోర్టు విస్తరణ పనులను కూడా సకాలంలో పూర్తి చేస్తాం. ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం సమష్టి కృషితో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం.

'శ్వేతపత్రాలపై చర్చకు సిద్ధమా'



రాజమండ్రి, మేజర్‌న్యూస్: శ్వేతపత్రం పేరుతో చంద్రబాబు నాయుడు ఏపీ ప్రజల్ని మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మండిపడ్డారు. 10 రోజులు అమరావతిలోనే ఉంటానని దమ్ముంటే టీడీపీ ప్రభుత్వ శ్వేతపత్రంపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఓవైపు ఏపీ టాప్‌లో ఉందంటూ శ్వేతపత్రంలో గొప్పలు చెప్తున్నారు, మరోవైపు బీజేపీ మోసం చేసిందని అంటున్నారని ఈ రెండింటికి లింక్ ఎలా కుదురుతుంది అని ఆయన ప్రశ్నించారు. శ్వేతపత్రంలో ఉన్న నిజానిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరముందని అన్నారు. శ్వేతపత్రంలోని అంశాలు నిజాలే అయితే చర్చ పెట్టండి అని పునరుద్ఘాటించారు. చర్చలో తనది తప్పని తేలితే క్షమాపణ చెప్తానని పేర్కొన్నారు. ఏం అంశంపై అయినా తప్పులు మాట్లాడి చంద్రాబాబు దొరికిపోతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల్ని ఇంకా మాయ చేయాలని చూస్తే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్నా క్యాంటిన్ భోజనం మధ్యాహ్న భోజన పథకంలోనే తయారు చేస్తున్నారని ఆరోపించారు. అన్నా క్యాంటిన్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చయితే, యభై లక్షలుగా చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు వస్తున్నాయనే పోలవరం, అమరావతి నిర్మాణాల పేరుతో హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

బొల్లారం రాష్ట్రపతి నిలయానికి సందర్శకుల తాకిడి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః భారత రాష్ట్రపతి శీతాకాల విడిది కేంద్రం బొల్లారం అతిధి గృహం సందర్శకులతో కిటకిట లాడుతోంది. రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ సూచనల మేరకు అటవీ శాఖ భారీ ఎత్తున పచ్చదనం చేపట్టింది. కొత్తగా వేలాది మొక్కలు నాటడంతో పాటు రాక్ గార్డెన్, బటర్ ఫ్లై పార్క్, అరుదైన జాతి మొక్కలతో వనాలను అటవీ శాఖ అభివృద్ధి పరిచింది. రాష్ట్రపతి పర్యటన ముగిసిన తర్వాత అనవాయితీగా ప్రజలకు బొల్లారం సందర్శన కోసం అధికారులు తెరిచి ఉంచారు. ఈ నెల ఆరుదాకా ఎవరైనా సరే రాష్ట్రపతి అతిధి గృహంతో పాటు అక్కడి పార్కులను సందర్శించవచ్చు. కొత్త సంవత్సర ఆరంభం జనవరి ఒకటి ఒక్కరోజే పదివేలకు మందికి పైగా పర్యాటకులు వచ్చినట్లు, ఇది రికార్డు అని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో, స్కూలు విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెరిగేలా అటవీ శాఖ చక్కని ప్రయత్నాలు చేసిందని సందర్శకులు అభినందిస్తున్నారు.

సంపాదకీయం

editpage@suryaa.com

మిస్డ్ కాల్ ఖరీదు కోటి 86లక్షలు


మీ మొబైల్‌కు మిస్డ్ కాల్ వచ్చిందా? జాగ్రత్తగా గమనించండి. అది తెలియని నంబర్ నుంచయితే మీరు మీ బ్యాంకులోని నగదు కోల్పోవచ్చు. ఇదే అనుభవం ముంబై లోని ఓ వ్యాపారవేత్తకు ఎదురైంది. ఆయనకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఆరు మిస్డ్ కాల్స్ వచ్చాయి. సిమ్ కార్డు సంబంధించిన ఫ్రాడ్ ఇది. వీటివల్ల ఆయన తన బ్యాంకు ఖాతానుంచి కోటి 86లక్షల రూపాయలు గల్లంతయ్యాయని గుర్తించి లబోదిబోమన్నాడు. ఈ మిస్డ్ కాల్స్ సైతం రెండు నంబర్ల నుంచి వచ్చాయట. ఒకటి యుకె డయలింగ్ కోడ్ నుంచి వచ్చింది. ఈ వ్యాపా రవేత్త పేరు మీద గుర్తుతెలియని వ్యక్తి నంబ రుపై కొత్త సిమ్ కార్డు తీసుకున్నాడు. పాత నంబరును డీ యాక్టివేట్ చేసేశాడు. తద్వారా నిందితుడు మోసానికి పాల్పడ్డాడు. ఇంతకీ ఆ వ్యాపారవేత్త నంబరుకు కంపెనీ బ్యాంకు ఖాతా లింక్ అయి ఉంటోంది. అందుకే అంత పెద్ద మొత్తాన్ని మిస్డ్ కాల్స్‌తో నిందితుడు లాగేశాడని తేలింది.

ఆత్మరక్షణలో మోడీ!

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆత్మరక్షణలో పడ్డారా! అంటే అవుననే అనిపించక మానదు. ఒక వార్తా సంస్థకు మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడిన విధానం, చెప్పిన సమాధానాలు ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. దాదాపు రెండుగంటలు పాటు సాగిన ఆ ఇంటర్వ్యూలో మోడీ వివిధ అంశాలను ప్రస్తావిస్తూ తన తప్పేమీ లేదని చెప్పుకోవడానికి ప్రయత్నించారు. న్యాయ ప్రక్రియ తరవాతే రామమందిరంపై నిర్ణయం తీసుకుంటామనటం చెప్పి, ఆర్డినెన్స్ జారీ చేసేది లేదనడం లౌకికవాదులకు తృప్తినిచ్చే అంశం. మెరుపు దాడుల అంశాన్ని ప్రస్తావించడం ద్వారా తాను దేశ భక్తుడనని, జవాన్ల భద్రతను కూడా తాను ఆలోచించానని చెప్పుకొచ్చారు. జవాన్ల భద్రత ను దృష్టిలో ఉంచుకునే దాడుల తేదీలను రెండుసార్లు మార్చానని, ఆపరేషన్ పూర్తయినా, కాకపోయినా సూర్యోదయం లోగా వెనక్కి తిరిగిరావాలని ఆదేశించానని చెప్పడం ద్వారా ఆ అంశాన్ని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడిన ప్రతీ అంశమూ తన చర్యలను సమర్ధించుకునే మాదిరిగానే కనిపించింది. జీఎస్టీ, డీ మానిటైజేషన్, రామ మందిరం, రైతులకు రుణ మాఫీ, ట్రిపుల్‌తలాఖ్, కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఇలా అనేకానేక విషయాలను తన ముఖాముఖిలో స్పృశించారు.

ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇవ్వడం ఎందుకనేదే ఇప్పటి ప్రశ్న. దీనికి సమాధానం వెతకడానికి అంతగా కష్టపడాల్సిన అవసరం లేదు. తొలి కారణమూ.. ప్రధాన కారణమూ లోక్ సభకు ఎన్నికలు తరుము కొస్తుండడం. మార్చి నాటికి ఎన్నికల షెడ్యూల్ విడుదలైపోతుంది. అక్కడి నుంచి ఇక నెంబర్ గేమ్ ప్రారంభమవుతుంది. మెజారిటీ వస్తే సరే. లేకపోతే ఏం చేయాలి? కాంగ్రెస్ నేతృత్వంలో మహాఘటబంధన్ రూపుదిద్దుకుంటోంది. అది ఎంత బలీయంగా తయారవుతుందనేది తేలడానికి మరికొన్ని రోజులు ఆగాలి. ఈ లోగా కాంగ్రెస్ పార్టీ ఒక పద్ధతి ప్రకారం బీజేపీపై ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీపై మాటల దాడిని ప్రారంభించారు. రాఫెల్ ఆయనకు ప్రధాన అస్త్రంగా మారింది. అనిల్ అంబానీకి ఆ ఒప్పందాన్ని ఎలా కట్టబెడతారని ఆయన నిలదీ స్తున్నారు. అనిల్‌కు లబ్ది చేకూర్చేందుకే యుద్ధ విమానం ధరలు పెంచేశారని స్పష్టంచేస్తున్నారు. ఈ అంశంలో ప్రధాని సమాధానం వాదనకు నిలబడటం లేదన్నది వాస్తవం. తప్పుడు సమాచారాన్ని అందించి సుప్రీం కోర్టును సైతం తప్పు దోవ పట్టించారని రాహుల్ ఆరోపిస్తున్నారు. పార్లమెంట్‌లోనే దీనిపై వివరణ ఇవ్వాలని చెప్పి, ప్రధాని ఆ అంశాన్ని ఇంటర్వ్యూలో ముగించారు. లోక్ సభలో ఇదే అంశాన్ని రాహుల్ ప్రస్తావించారు. గంటన్నర ఇంటర్వ్యూలో రాఫెల్ ఒప్పందంలో కనీసం 5 నిముషాలు కూడా మోడీ కేటాయించలేదని ఎత్తిచూపడం ఆలోచించదగ్గ అంశమే. మూడు రాష్ట్రాల్లో ఎన్నికల గురించి, రైతుల రుణ మాఫీ గురించి మోడీ ఇచ్చిన సుదీర్ఘ వివరణ సైతం గమనంలోకి తీసుకోదగింది. సుదీర్ఘ పాలన కారణంగా ఏర్పడిన వ్యతిరేకతే ఆ మూడు రాష్ట్రాల్లో ఓటమికి దారితీసిందని అన్న ఆయన వ్యాఖ్య అర్థం చేసుకోదగినదే. ఈ వ్యతిరేకతే మోహం మొత్తడం అంటారు. ఏదైనా మనకిష్టమైన కూరను రోజూ ఇంట్లో వండితే విసుక్కున్నట్లే ఓటర్లకూ విసుగొచ్చి ఉంటుందనేది ఆయన భావన. అదే విధంగా రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేయాలనేది తన ఆలోచన అని మోడీ విస్పష్టంగా ప్రకటించారు. దేవీలాల్ ప్రభుత్వం రైతులకు తొలిసారి రుణమాఫీ చేసింది. ఏం జరిగింది.. అప్పటి నుంచి వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మళ్ళీమళ్ళీ రైతుల రుణాలను మాఫీ చేశాయి. అయినా రైతుల జీవితాల్లో వెలు గులు నిండలేదు. కష్టాలు తీరలేదు. అసలు రైతులు అప్పు ఎందుకు చేయాలి? అని మోడీ వేసిన ప్రశ్న వెనుక మౌలికమైన అంశమే నిక్షిప్తమై ఉంది. ఇలాంటి వైఖరిని 2014 ఎన్నికలలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అవలంబించింది. అప్పట్లో ఆ వైఖరి ఆ పార్టీ కొంప ముంచిందని ఇప్పటికీ చెప్పుకుం టుంటారు. నిజానిజాలు ఏమైనా నదీ ప్రవాహంతో పాటే కొట్టుకు పోవాలి అంటే జనాభిప్రాయం ఎలా ఉంటే అలాగే నడవాలి. నడుస్తూ ప్రజల వైఖరిలో మార్పు తేవాలి. దాన్ని విడిచిపెట్టి, ఏటికి ఎదురీదడం చాలా కష్టం. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు అది అసాధ్యం. ప్రస్తుతం మోడీకి దేశవ్యాప్తంగా ప్రతికూల వాతావరణమే కనిపిస్తోం ది. పార్టీలోనూ బహిరంగంగా కాకపోయినా అంతర్గతంగా గుర్రుగానే ఉన్నారు. ఆరెస్సెస్ అయితే ఆ విషయాన్ని తన చేతల ద్వారా చెప్పకనే చెప్పింది. ఈసారి ఎన్నికల్లో పార్టీకి ఆధిక్యత వచ్చిందా.. ఓకే. లేకుం టే మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మిత్రులను పోగుచేయడానికి ప్రత్యామ్నాయ నేతను సిద్ధం చేసుకుంటోంది. ఇదే మోడీ ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్త_డానికి దారితీసింది. మూడు రాష్ట్రాలలో ఓటమికి మీరే పార్టీ అధ్యక్షు డిగా ఉంటే ఏం చేస్తారు అంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వేసిన ప్రశ్న భవిష్యత్తు నేత ఎవరని భృకుటి ముడి వేస్తున్న వారికి సమా_ధానం చెబుతోంది. అంటే ఏ విధంగా ఆలోచించినప్పటికీ మోడీ ఆత్మ రక్షణలో పడ్డారనే విషయాన్ని చెప్పకనే చెప్పుకున్నారు నిన్నటి ఇంటర్వ్యూతో.

నోట్ దిస్ పాయింట్!




సభ్యుల తీరు బాగోలేదు. వారి ప్రవర్తన తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.
-రాజ్యసభలో ఉపరాష్ట్రపతి వెంకయ్య అసంతృప్తి



ఏపీకి పది ఉన్నత స్థాయి విద్యాసంస్థలను ఇచ్చాం. ఏ రాష్ట్రానికి ఇలా మంజూరు చేయలేదు. ఏపీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం.
-ఏపీ బీజేపీ కార్యకర్తలతో ప్రధాన మంత్రి మోడీ




మోడీ కాపలాదారు కాదు..దొంగ. కొందరికే డబ్బే ముఖ్యం. దేశ భద్రత పట్టదు. సైనికుల రక్షణ గురించి ప్రస్తావించి ప్రజల మనస్సులను గెలవలేరు.
-విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ




రాష్ట్రం కోసం, భావితరాల కోసం ఎవరెన్ని మాటలంటున్నా భరిస్తున్నా. ఏపీపై కేంద్రం వ్యవహార శైలిపై తనకూ కోసం, ఆవేశం, బాధ ఉన్నాయి.
-కుప్పం జన్మభూమిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

చరిత్రలో ఈరోజు




సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ తన కెరీర్‌లో మొదటి సెంచరీ కొట్టాడు.
1929లో మెల్‌బోర్న్‌లో ఇంగ్లండ్‌కు వ్యతిరేకంగా ఆయన 112 పరుగులు సాధించాడు. 1948లో ఇదే రోజున భారత్ జట్టుకు వ్యతిరేకంగా రెండు ఇన్నింగ్సుల్లోనూ సెంచరీలు కొట్టాడు. కెరీర్‌లో 29 సెంచరీలు చేసిన బ్రాడ్‌మన్ తొలి మ్యాచ్ తొలి ఇన్నింగ్సులో 31 పరుగులు, చివరి మ్యాచ్ రెండో ఇన్నింగ్సులో 30పరుగులు చేశారు.

మంచి మాట



అంతిమంగా ఎవరైనా ఎంతకాలం బతికారనేది కాదు.. ఎలా జీవించారనేది చూస్తారు.
అబ్రహం లింకన్

మోడీకి ప్రత్యామ్నాయంగా గడ్కరీ!



శంకర్ రాజ్, పాలక్కాడ్

2019 సాధారణ ఎన్నికలు వేగంగా సమీపి స్తున్నాయి. ఈ దశలో భారతీయ జనతా పార్టీలో ఓ ప్రత్యామ్నాయ నాయకత్వం వెలుగుచూస్తుండడం విశేషం. కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహ దారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆ రహదారులపై నాయ కునిగా నడుచుకుంటూ వస్తున్నట్లు తోస్తోంది. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు దీనినే సూచిస్తున్నాయి. నరేంద్ర మోడీ ఇస్తున్న చేదు గుళికలకు విరుగుడుగానా అన్నట్లు గడ్కరీ వ్యాఖ్యలు తోస్తున్నాయి. ఆయన చెప్పే అంశాలు మృదువుగా తోస్తున్నాయి. హిందీ మాట్లాడే ముఖ్యమైన మూడు రాష్ట్రాలు మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో ఓటమిని చూస్తే 2014మాదిరిగా నరేంద్రమోడీ, బీజేపీ అధికారంలోకి వస్తాయనే భావన తొలగిపోయింది. మోడీ అతి కష్టం మీద ఆధిక్యత తెచ్చుకోగలిగితే, ఆయనే బీజేపీకి ప్రధాని అభ్యర్థి అవుతారు. ఆధిక్యత ఎంత తక్కువైనా సరే మోడీని కాదనలేరు. మెజారిటీ రాకపోతే ఆ పరిస్థితి ఉండదు. ఇతరుల మద్దతు తీసుకోవాల్సి వస్తే మోడీ మాత్రం ప్రధాని పదవిలో ఉండరు. ఎందుకంటే ఆయన అతడే ఒక సైన్యం కాబట్టి. మిత్రులతో కలిసి పనిచేసుకోవడంలో ఆయనకు అంతగా మంచి పేరు లేదు కాబట్టి. చివరాఖరికి తన క్యాబినెట్ సహచరులతో సైతం సుహృద్భావ వాతావరణంలో పనిచేయలేరనే అంశం రుజువైంది కాబట్టి. ప్రతి నిర్ణయం వెనుక మోడీనే ఉంటారు కాబట్టి. డీ మానిటైజేషన్ మొదలు అన్ని నిర్ణయాలూ ఆయనే ప్రకటించారు. డీ మానిటైజేషన్‌ను ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించాలి. సర్జికల్ స్ట్రైక్స్ అంశాన్ని రక్షణ మంత్రి ప్రకటించాలి. కానీ అలా జరగలేదు. ప్రధాన మంత్రి హోదాలో నరేంద్ర మోడీయే చొరవ చూపించారు. ఘనతంతా తనకే దక్కాలనుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖను సుష్మా స్వరాజ్‌కు కేటాయిం చినప్పటికీ మోడీయే ఆ శాఖకు ప్రత్యక్షంగా పర్యవేక్షించేవారు. విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను రక్షించడం, పాకిస్థానీ అమ్మాయి భారత్‌లోని యువకుడిని పెళ్ళాడేందుకు సాయపడడం, వంటి కార్యక్రమాలను ఆమె చేసేవారు.

ఏమైనప్పటికీ బీజేపీ మోడీనే తన ప్రధాన అభ్యర్థిగా 2019 ఎన్నికలలోనూ ప్రచారంలోకి తెస్తుంది. ఓట్లనూ, ప్రజల హృదయాలనూ గెలవగలిగిన సత్తా ఆయనకు మాత్రమే ఉంది గనుక పార్టీ మోడీని పక్కన పెట్టే సాహసం చేయదు. మోడీ పార్టీ చిహ్నం. అయినప్పటికీ సీట్లు పెరగకపోతే ఫలితాల అనంతరం, ప్లాన్ బి అమలుచేసి, గడ్కరీని రంగంలోకి తెస్తుంది. మోడీ-షా ద్వయంపై వస్తున్న విమర్శలకు గడ్కరీ ఈ మధ్య కాలంలో సమాధానాలు చెబుతు న్నారు. ఈ అంశాలు ఆయన దృఢంగా మారుతు న్న సంగతిని వెల్లడిస్తున్నాయి. ఓటమిని అంగీక రించడానికి బీజేపీ సిద్ధంగా ఉండాలని గడ్కరీ ఇటీవల సంచలన వ్యాఖ్య చేసి, వివాదాన్ని రగిల్చారు. అందరూ ఆయనవైపు ఆశ్చర్యంగా చూసినప్పుడు.. మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరిం చిందని చెప్పుకొచ్చారు. మోడీని దొంగంటూ శివ సేన విమర్శించినప్పుడూ, చౌకీదార్ చోర్ హై అంటూ రాహుల్ గాంధీ మండిపడినప్పుడూ కూడా గడ్కరీ ఓటమిని అంగీకరించడానికి బీజేపీ సిద్ధంగా ఉండాలని పునరుద్ఘాటించారు. బీజేపీ నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ, ఎంపీలు, ఎమ్మెల్యేల ఓటమికి ఎవరు బాధ్యత వహిస్తారని పరోక్షంగా నిలదీశారు. నేనే పార్టీ అధ్యక్షుడినైతే, ఎంపీలూ, ఎమ్మెల్యేలూ సక్రమంగా పనిచేయకుంటే ఎవరు బాధ్యులంటూ ప్రశ్నించి, ఆశ్చర్యపరిచారు. ఈ ప్రశ్న వేసింది.. అమాయకంగా కాదు. 31వ నిఘా విభాగ ఎన్డోమెంట్ లెక్చర్‌ను పురస్కరించుకుని అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలను చేశారు. విజ్ఞానభవన్‌లో డిసెంబర్ 24న ఈ కార్యక్రమం ఏర్పాటైంది. ఈ వ్యాఖ్య నరేంద్రమోడీ, అమిత్ షాలను లక్ష్యంగా చేసుకున్నదేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తాజా ఎన్నికలలో పార్టీ ఓటమి అనంతరం గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బీజేపీ ఆ ఎన్నికలలో ఎన్నడూ లేనంతగా ఘోరంగా విఫలమైంది.



- ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- మోడీ మెచ్చని నెహ్రూపై ప్రశంసలు
- బీజేపీ తాజా ఓటమికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించిన ధీరుడు
- శివసేన, శరద్ పవార్‌లతో సన్నిహిత సంబంధాలు
- ఆర్ఎస్ఎస్‌కూ ఇష్టుడు
- అద్వానీ, జోషీ ఓటు గడ్కరీకే

భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను అదే వేదికపై గడ్కరీ ప్రశంసించారు. మోడీకి అస్సలు పడని విషయం ఇదే. అలాంటి పని చేయడానికి ఆయన కలలో కూడా ఇష్టపడరు. నెహ్రూనూ, ఆయన వారసులనూ విమర్శించడానికి వచ్చే ఏ అవకాశాన్నీ మోడీ వదులుకోరు. సహనం అంశాన్ని ప్రస్తావించినప్పుడు నెహ్రూకు సంబంధించి అద్భుతమైన ఉదాహరణలను ఇచ్చారు గడ్కరీ. తాను నెహ్రూ ప్రసంగాలను ఇష్టపడతాననీ, సహనమనేది భారత్‌కున్న అతి పెద్ద ఆస్తి అని గడ్కరీ చెప్పారు. మోడీ అనుచరుడు యోగీ ఆదిత్యనాథ్ అనుసరించిన అసహన రాజకీయాలను ఆయన సూచనప్రాయంగా ప్రస్తావించారు. ఈ చర్యలను మోడీ ఖండించడం కానీ, అదుపుచేయడం కానీ చేయలేదు. నేను నెహ్రూ చెప్పిన అంశాలను ఇష్టపడతాను. భారత్ అంటే దేశం కాదు జనాభా అన్నారు. పరిష్కరించలేనప్పుడు కనీసం సమస్యలను సృష్టించకుండా ఉండాలని గడ్కరీ అభిప్రాయపడ్డారు. ఆయన ఏ సంఘటననూ ఉదహరించకుండానే సహనశీలత భారత్‌కున్న అతి పెద్ద ఆస్థి అనీ, ఈ వైఖరిని నేను అవలంబించా ఎందుకంటే వేరొకరు పాటించారు కాబట్టి అన్నారు. నేను మాత్రం ఎవరినైనా క్షమించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. పార్టీ నాయకత్వాన్ని ఓటమిని అంగీకరించాల్సిందిగా చేసిన వ్యాఖ్య డిసెంబర్ 22న పూణెలో చేశారు. విజయం మాదిరిగా వైఫల్యాన్ని అంగీకరించడానికి ఎవరూ సిద్ధంగా లేరన్నారు. నాయకత్వానికి ఆ లక్షణం ఉండి తీరాలనీ, ఓటమినీ, పరాజయాన్నీ అంగీకరించాలనీ సూచించారు. ఇది చేస్తే తప్ప అధిష్ఠానం లేదా సంస్థ పట్ల ఉన్న విధేయతను రుజువుచేసుకోలేమన్నారు. ఈ వ్యాఖ్యలన్నీ మోడీకి ప్రత్యామ్నాయంగా గడ్కరీ రూపొందుతున్నారన్న అతి పెద్ద సందేశాన్నే ఇచ్చాయి. వచ్చే లోక్ సభ ఎన్నికలలో బీజేపీ మెజారిటీని సాధించలేకపోతే, గడ్కరీనే మోడీకి ప్రత్యామ్నాయంగా మారతారన్న సందేశమే అది. గడ్కరీకి పార్టీలోని నాయకులతోనూ, మిత్రపక్షాలతోనూ సత్సంబంధాలున్నాయి. వీరందరూ మోడీతో విభేదిస్తున్నారు. శివసేన, శరద్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలతో ఆయనకు మంచి స్నేహం ఉంది. ఈ రెండు పార్టీలూ మోడీకి మద్దతునివ్వవు. ముంబై లాబీలోని స్నేహితులూ, మోడీ శత్రువులూ గడ్కరీని నాయకుడిగా గుర్తించడానికి ఆనందంతో అంగీకరిస్తారు. పశ్చిమ బంగ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఆమె సన్నిహితుడు ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సైతం ఆయనకు సత్సంబంధాలున్నాయి. మోడీతో విభేదిస్తున్న చంద్రబాబు నాయుడుతో సైతం గడ్కరీ స్నేహాన్ని నెరపుతున్నారు. చంద్రబాబు ఇప్పుడు చంద్రబాబు మోడీ



వ్యతిరేకంగా కూటమికి నాయకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతానికి మోడీని సవాలు చేసే స్థితిలో ఉన్నట్లుగా ప్రస్తుతానికైతే కనిపించడం లేదు. సుష్మాస్వరాజ్, ఉమాభారతి 2019 ఎన్నికలలో పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు కాబట్టి, గడ్కరీకి మార్గం సుగమమవుతోంది. అనారోగ్యం కారణంగా అరుణ్‌జైట్లీ పార్టీలో కానీ, ప్రభుత్వంలో కానీ పెద్ద పాత్ర పోషించడానికి సిద్ధంగా లేకపోవచ్చు. మార్గదర్శక బృందంలోని ఇద్దరు నేతలు ఎల్.కె. అద్వానీ, మురళీమనోహర్ జోషి ద్వయం మార్పునకే మొగ్గు చూపే అవకాశముంది. బీజేపీకి మెజారిటీ రాకపోతే నాయకత్వ మార్పు తప్పనిసరవుతుంది. విధేయుడైన సహచరుడు కాబట్టి, ఆర్ఎస్ఎస్ కూడా గడ్కరీ పట్ల మొగ్గు చూపించడానికి ఇష్టపడుతుంది. అన్నింటి కంటే ముఖ్యంగా గడ్కరీ ఒక బృంద నాయకుడు. విభిన్నమైన అభిప్రాయాలను జీర్ణించుకోగల సత్తా ఉన్నవాడు. సద్దుబాటు రాజకీయాలు అనే కళను ఔపోసన పట్టిన వాడు. మోడీ మాదిరిగా కాకుండా మార్పులకు అనుగుణంగా ఇతరులు సూచించిన మాదిరిగా మారే తత్వం గడ్కరీ సొంతం. 2019 సమీపిస్తున్న తరుణంలో సమీపంగా పరిశీలించదగ్గ రాజకీయ ప్రముఖుడు కేంద్ర రవాణా శాఖ మంత్రి గడ్కరీ అనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

> ఇటీవలి కాలంలో నితిన్ గడ్కరీ చేస్తున్న వ్యాఖ్యలను బేరీజు వేసుకున్నప్పుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ప్రత్యామ్నాయంగా ఆయన ఆవిర్భవిస్తున్నారా అనే అనుమానం రాకమానదు.

పంచాయతీ కార్యదర్శి నియామకాలలో అవినీతి

జూనియర్ పంచాయతి కార్యదర్శి ఉద్యోగాలలో అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయి. ఉద్యోగుల నియామకాల్లో నిలువెత్తు నిర్లక్ష్యం కనిపిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అట్టహాసంగా నిర్వహించిన ఈ ఉద్యోగాలు అంకం అట్టర్ ఫ్లాప్ అయింది. సంవత్సరాల తరబడి సిటీలలో వేలు లక్షలు పోసి కోచింగ్‌లు తీసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాలు రాక తెలంగాణ ప్రభుత్వం, ఆ ప్రభుత్వంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ తన పంచాయతి ఎన్నికల కోసం హడావుడిగా జూనియర్ పంచాయతీ ఉద్యోగులను అంగట్లో బేరానికి పెట్టి ఏకంగా జిల్లాకు సెక్షన్ లిస్ట్ పెట్టి ప్రకటించింది. మూడు రోజుల్లోనే పోస్టింగ్‌లు ఇస్తాం అని ప్రకటించి నిరుద్యోగులను నిలువునా మోసం చేసింది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగాల నియామకాలలో భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు, రాజకీయ పార్టీల పైరవీలు, దళారుల దగుల్బాజీ తనం, టిఆర్ఎస్ పార్టీ స్వార్థపర ఎన్నిక కోసం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అసమర్థత అవినీతి, తొందరపాటు నిర్ణయాలు బయటపడ్డాయి. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా మిగతా ఉద్యోగాలలో ఎన్ని జరిగాయో తెలియదు. ముఖ్యంగా ఏజెన్సీలో ఆదివాసీ యువతీ, యువకులకు ఒక ఉద్యోగం కూడా రాలేదు. ఏజెన్సీ జీ.వో. నెం.3 ప్రకారం ఆదివాసీ రిజర్వేషన్ ప్రకారం ఆదివాసీలకే ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఆదివాసీలకు ఒక్క ఉద్యోగం రాకపోగా ఏజెన్సీలో అన్ని జిల్లాల్లో గిరిజనేతర అభ్యర్థులతోనేభర్తీ చేసి, ఆదివాసీల అస్థిత్వాన్ని దెబ్బతీసి ఆదివాసీల చట్టాలనూ, జీవోలనూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిలువునా నిర్వీర్యం చేస్తున్నది. తక్కువ మార్కులు వచ్చిన వారికి పంచాయతి కార్యదర్శి ఉద్యోగం ఇచ్చినారు. అంత హడావుడిగా డైరెక్ట్‌గా సెలక్షన్ లిస్ట్ ఎలా జిల్లాకు పంపిస్తారు. సెలక్షన్ చేయడం మూలంగా అభ్యర్థుల్లో అనుమానాలు వస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు ఆందోళన బాట పడుతున్నారు. ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలోని ఏజెన్సీ ఉద్యోగులు జీవో నెం. 145 ప్రకారం స్థానిక ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉండగా కేవలం మైదాన ప్రాంత సాధారణ రిజర్వేషన్ల ప్రకారం 6% మాత్రమే ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం. దీని కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ యువతరం పెద్ద ఎత్తున నష్టపోతుంది. ఏజెన్సీలో తమ ఉద్యోగ ఉనికిని ఆదివాసీలు పెద్ద ఎత్తున కోల్పోతున్నారు. నేడు పంచాయతీ కార్యదర్శుల నియామకం జీవో నెం-3, 145కు పూర్తిగా విరుద్ధంగా సాగుతున్న ప్రక్రియ. ఇది ముమ్మాటికి ఏజెన్సీలోని ఉద్యోగాల దోపిడీ చర్యగా భావించాలి. దీనిపై మౌనంగా ఉంటే ఆదివాసీ అనేటోడు భవిష్యత్‌లో ఉద్యోగి కాలేడు. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలలో పూర్తిగా అవినీతి అక్రమాలలో కూడి ఉన్నది. తక్షణం భర్తీ ప్రక్రియను ఆపి మళ్లీ పరీక్ష నిర్వహించాలి. తెలంగాణ ముఖ్యమంత్రి మెప్పుకోసం, పంచాయతి ఎన్నికల్లో గెలవడం కోసం, పంచాయతి ఎన్నికలు దగ్గర పడినకొద్దీ ఈ ఎన్నికల కోసమే హడావుడిగా పంచాయతీ కార్యదర్శుల నియామకాలు చేపడుతున్నారు. ఎన్నికల్లో కార్యదర్శులతో పని చేయించుకోవాలనే స్వార్థం, కుట్ర మరొకటి లేదు. దీని మూలంగా కష్టపడి చదివి నిజాయితీగా పరీక్ష రాసిన అభ్యర్థులకు తీవ్రమైన అన్యాయం జరిగింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇలాంటి మోసాలు ఎన్ని చేసిందో తెలియదు. నిజాయితీగా విచారణ చేస్తే అన్ని విషయాలు బయటికి వస్తాయి. ఏజెన్సీలో నోడల్ వ్యవస్థ పని చేయదు. ఏజెన్సీని యూనిటీగా తీసుకోవాలి. ఏజెన్సీలో జీవో 3, 145 జీవోల ప్రకారం నియామకాలు జరుపుకోవాలి. ఎన్నికల కోసమే ముఖ్యమంత్రి మెప్పుకోసం టిఎస్‌పిఎస్‌సి పని చేస్తుందనే అనుమానం కలుగుతోంది. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకాలు రద్దు చేసి, మళ్లీ రాత పరీక్ష నిర్వహించి నిజాయితీగా నియామకాలు చేపట్టాలి.

పూకె రామకృష్ణ దొర
ఆదివాసీ రచయితల సంఘం - తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు
9866073866

గృహ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత




శిరందాసు నాగార్జున,
9440222914

రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఆధునిక సౌకర్యాలతో గృహాలు నిర్మించి ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా రూ.80 వేల కోట్ల అంచనా వ్యయంతో 20 లక్షల ఇళ్ల నిర్మాణానికి పూనుకుంది. 2022 నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు సమకూర్చాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టుని ఓ పవిత్ర యజ్ఞంలా కొనసాగిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పథకాల కింద మొత్తం ఇళ్లు నిర్మాణ లక్ష్యం 19,57,429 కాగా, 13,61,252 మంజూరు చేశారు. 11,51,465 పనులు ప్రారంభించగా, 7,20,113 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. రాష్ట్రంలో మొత్తం 28 గృహ నిర్మాణ ప్రాజెక్టులు పూర్తి అయ్యాయి. మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేయడానికి అధికార యంత్రాంతం తీవ్రంగా కృషి చేస్తోంది. అవసరాన్ని బట్టి మరో 5 లక్షల ఇళ్లు అదనంగా నిర్మించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం కూడా నిధులు సమకూరుస్తోంది. భూమి, మౌలిక సదుపాయాలు, నిర్మాణ వ్యయం కలిపితే ఒక్కో ఫ్లాట్ విలువ రూ.10 నుంచి 12 లక్షలు ఉంటుంది. ప్రభుత్వం నిర్మాణ వ్యయాన్ని మాత్రమే లెక్కిస్తోంది. అందులో కూడా రూ.3 లక్షల వరకు సబ్సిడీ ఇస్తుంది. అందువల్ల బ్యాంకులు రూ.2 నుంచి రూ.3 లక్షలు మాత్రమే ఇవ్వలసి ఉంటుంది. బ్యాంకులకు కావలసిన అన్ని పత్రాలను మునిసిపల్, టిడ్కో, మెప్మా అధికారులు అందజేస్తారు. ప్రభుత్వం ఈ ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు, మార్ట్ గేజ్ కు స్టాంప్ డ్యూటీ మినహాయింపునిచ్చింది. పేదలకు సొంత ఇల్లు అనేది ఓ కల. ఆ కల నెరవేర్చడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఫ్లాట్ పొందిన లబ్ధిదారులు నేరుగా గృహప్రవేశం చేసుకోవడమే. పేదవారు ఏనాడు ఊహించని స్థాయిలో ఈ ఇళ్లను నిర్మించారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమే స్థలం సమకూరుస్తోంది. అపార్ట్ మెంట్ల నిర్మాణానికి అనుమతులు, విద్యుత్ కనెక్షన్, తాగునీటి సౌకర్యం, రోడ్ల నిర్మాణం, పరిసరాలు పచ్చదనంతో నింపడం, మురుగునీటిపారుదల వ్యవస్థ ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఈ ఇళ్లను అత్యంత ఆధునిక షేర్ వాల్ టెక్నాలజీతో దృఢంగా టిడ్కో నిర్మిస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఒకే పద్ధతిలో జీ+3 విధానంలో 300, 365 చదరవు అడుగుల సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, 465 చదరవు అడుగుల డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు మూడు కేటగిరీలుగా నిర్మిస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటి తరహాలో ఇవి ఉంటాయి. ఇళ్ల నిర్మాణంలో వెర్టిఫైడ్ టైల్స్, సెరామిక్ టైల్స్, గ్లేజ్ సెరామిక్ టైల్స్, బ్లాక్ గ్రానైట్, సాల్ ఉడ్ తలుపులు, ప్లాస్టిక్ ఎమల్షన్ పెయింటింగ్ వంటి వాటిని వాడుతున్నారు. ఎల్ అండ్ టీ, షాపూర్ పల్లోంజీ వంటి పెద్ద సంస్థలు వీటిని నిర్మిస్తున్నాయి.

- గేటెడ్ కమ్యూనిటీ తరహాలో ఫ్లాట్లు
- జెట్ స్పీడ్ తో నిర్మాణం
- ముందంజలో 5 జిల్లాలు
- 7 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి

గ్రామాలలో 6 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పట్టణ), ఎన్టీఆర్ నగర్ పట్టణ గృహనిర్మాణ పథకాల కింద పట్టణ ప్రాంతాలలో 5,24,000 ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో దాదాపు లక్షా 50వేలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలో చాలా చోట్ల స్థలాలు అందుబాటులో లేకపోవడం వల్ల నిర్మాణాలలో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు 1,88,930 ఫ్లాట్లు లబ్దిదారులకు కేటాయించారు. మిగిలిన ఫ్లాట్లను కూడా త్వరగా కేటాయించే పనుల్లో అధికారులు ఉన్నారు. మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టి పట్టుదలతో ఉన్నారు. సీఎం ఆదేశాలతో అత్యంత ఆధునిక పరిజ్ఞానంతో జెట్ స్పీడ్ తో నిర్మాణాలు జరుగుతున్నాయి. గృహ నిర్మాణం వేగంగా జరగడానికి పెండింగ్ బిల్లులను కూడా అంతే వేగంగా క్లియర్ చేస్తున్నారు. హడ్కో నుంచి రావలసిన నిధులను విడుదల చేయించడానికి వత్తిడి పెంచుతున్నారు. లబ్దిదారుల వాటాగా రూ.472.88 కోట్లు చెల్లించారు. వారం, పది రోజుల్లో హడ్కో నుంచి రూ.500 కోట్లు, కేంద్రం నుంచి మరో రూ.500 కోట్లు వచ్చే అవకాశం ఉంది.

వాస్తవానికి బ్యాంకుల నుంచి రుణాలు పొందిన తరువాత నిర్మాణాలు చేపట్టాలని ముందు అనుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకుల రుణాల మంజూరు ప్రక్రియలు ఆలస్యమవుతాయని నిర్మాణాలను మొదలుపెట్టి పూర్తి చేస్తున్నారు. పట్టణాలలో మునిసిపల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వం నియమించిన కమిటీలు నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేస్తాయి. ఆ తరువాత లాటరీ ద్వారా ఫ్లాట్లు కేటాయిస్తారు. మరో పక్క బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ఒక్కో బ్లాక్ ని ఒక్కో బ్యాంకుకు కేటాయిస్తారు. బ్యాంకులు కూడా తమ బ్యాంకు మార్గదర్శకాలను అనుసరించి రుణాలు మంజూరు చేస్తాయి. అపార్ట్ మెంట్ల నిర్మాణం, లబ్దిదారుల ఎంపిక, రుణాల మంజూరుకు సంబంధించి ఒక అవగాహనకు రావడానికి బ్యాంకర్లతో అధికారులు పలుసార్లు సమావేశమయ్యారు.



అనుమానాలను నివృత్తి చేసుకుని ఒక స్పష్టతకు వచ్చారు. మొత్తం 46 బ్యాంకులు, వాటికి చెందిన 5,560 శాఖలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. బ్యాంకులకు లక్ష్యాలు నిర్ణయించారు. స్థలాలు సమకూర్చి, ప్రభుత్వమే ఫ్లాట్లు నిర్మించి ఇస్తున్నందున బ్యాంకులు కూడా సామాజిక బాధ్యతగా భావించి రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని ప్రభుత్వం కోరుతోంది. ఉభయ గోదావరి జిల్లాలు, గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాలు ఇళ్ల నిర్మాణంలో ముందంజలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా పూర్తయిన ఇళ్లను కేటాయిస్తున్నారు. బ్యాంకులు కూడా లబ్దిదారులకు ఖాతాలు లేకపోతే ఖాతాలు తెరిపిస్తున్నాయి. రుణాలు మంజూరులో చిలకలూరిపేట ఆంధ్రా బ్యాంకు బ్రాంచ్ ముందంజలో ఉంది. అవినీతి జరగకుండా, లబ్ధిదారులు వేధింపులకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇల్లు పొందిన ఆనందం లబ్ధిదారుని కళ్లలో కనిపించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు, మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది. దేశంలోనే పెద్దఎత్తున చేపట్టిన ఈ ప్రాజెక్టుని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఇళ్ల నిర్మాణం, కేటాయింపు త్వరితగతిన చేయడానికి ప్రతి 15 రోజులకు సమీక్షా సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు.



న్యూ ఇయర్ రోజున 3.95 లక్షల మంది జననం


న్యూఢిల్లీ: జనవరి ఫస్ట్... ప్రపంచ వ్యాప్తంగా ఈ తేదీకున్న ప్రాముఖ్యత తెలిసిందే. నూతన సంవత్సరంకి తొలి రోజు కావడంతో దానికి ఎంతో ప్రాధాన్యత. తమ కొత్త పనులకి ఆ రోజే శ్రీకారం చుట్టాలని చాలా మంది భావిస్తారు. అలాగే తమ బిడ్డ ఆ రోజే ఈ భూమిపైకి రావాలని నెలలు నిండిన పలువురు గర్భిణులు కూడా కోరుకుంటారు. ఆ విధంగా ఈ ఏడాది జనవరి ఒకటిన పుట్టిన పిల్లల విషయానికి వస్తే, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3,95,000 మంది పిల్లలు ఆ రోజున అమ్మ కడుపు నుంచి ఈ భూమ్మీదకు వచ్చి కళ్లు తెరిచారు. ఇక వీరిలో అగ్రతాంబూలం ఇండియాదే. భారత్ లో 69,944 మంది నిన్న జన్మించినట్టు నమోదు అయిందట. ఇక భారత్ తర్వాత చైనాలో 44,940, నైజీరియాలో 25,685, పాకిస్థాన్ లో 15,112, ఇండోనేషియాలో 13,256, అమెరికాలో 11,086, కాంగోలో 10,053, బంగ్లాదేశ్ లో 8428 మంది బేబీలు జన్మించినట్టు అధికారికంగా నమోదయింది. ఇక 2019 ప్రవేశిస్తున్న తొలి క్షణాలలో జననాలు ఫిజీలో నమోదైతే, చివరి క్షణాల నమోదు అమెరికాలో జరిగింది. ఐక్య రాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఈ గణాంకాలను ప్రకటించింది.



2-1-2019 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్		& నిఫ్టీ	
ఆరంభం	36,198.13	ఆరంభం	10,868.84
గరిష్ఠం	36,236.70	గరిష్ఠం	10,894.70
కనిష్ఠం	35,734.01	కనిష్ఠం	10,740.20
ముగింపు	**35,891.52**	ముగింపు	**10,792.50**
మార్పు (పా)	-363.05	మార్పు (పా)	-117.60
మార్పు (శా)	-1.00	మార్పు (శా)	-1.08

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	11,290.13	-125.10	-1.10
S&P BSE SENSEX Next 50	32,644.26	-337.83	-1.02
S&P BSE 100	11,079.01	-121.60	-1.09
S&P BSE Bharat 22 Index	3,463.41	-48.12	-1.37

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
CHAMBLFERT	154.20	+7.25	+4.93
KRBL	291.70	+11.45	+4.09
SOBHA	472.50	+14.45	+3.15
VAKRANGEE	36.05	+1.05	+3.00
MOTILALOFS	674.15	+18.05	+2.75

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
EICHERMOT	21,164.05	-2,020.00	-8.71
JETAIRWAYS	263.75	-17.30	-6.16
TVSMOTOR	535.00	-30.20	-5.34
FRETAIL	469.35	-26.25	-5.30
JSWSTEEL	288.70	-14.85	-4.89

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
M&M	741.50	61.72	828311
TRITURBINE	116.90	55.58	5369143
EICHERMOT	21164.05	54.46	25210
YESBANK	184.65	54.03	2918777
SBIN	293.85	50.41	1691617

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	69.6089	యూరో	79.9635
యన్	63.75	పౌండ్	88.8261

విజయా బ్యాంక్, దేనా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా

విలీనానికి కేంద్రం ఆమోదం

● దేశంలో మూడో అతిపెద్ద బ్యాంకుగా బీవోబీ ● తొలి రెండు స్థానాల్లో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ● ఉద్యోగుల సర్వీసుపై ప్రభావం ఉండదు ● సిబ్బందికి, ఖాతాదారులకు లాభాలే ● కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ● భారీ నష్టాలలో ముగిసిన మార్కెట్లు ● డిసెంబర్లో పడిపోయిన ఆటో, మెటల్ ఉత్పత్తుల అమ్మకాలు ● సెన్సెక్స్ 363, నిఫ్టీ 117 పాయింట్లు నష్టం ● లాభాల్లో సన్ ఫార్మా, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు అనుబంధ బ్యాంకులు విలీనం తర్వాత మరో విలీనానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులైన దేనా బ్యాంక్, విజయా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా విలీనానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మూడింటి విలీనం వల్ల ఏర్పడే కొత్త బ్యాంకు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ తర్వాత దేశంలోనే మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. విలీనం వల్ల సదరు బ్యాంకు ఉద్యోగుల సర్వీసుపై ఎటువంటి ప్రభావం చూపబోదని ఆయన తెలిపారు.

ఈ విలీనం వల్ల బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులకు లాభాలు చేకూరతాయని ప్రభుత్వం చెబుతోంది. విలీన ప్రక్రియ ముగిశాక ఏర్పడే కొత్త బ్యాంకులో సుమారు 85వేల మందికి పైగా ఉద్యోగులుంటారు. దేశ, విదేశాల్లో కలిపి దానికి 9,485 శాఖలు ఏర్పడతాయి. ఏప్రిల్1, 2019 నుంచి ఈ విలీనం అమల్లోకి వస్తుంది. ఇదిలా ఉంటే మూడు బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ గత నెల బ్యాంకు యూనియన్లు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. బ్యాంకు విలీనం కారణంగా సిబ్బంది తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారీ నష్టాలలో ముగిసిన మార్కెట్లు: నూతన సంవత్సరం తొలి రోజున లాభాలతో ప్రారంభించిన దేశీయ స్టాక్ మార్కెట్లు ఆ వెంటనే భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సుమారు ఒక శాతం వరకు మార్కెట్లు నష్టపోయాయి. ఆటో, మెటల్ రంగాలలో డిసెంబర్ నెలలో పడిపోయిన అమ్మకాల డేటా వెలువడడంతో, ఆయా రంగాల స్టాక్స్ ఒడుదొడుకులకు లోనయ్యాయి. ఉదయం నుంచీ అమ్మకాల ఒత్తిడితో పలు సూచీలు నష్టాలలో ట్రేడ్ అయ్యాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 500 పాయింట్ల వరకు నష్టాల్లో కనిపించింది. చివర్లో కాస్త తేరుకోవడంతో, సెన్సెక్స్ 363 పాయింట్ల నష్టంతో 35891 వద్ద, నిఫ్టీ 117 పాయింట్ల నష్టంతో 10792 వద్ద ముగిశాయి. ఇక ఈ రోజు సన్ ఫార్మా, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, భారతీ ఇన్ఫ్రాటెల్ తదితర కంపెనీల షేర్లు లాభపడగా, ఐషర్ మోటార్స్, వేదాంత, టాటా స్టీల్, హిందాల్కో, ఎంఎం, టాటా మోటార్స్ తదితర కంపెనీలు నష్టపోయాయి.

ఆన్‌లైన్‌లో ఔషధ అమ్మకాల నిషేధంపై స్టే



న్యూఢిల్లీ: అన్‌లైన్‌లో ఔషధాలను అమ్మే విధానాన్ని నిషేధించాలని గత నెలలో ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తాజాగా మద్రాస్ హైకోర్టులోని ద్విసభ్య ధర్మాసనం నిలుపుదల ఉత్తర్వులు (స్టే) ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గ దర్శకాలు రూపొందించేవరకూ స్టే కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ-ఫార్మా సంస్థలు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.సత్యనారాయణన్, జస్టిస్ పి.రాజమాణిక్యంతో కూడిన ధర్మాసనం.. ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాల నిషేధం 30 నుంచి 40 లక్షల రోగులపై ప్రభావం చూపుతుందని, దీనివల్ల రానున్న రెండు నెలల్లోనే పరిశ్రమ రూ.300 కోట్ల వరకూ నష్టపోవాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మద్రాసు హైకోర్టు తీర్పుతో మేం చాలా సంతోషంగా ఉన్నాం. ప్రజలు ఆర్డర్ చేసిన మేరకు మందులను మేం నిబద్ధతతో సరసమైన ధరలకు అందించేందుకు మరింత కృషి చేస్తాం. అని ఓ ఆన్‌లైన్ ఫార్మసీ సంస్థ వ్యవస్థాపకుడు ఆనందం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలను నిషేధించాలని కోరుతూ ఓ వ్యక్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. డ్రగ్స్, కాస్మొటిక్స్ చట్టం-1940, ఫార్మసీ చట్టం-1948 ప్రకారం ఔషధాలను ఆన్‌లైన్ వేదికల్లో అమ్మేందుకు అనుమతి లేదని ఆయన పిల్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం లక్షల సంఖ్యలో మందులు ఆన్‌లైన్ పోర్టళ్ల ద్వారా అమ్ముడవుతున్నందున, పొరపాటున ఔషధ మార్పిడి జరిగితే రోగులతో పాటు వైద్యులకు సైతం ప్రమాదం పొంచి ఉంటుందని వివరించారు. దీనిపై విచారణ జరిపిన ఏక సభ్య ధర్మాసనం ఆన్‌లైన్‌లో మందులను విక్రయించడం నిలిపేయాలని గత నెలలో తీర్పునిచ్చింది.

బీఎస్ఎన్ఎల్ వినియోగదారుకు ఆఫర్లు

న్యూఢిల్లీ: తన వినియోగదారులను కాపాడుకోవడం, కొత్త వారిని ఆకర్షించడం లక్ష్యంగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) నూతన సంవత్సరం సందర్భంగా మొబైల్ వినియోగదారులకు పలు ఆఫర్లను ప్రకటించింది. అపరమిత కాల్స్, డేటా, ఉచిత రింగ్‌టోన్స్ వంటి ప్రయోజనాలతో ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ ఆఫర్లకు సంబంధించిన వివరాలను తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం వి.సుందర్ వెల్లడించారు. ఇందులో వర్షికా-1699 ప్లాన్ ఆకర్షణీయంగా ఉంది. ఈ ప్లాన్ లో రూ.1,699 చెల్లించి ఏడాదిపాటు అపరిమిత (లోకల్ అండ్ రోమింగ్) వాయిస్‌కాల్స్, రోజుకు వంద ఎస్సెమ్మెస్‌లు, ఉచిత కాలర్‌ట్యూన్, అపరిమిత డేటా పొందవచ్చు. అయితే డేటా వినియోగదారులు ఒకరోజులో 2జీబీ డేటా ఉపయోగించాక వేగం 80 కేబీపీఎస్‌కు తగ్గిస్తారు. ఇవే ఆఫర్లు వర్షికా ప్లస్-2099 ప్లాన్‌కూ వర్తిస్తాయి. రూ.2,099తో రీచార్జ్ చేసుకుంటే రోజుకు 4జీబీ వినియోగించాక డేటా వేగం 80 కేబీపీఎస్‌కు కుదిస్తారు. రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే 487 వైఫై హాట్‌స్పాట్‌లను నెలకొల్పింది. మరో 423 హాట్‌స్పాట్‌లను ఫిబ్రవరిలోగా ఏర్పాటు చేయనుంది.

భారత్, చైనాలకే ఎక్కువ గ్రీన్‌కార్డులు



వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారిలో భారతీయులే ఎక్కువ మంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే గ్రీన్‌కార్డుల జారీలో దేశాలకు కేటాయించే కోటాల వల్ల వీటి కోసం భారతీయులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అందుకే ఈ కోటాను ఎత్తివేయాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. అయితే దేశాల కోటా నిబంధనను తొలగించడం వల్ల భారత్, చైనా దేశాల వారికే ఎక్కువ గ్రీన్‌కార్డులు వస్తాయని, అంతేగాక.. అమెరికా పౌరసత్వం పొందేవారిలోనూ ఈ దేశాలకు ఆధిపత్యం ఉంటుందని తాజా నివేదిక వెల్లడించింది.

జనవరి 3 నుంచి అమెరికా కాంగ్రెస్ ప్రారంభం కానుంది. ఈ సమావేశాల్లో గ్రీన్‌కార్డుల జారీల్లో దేశాల కోటాను ఎత్తివేసేలా చట్టాన్ని తీసుకురావాలని చాలా మంది ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్(సీఆర్ఎస్) ఇటీవల దేశాల కోటా, శాశ్వత ఉపాధి తదితర అంశాలపై నివేదిక తయారుచేసింది. ఈ కోటాను ఎత్తివేయడం వల్ల అమెరికా మార్కెట్లో ప్రస్తుతం దేశాల మధ్య ఉన్న వివక్ష తొలగిపోతుందని, అయితే దీని వల్ల భారత్, చైనా లాంటి దేశాలకు ఆధిపత్యం చెలాయించే అవకాశం వస్తుందని సీఆర్ఎస్ తన నివేదికలో పేర్కొంది.

అమెరికా పౌరసత్వం, వలస సేవల సంస్థ(యుఎస్‌సీఐఎస్) తాజా గణాంకాల ప్రకారం.. 2018 ఏప్రిల్ నాటికి 3,95,025 మంది విదేశీయులు ఒక విభాగంలో గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో 3,06,601 మంది భారతీయులే. భారత్ తర్వాత 67,031 మందితో చైనా రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం దేశాల కోటా వల్ల చాలా మంది భారతీయులు గ్రీన్‌కార్డులు పొందాలంటే దాదావు తొమ్మిదిన్నర ఏళ్లు ఎదురుచూడాల్సి వస్తోంది. కోటాను ఎత్తివేస్తే గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూసే భారతీయుల సంఖ్య భారీగా తగ్గుతుందని సీఆర్ఎస్ తెలిపింది. దీని వల్ల పెండింగ్ దరఖాస్తులు కూడా తగ్గుతాయని పేర్కొంది.

ఈపీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త




న్యూఢిల్లీ: ఈపీఎఫ్ చందాదారుల్కు గుడ్ న్యూస్. రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల వడ్డీరేటును పెంపునకు కేంద్ర సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ వార్షిక అంతర్గత రివ్యూలో భాగంగా ఈ వడ్డీరేటు పెంచాలని భావిస్తున్నట్టు సమాచారం. 2018-19కు గాను వ్డీమ రేటును 8.55 శాతంనుంచి పెంచేందుకు యోచిస్తోందట. దీంతో 6 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులు ల్బ్ధిపొందున్నారు. జనవరి మాసాంతంలో జరిగే సెంట్రల్ బోర్డ్ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేష్న్ ఫిబ్రవరి 1న జారీ చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు ప్రభాకర్ బనసూర్ వడ్డీరేటు పెంపునకు ఎక్కువ అవకాశం ఉందంటూ ధృవీకరించారు. మరో సభ్యుడు వ్యాఖ్యానిస్తూమ వాస్తవానికి డిసెంబర్ నెలలో ఈపీఎఫ్ వడ్డీరేటును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అకౌంట్ల ఆడిటింగ్ ఇంకా కొనసాగుతున్న కారణంగా ఆలస్యమైందన్నారు. కాగా 2017-18 ఏడాదికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్ ఖాతాలపై వడ్డీరేటు 8.55శాతంగా ఉంది. ఇది అయిదేళ్ల కనిష్టం.

ఆరోగ్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్

హైదరాబాద్: నాణ్యమైన వైద్యసేవలను మరింత మందికి దగ్గర చేసేందుకు వీలుగా వీలుగా రియల్ టైమ్ డేటా అనాల్సిస్ మరియు ప్రెడిక్టివ్ ఇన్‌సైట్స్‌ని అమలు చేస్తున్నట్టు నారాయణ హెల్త్ వెల్లడించింది. ఈ డేటా అనాలిసిస్‌ను ఆపరేషన్స్ మైక్రోసాఫ్ట్ అజ్యూర్, ఎస్‌క్యూఎల్ సర్వర్ మరియు పవర్ బీఐలతో అనుసంధానించి ఉపయోగిస్తున్నట్టు సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ దేవిశెట్టి తెలిపారు. 1983లో డాక్టర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టిన తాను, 3 దశాబ్దాల వ్యవధిలో దాదావు 15 వేల సర్జరీలు చేసినా, సర్జరీకి సంబంధించి ప్రశ్నలు ఉత్పన్నమవుతూనే ఉంటాయని, రోగ నిర్ధారణ మరియు చికిత్స కంటే, ఆ రోగానికి ఖర్చు ఎంత అవుతుందన్న బెంగే పేషంట్స్ కు ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. అందుకే రోగులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కృత నిశ్చయంతో ఎక్స్‌రేలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ని చోడించామని అన్నారు. దీనివల్ల నార్మల్ ఎక్స్‌రే కంటే, సమాచారం చాలా పక్కాగా ఉంటుందని తెలిపారు. దీనిద్వారా డాక్టర్ల టైమ్ చాలావరకు ఆదా అవుతుందన్నారు.

పీజీ ప్రవేశాలకై 'అజీం ప్రేమ్ జీ' ఆహ్వానం



హైదరాబాద్: రెండుసంవత్సరాల పూర్తి కాల వ్యవధి కలిగిన విద్య, సామాజిక అభివృద్ధి, పౌర విధానాలు ప్రభుత్వ పాలన, ఒక సంవత్సరం పూర్తి కాల వ్యవధి కలిగిన సామాజిక అభివృద్ధి మరియు న్యాయశాస్త్రం కోర్సులకై దరఖాస్తులను అహ్వానిస్తున్నట్టు అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ పేర్కొంది. దాదావు 100 కంటే ఎక్కువగా ఇంటర్ డిసిప్లినరీ మరియు ఇతివృత్త ప్రాతిపాదికన ఐచ్ఛికాంశాలు, అన్నిటికీ మించి మీ కోర్స్‌ని మీరే నిర్మించుకోగల అవకాశం ఇండిపెండెంట్ స్టడీ ద్వారా లభిస్తుందని వర్శిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ యస్ గిరిధర్ వెల్లడించారు. పర్యటనలు, క్షేత్ర స్థాయిలో పరిశోధనలు, శిక్షణా అవకాశాలను వంటి ప్రయోగాలతో సమ్మిళితం చేసిన అభ్యసనానుభావాలను ప్రతివారం ఇక్కడ అందిస్తామని, దరఖాస్తులు సమర్పించేందుకు ఆఖరు తేదీ జనవరి 26 అని ఆయన తెలిపారు.

రూ. 58కి లీటరు విమాన ఇంధనం

పెట్రోలు మాత్రం రూ. 73

● గణనీయంగా తగ్గిన క్రూడాయిల్ ధర ● కిలో లీటరుకు రూ. 9,990 తగ్గిన ఏటీఎఫ్ ధర ● పెట్రోలు, డీజిల్ కన్నా తక్కువకే విమాన ఇంధనం ● లాభాల్లో విమానయాన సంస్థలు




న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిణామాలతో క్రూడాయిల్ ధర గణనీయంగా తగ్గగా, ఇండియాలో మాత్రం పెట్రోలు, డీజిల్ ధరలు ఇంకా ఆకాశంలోనే ఉన్నాయి. గడచిన నెలన్నరగా 'పెట్రో' ఉత్పత్తుల ధరలు తగ్గుతున్నట్టు కనిపిస్తున్నప్పటికీ, ఇంటర్నేషనల్ ట్రెండ్స్ తో పోలిస్తే అది తక్కువేనని తెలుస్తోంది. ఎందుకంటే, ఇప్పుడు ఇండియాలో పెట్రోలు ధర కన్నా విమాన ఇంధన ధరే ఎక్కువ కాబట్టి. ప్రస్తుతం విమాన ఇంధన ధర లీటరుకు రూ. 58.07కు చేరడంతో విమానయాన సంస్థలు లాభాలను పిండుకుంటున్నాయి. ఇదే సమయంలో హైదరాబాద్ లో పెట్రోలు ధర రూ. 73కు అటూఇటుగా ఉంది. అంటే, విమాన ఇంధనంతో పోలిస్తే, పెట్రోలు ధర లీటరుకు రూ. 15 అధికంగా ఉన్నట్టు. డీజిల్ ధర రూ. 68గా ఉండగా, అది కూడా విమాన ఇంధన ధరతో పోలిస్తే రూ. 10 అధికంగా ఉన్నట్టు. అక్టోబర్ 18 నుంచి ధరలు తగ్గుతూ వస్తుండగా, ఇప్పటివరకూ లీటరు పెట్రోలుపై రూ. 14.18, డీజిల్ పై రూ. 13.03 మేరకు ధర తగ్గింది. ఇక మంగళవారం నాడు కిలో లీటర్ (1000 లీటర్లు) విమాన ఇంధనంపై రూ. 9,990 మేరకు ధరను తగ్గిస్తున్నట్టు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తెలపడంతో విమాన ఇంధన ధర రూ. 58,060.97కు దిగి వచ్చింది. ఈ ధర పెట్రోలు, డీజిల్ కన్నా తక్కువగా ఉండటం గమనార్హం.

డ్రైవింగ్ లెసెన్స్ జారీలో సమూల మార్పులు

ఇకపై నాలుగు రకాలే

● టూ వీలర్ విత్, విత్‌ఔట్ గేర్ విభాగాలు ● లెట్ మోటారు వెహికల్స్, రవాణా వాహనాలు మిగిలిన రెండు ● ఆధార్ చూపిస్తే సరిపోతుంది



న్యూఢిల్లీ: లెసెన్స్ జారీ విషయంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు ఉన్న రకరకాల విభాగాలు, ప్రత్యేక విభాగాలు.. అంటూ లేకుండా ఇకపై మొత్తం వాహనాలను నాలుగు రకాలుగా విభజించి నాలుగు రకాల లెసెన్స్‌లు జారీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. ఇకపై టూ వీలర్ విత్ గేర్, విత్‌ఔట్ గేర్, లెట్ మోటార్ వెహికల్, రవాణా వాహనాలుగా విభజించి లెసెన్స్‌లు జారీ చేస్తారు. విత్‌గేర్, విత్‌ఔట్ గేర్ విభాగంలోకి అన్ని రకాల ద్విచక్ర వాహనాలు వస్తాయి. వాహనం గరిష్ట బరువు 7500 కిలోలు దాటని వాహనాలను లెట్ వెహికల్స్ కింద చేర్చారు. ఇందులో అన్ని ఆటోలు (త్రిచక్ర, గూడ్స్), నాలుగు చక్రాల (కార్లు తదితరాలు సొంతం, అద్దెవి, రవాణావి, పాసింజర్, కమర్షియల్) వాహనాలు వస్తాయి.

ఈ వాహనాలకు లెసెన్స్ పొందేందుకు ఎటువంటి ధ్రువపత్రాలు ఇవ్వక్కర్లేదు. లెసెన్స్ పొందగోరు వ్యక్తికి ఆధార్ ఉంటే సరిపోతుంది. ఇప్పటి వరకు పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఎల్‌ఐసీ బాండ్ పేపర్, కనీస విద్యార్హత వంటి నిబంధనలు ఉండేవి. దీంతో వాటిని సంపాదించడం కోసం నానాపాట్లు పడాల్సి వచ్చేది. ఇకపై పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఆధార్ చూపించి, డ్రైవింగ్ నైపుణ్యం ప్రదర్శిస్తే లెసెన్స్ మంజూరు చేస్తారు. మూడేళ్ల అనుభవం ఉంటే బ్యాడ్జి కేటాయింపు వంటి జంజాటం లేనట్టే. నాలుగో విభాగమైన రవాణా వాహనాలకు మాత్రం ఎనిమిదో తరగతి విద్యార్హత తప్పనిసరి. 7500 కిలోల కంటే ఎక్కువ గరిష్ఠ బరువు ఉన్న వాహన చోదకులు ఎనిమిదో తరగతి ధ్రువపత్రం, ఆధార్ చూపి లెసెన్స్ పొందవచ్చు. తాజా మార్పుల వల్ల లెసెన్స్ మంజూరు సులభతరమవుతుందని, దీనివల్ల అర్హులందరూ లెసెన్స్ పొందుతారని అధికారులు తెలిపారు. అందువల్ల పోలీసుల తనిఖీల్లో పలు నిబంధనల సాకుతో వసూలు చేస్తున్న జరిమానా భారం కూడా వాహన చోదకులపై తగ్గనుంది.

వాట్సయాప్ ద్వారా పాలసీల డెలివరీ: భారతీ యాక్సాలైఫ్



హైదరాబాద్: భారతీ ఎంటర్‌ప్రైజెస్, ఆక్సాల సంయుక్త బీమా సంస్థ భారతీ యాక్సాలైఫ్, తామందించే బీమా పాలసీలను ఇకపై వాట్స్ యాప్ ద్వారానూ డెలివరీ చేయనున్నట్టు ప్రకటించింది. సామాజిక మాధ్యమాల్లో వాట్స్‌యాప్ ఎంతో ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థ సీఈఓ మరియు ఎండీ వివేక్ సేథ్ వెల్లడించారు. సపాలసీ డాక్యుమెంట్లు, రెన్యువల్ ప్రీమియం చెల్లింపులు తదితరాలను కూడా ఇదే సోషల్ మీడియా దిగ్గజం మాధ్యమంగా అందిస్తామని ఆయన అన్నారు.

పెట్టుబడుల స్వర్గధామం దుబాయ్: డాన్యూబ్



హైదరాబాద్: ప్రపంచ ఇన్వెస్టర్లకు, ముఖ్యంగా నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని భావించేవారికి స్వర్గధామంగా దుబాయ్ నిలిచిందని డాన్యూబ్ వెల్లడించింది. ప్రస్తుత మార్కెటింగ్ ట్రెండ్స్‌ను బట్టి, దుబాయ్‌లో పెట్టుబడులు సాలీనా 8 నుంచి 10 శాతం రాబడిని ఇస్తూ, ప్రపంచంలోనే శరవేగంగా వృద్ధిచెందుతున్నాయని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ రిజ్వాన్ సాజన్ తెలిపారు. నిర్మాణరంగంలో పెట్టుబడులకు దుబాయ్ అత్యంత అనుకూలమని తమ అధ్యయనంలో తేలినట్టు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలపై ఇన్వెస్టర్లు దృష్టిని సారించారని, గత 10 సంవత్సరాలుగా దుబాయ్ శరవేగంగా విస్తరిస్తోందని ఆయన అన్నారు.

ఏపీ లాయర్ల విజ్ఞప్తిని తిరస్కరించిన సుప్రీం కోర్టు

• కోర్టు తరలింపునకు మరింత సమయం కోరిన న్యాయవాదులు • ఇప్పటికే హైకోర్టు మొదలైపోయిందన్న ధర్మాసనం • పిటిషన్ విచారించాల్సిన అవసరం లేదన్న న్యాయమూర్తి



న్యూఢిల్లీ : హైదరాబాద్ నుంచి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టును తరలించేందుకు మరింత సమయం కావాలని న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. బుధవారం ఉదయం ఏపీ లాయర్ల పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఇప్పటికే హైకోర్టు అక్కడ మొదలైపోయిందని, న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం కూడా పూర్తయినందున ఈ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. కాగా, అమరావతిలో హైకోర్టు భవనం ఇంకా పూర్తి కాలేదని, వెంటనే అక్కడికి వెళ్లాలంటే తమకు ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని, కోర్టు తరలింపునకు మరింత సమయం కావాలని పేర్కొంటూ న్యాయవాదులు సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. న్యాయవాదులకు ఏమైనా సమస్యలు ఉంటే ఏపీ ప్రభుత్వంతో చర్చించి, పరిష్కరించుకోవచ్చని, మరింత సమయం మాత్రం ఇవ్వలేమని సుప్రీం కోర్టు పేర్కొంది.

అయ్యప్ప ఆలయంలో నవ చరిత్ర

• ఇద్దరు మహిళలకు స్వామి దర్శనం • దశాబ్దాల సంప్రదాయాన్ని తోసిరాజన్న ఇద్దరు మహిళలు • విలపించిన భక్తులు • పంతం నెగ్గించుకున్న కేరళ సర్కార్ • భక్తుల సంఖ్య స్వల్పంగా ఉండడంతో పని ముగించిన పోలీసులు • ఆలయం అపవిత్రమైందని వాపోతున్న భక్తులు

శబరిమల : కేరళ సర్కార్ తన పంతం నెగ్గించుకుంది. శబరిమలలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయ్యప్ప దేవాలయానికి వచ్చిన ఇద్దరు మహిళా భక్తులు బుధవారం తెల్లవారు జామున స్వామిని దర్శించుకున్నారు. మండల పూజలు ముగిసి, మకర విళక్కు పూజల కోసం స్వామి ఆలయాన్ని తెరచిన వేళ, మకర జ్యోతి దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు వచ్చేందుకు ఇంకా సమయం ఉండగా, భక్తుల రద్దీ తక్కువగా ఉండడంతో, పోలీసులు భారీ భద్రత మధ్య 40 లోపు వయసు ఉన్న ఇద్దరు మహిళలకు స్వామి దర్శనం చేయించారు. వారు ఆలయానికి సమీపంలోకి వచ్చిన తరువాత భక్తులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని బలవంతంగా చెదరగొట్టారు. బిందు, కనకదుర్గ అనే మహిళలు స్వామిని దర్శించుకున్నట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా స్వల్ప తోపులాట జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. రుతుస్రావం వయసులో ఉన్న మహిళలు స్వామిని దర్శించుకున్నారని, తాము అడ్డుకోలేక పోయామని భావించిన అయ్యప్ప భక్తులు బోరున విలపించారు. ఆలయం అపవిత్రమైపోయిందని పలువురు వాపోయారు.

అయ్యప్పను దర్శించుకుని చరిత్ర సృష్టించిన బిందు, కనకదుర్గ నేపథ్యం ఇది: బిందు, కనకదుర్గ... ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్ని టీవీ చానళ్లలో వినిపిస్తున్న పేర్లు. దశాబ్దాల సంప్రదాయాన్ని, భక్తుల మనోభావాలను తోసిరాజని, బుధవారం శబరిమలలోని అయ్యప్పను దర్శించుకున్న మహిళలు. పీటీఐ తెలిపిన వివరాల మేరకు బిందు వయసు 44 సంవత్సరాలు. సీపీఐ (ఎంఎల్) కార్యకర్తగా, ఓ కాలేజీలో లెక్చరర్‌గా ఆమె పని చేస్తున్నారు. కనకదుర్గ వయసు 42 సంవత్సరాలు కాగా, కేరళ ప్రభుత్వ పౌర సరఫరాల విభాగంలో పని చేస్తున్నారు. వీరిద్దరూ గత నెల 24న ఆలయానికి వచ్చి, స్వామిని దర్శించకుండా వెనక్కు తిరిగి వెళ్లిపోయిన 11 మంది మహిళల బృందంలో ఉన్నారు. మకర విళక్కు సందర్భంగా డిసెంబర్ 30న ఆలయాన్ని తెరవగా, ఆపై రెండు రోజుల తరువాత భక్తుల సంఖ్య బాగా పలచబడడంతో వారి కోరిక నెరవేరింది.



కేరళ బంద్ : కేరళలో శబరిమల వివాదం ముదురుతోంది. బుధవారం ఇద్దరు మహిళలు అయ్యప్ప దేవాలయంలో ప్రవేశించడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయ్యప్ప దేవాలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించినందుకు నిరసనగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించాలని శబరిమల కర్మ సమితి పిలుపు ఇచ్చింది. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బంద్ చేయాలని కోరింది. కేరళ బీజేపీ శాఖ కూడా రెండు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది.

పాకిస్తాన్‌కు చైనా అత్యాధునిక యుద్ధ నౌకలు



బీజింగ్ : హిందూ మహాసముద్రంలో పాకిస్తాన్‌ను బలోపేతం చేసేందుకు చైనా అండదండలు అందిస్తోంది. చైనా ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం అన్ని కాలాల్లోనూ అనుకూల మిత్రుడిగా పాకిస్తాన్‌ను చైనా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ నావికా దళానికి అత్యాధునిక యుద్ధ నౌకలను నాలుగింటిని తయారు చేసి, ఇచ్చేం దుకు ఒప్పందం ఇరు దేశాల మధ్య కుదిరింది. ఈ నాలుగింటిలో ఓ నౌకను చైనా తయారు చేస్తోంది. దీనిలో అత్యాధునిక ఆయుధాల వ్యవస్థలు ఉన్నాయని, నిఘా సమాచార సేకరణకు ఏర్పాట్లు ఉన్నాయని చైనా స్టేట్ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పేర్కొన్నట్లు ఈ మీడియా కథనం తెలిపింది. పాకిస్తాన్‌కు చైనా భారీగా ఆయుధాలు సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. జేఎఫ్ - థండర్ సింగిల్ ఇంజన్ మల్టీ రోల్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఇరు దేశాలు కలసి తయారు చేస్తున్నాయి. హిందూ మహాసముద్రంలో భారతదేశాన్ని ఎదుర్కొనేందుకు చైనా, పాకిస్తాన్ వ్యూహాలు రచిస్తున్నాయి.

సముద్ర జీహాద్‌కు పాక్ ఉగ్రవాదుల శిక్షణ



న్యూఢిల్లీ : భారత దేశంపై దాడులు చేయడానికి పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలు సముద్రాన్ని ఉపయోగించు కునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ బుధవారం చెప్పారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ, పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థలు తమ కేడర్‌కు సముద్ర జలాల్లో దాడులు చేయడాన్ని నేర్పుతున్నాయని, భారత దేశంపై దాడి చేసే విధంగా పురిగొలుపుతున్నాయని తెలిపారు. అయితే, నౌకాశ్రయాలు, సరకు రవాణా నౌకలు, ఆయిల్ ట్యాంకర్లపై ముంబయిలో జరిగిన 26/11 తరహా దాడులు జరిగే అవకాశాలపై సమాచారం లేదని చెప్పారు. సముద్ర, జల మార్గాల్లో ఉగ్రవాదులను భారత దేశానికి పంపించేందుకు పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థలు తమ కేడర్‌కు శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం ఉందన్నారు.

పథకం ప్రకారమే హత్యాయత్నం



విశాఖపట్నం, మేజర్‌న్యూస్: ఆంధ్ర ప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పక్కా పథకం ప్రకారమే హత్యాయత్నం జరిగిందని విశాఖపట్నం పోలీసు కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా తెలిపారు. బుధవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ వైఎస్ జగన్‌పై దాడికి నిందితుడు శ్రీనివాస్ రెండుసార్లు కుట్ర పన్నాడని వెల్లడించారు. “నిందితుడు 2017 డిసెంబర్ నుండే వైఎస్ జగన్ హత్యపై కార్యాచరణ ప్రారంభించాడు. అక్టోబర్ 18నే దాడికి పథక రచన చేశా డు. అక్టోబర్ 17నే వైఎస్ జగన్ విశాఖ నుంచి వెళ్లిపోవడంతో అతడి పథకం ఫలించలేదు. శ్రీనివాస్ గతంలో వెల్డర్, కేక్ మాస్టర్, కుక్‌గా పనిచేశాడు. జనవరి 2018 కర్ణాటకలో తనతో పనిచేసిన వెంకటపతి అనే వ్యక్తి ద్వారా ఫ్యూజన్ ఫుడ్స్‌లో చేరాడు. 164 సీఆర్ పీసీ కింద ఇప్పటి వరకు 92 మంది సాక్షులను విచారించి, స్టేట్‌మెంట్‌లు రికార్డ్ చేసాం. దాడికి ఉపయోగించిన కోడిపందేల కత్తికి నిందితుడు రెండుసార్లు పదును పెట్టాడు. ముందుగానే ఓ లేఖను విజయదుర్గతో రాయించాడు. ఈ లేఖను ఆమె జిరాక్స్ కూడా తీయించింది. హేమలత, షేక్ అమ్మాజీ అనే మహిళలకు శ్రీనివాస్ ముందురోజు ఫోన్ చేసి రేపు నా పేరు టీవీలో చూస్తారంటూ చెప్పాడు. అక్టోబర్ 25న ఉదయం 4.55 గంటలకు ఎయిర్‌పోర్టుకు బయలు దేరాడు. ఎయిర్‌పోర్టు క్యాంటీన్‌లో ఉదయం 9 గంటలకు కత్తికి మరోసారి పదును పెట్టాడు. దాడికి పక్కా పథకం ప్రకారం సిద్ధమయ్యాడు. వీఐపీ లాంజ్‌లో వేచివున్న వైఎస్ జగన్ వద్దకు హేమలతను తీసుకెళ్లాడు. కరణం ధర్మశ్రీతో జగన్ మాట్లాడుతుండగా శ్రీనివాస్ దాడికి తెగబడ్డాడు. రాష్ట్రంలో ఎక్కడ ఘటన జరిగిన రాష్ట్ర పోలీసులే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అప్పగించాలి లేదా కేంద్రం కోరాలి. స్థానిక పోలీసులకు అధికారం లేదు. నిందితుడి దగ్గర దొరికిన లేఖలో ముగ్గురి చేతి రాతలు ఉన్నట్లు ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ ఇచ్చింది. కేసులో ఇప్పటివరకు శ్రీనివాస్ మాత్రమే నిందితుడు. దాదాపుగా విచారణ పూర్తయింది. ఛార్జిషీట్ దాఖలుకు హైకోర్ట్ అనుమతి రావాల్సి ఉంది. అని లడ్డా వివరించారు. అనుమానాలెన్నో-వైసీపీ :పోలీసు కమిషనర్ హడావుడిగా విలేకరుల సమావేశం పెట్టి కేసు వివరాలు వెల్లడించడంపై వైసీపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంతకుముందు చెప్పిందే మళ్లీ చెప్పారని, కొత్తగా ఏం చెప్పలేదని పేర్కొన్నారు. సూత్రధారులను తప్పించేందుకే రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు. కేసు విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించేందుకు చంద్రబాబు సర్కారు ఎందుకు భయపడుతోందని ప్రశ్నిస్తున్నారు.

16 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంటే ఢిల్లీని శాసించవచ్చు

• దేశానికి ఆదర్శం టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన • రైతుబంధును అమలు చేసేందుకు మూడు రాష్ట్రాలు రెడీ • ప్రధాని మోడీ కూడా ఈ పథకాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు • రైతన్నలకు మేలు జరిగే పథకాన్ని సీఎం కేసీఆర్ రూపొందించడం ప్రతి టీఆర్ఎస్ కార్యకర్తకు గర్వకారణం • ఉద్యమనాయకుడే రెండవసారి సీఎం కావడం దేశంలో అరుదైన రికార్డు • టీఆర్ఎస్‌పై నమ్మకంతో 75 శాతం స్థానాలు కట్టబెట్టిన ప్రజలు • ప్రజలకిచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రణాళికబద్ధంగా అమలు చేద్దాం • రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల ఓట్లు గల్లంతు • ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఉద్యమస్ఫూర్తితో చేపడుదాం • పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి నామినేటెడ్ పదవులు ఖాయం • టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు

హైదరాబాద్-మేజర్‌న్యూస్ః దేశవ్యాప్తంగా బీజేపీ విశ్వాసాన్ని కోల్పోతుందని, కాంగ్రెస్‌పార్టీ రోజుకింత బలహీన పడుతున్న నేపథ్యంలో ఢిల్లీ పీఠంపై ఎవరు కూర్చోవాలో నిర్ణయించే శక్తి టీఆర్ఎస్‌పార్టీకే ఉందని ఆ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు అన్నారు. కేంద్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చక్రం తిప్పాలంటే తెలంగాణలోని 16 పార్లమెంట్ సీట్లను దక్కించుకోవాల్సిన అవసరముందన్నారు. 16 స్థానాలను గెల్చుకోవడం ద్వారా ఆచార్య జయశంకర్ చెప్పినట్లుగా యాచిండం కాదని, శాసించి రాష్ట్రానికి నిధులు తెచ్చుకోవచ్చునని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానిన అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఒక్కోసీటు కీలకంగా మారనుందన్నారు. టీఆర్ఎస్ పాలన దేశానికే ఆదర్శం కానుందని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోని రైతులందరికీ లాభం జరిగే కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ ఆలోచనే నాంది కావడం గర్వకారణమన్నారు. రైతు బంధు, రైతుబీమా పథకాలను ఇప్పటికే మూడు రాష్ట్రాలు అమలు చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశాయన్నారు. ప్రధాని మోదీ సైతం రైతుబంధు పథకాన్ని తమ రంగు పులిమి అమలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటు న్నారన్నారు. ఏదీ ఏమైనా దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ మేలు జరిగే పథకానికి తమ నాయకుడు శ్రీకారం చుట్టడం, ప్రతి కార్యకర్త ఆనందించాల్సిన విషయమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తానని కేటీఆర్ వివరించారు. హైదరాబాద్ జలవిహార్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఉద్యమ ఫలితాలను ప్రజలకు చూపించి, రెండో సారి ముఖ్యమంత్రి కావడం దేశంలోనే రికార్డుగా కేటీఆర్ అభివర్ణించారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా కేసీఆర్ పట్ల ప్రజలు విశ్వాసం ఉంచారని ఆయన వివరించారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీల నుంచి హేమాహేమీలు వచ్చి ప్రచారం చేసినా కేసీఆర్‌కే ప్రజలు పట్టం కట్టారన్నారు. ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇలా ఎంతోమంది నేతలు వచ్చి తెలంగాణలో ప్రచారం చేసినా, ప్రజలు కేసీఆర్‌కే పట్టం కట్టారని పేర్కొన్నారు. 2009లో చావునోట్లో తలపెట్టి మరీ.. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు సీఎం కేసీఆర్ కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ ధన్యజీవి అని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అభినందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజల కోసం నిర్విరామంగా కృషి చేసే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఈసారి మెజారిటీ తగ్గడం తనకు బాధ కలిగించిందన్నారు.

నిత్యం ప్రజల్లోనే ఉండే తలసానికి భారీ మెజారిటీ వచ్చి ఉండేదన్నారు. కానీ, రాష్ట్రంలో, హైదరాబాద్ నగరంలో లక్షల సంఖ్యలో ఓట్లు గల్లంతు అయ్యాయని చెప్పారు. మొత్తం 22 లక్షల ఓట్లు గల్లంతయ్యాయన్న ఆయన, ఎన్నికల సంఘం ఆ తప్పును తిరిగి సవరించు కుంటోందని చెప్పారు. ప్రతి గెలుపు నుంచి ఓటమి నుంచి పాఠాలు, గుణపాఠాలు నేర్చుకోవాలని, అంతేకానీ, ఓటు వేయని ప్రజలను ప్రశ్నించే హక్కు ఎవరికీ ఉండదని ఆయన హితవు పలికారు. ఈవీఎంలను తప్పుబట్టే ప్రతి పక్షాలకు, బుర్ర తుప్పుపట్టిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు టీఆర్ఎస్‌కు 75శాతం సీట్లు కట్టబెట్టి అఖండమైన విజయాన్ని అందించారన్నారు. టీఆర్ఎస్‌పై ప్రజలకు చెక్కుచెదరని విశ్వాసం ఉందని ఈ ఫలితాలు మరోసారి రుజువు చేశాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ సరైన నాయకుడని ప్రజలంతా భావించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28లక్షల ఓట్లు గల్లంతయ్యా యన్న కేటీఆర్, ఉద్యమ స్ఫూర్తితో ఓటర్ నమోదు కార్యక్రమంలో టీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలన్నారు. రాష్ట్రంలో 118 స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తే, ఆపార్టీకి 103 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు అయ్యా యన్నారు.



పేదప్రజలు టీఆర్ఎస్‌పై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుందామని కేటీఆర్ కార్యకర్తలకు సూచించారు. ప్రతి కార్యక్రమంలో సనత్‌నగర్ నుంచి ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే తలసాని కోరుకుంటారని, అలాగే ఓటర్ నమోదు కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో కార్యకర్తలు, నాయకులు నిలబెట్టాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. అలాగే డివిజన్ల వారీగా ఇచ్చిన వాగ్దానాలకు ప్రణాళి కాబద్ధంగా అమలు చేద్దామని చెప్పారు. నాయకుల చుట్టూ తిరిగే వారికి కాకుండా, పార్టీలో కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవులు తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయి

మూడు నెలల్లో కాళేశ్వరం

తెలిపారు. ఫ్లడ్ బ్యాక్ పరిధిలో రివెట్మెంట్ పనులు పురోగతిపై కేసిఆర్ అధికారులను ప్రశ్నించారు. 46శాతం మాత్రమే జరుగడంతో సిఎం పనుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గోలివాడ పంపుహౌజ్ పనులను కేసిఆర్ క్షుణ్ణంగా పరిశీలించారు. రూ. 2022.3కోట్లతో చేపట్టిన గోలివాడ పంపుహౌజ్‌లో ప్రతిరోజు రెండు టీఎంసిల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం గల 9 మోటర్లను బిగించడం జరుగుతుంది. 3టీఎంసిలకు సామర్థ్యం పెంచేందుకు వీలుగా సివిల్‌పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రాజెక్టు పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.గోలివాడ పంపుహౌజ్‌లో 5.6లక్షల క్యుబిక్‌మీటర్ల పని జరుగాల్సి ఉండగా 5లక్షల క్యూబిక్ మీటర్ల మేర పనిపూర్తి చేశామని, నాలుగు పంపులు ఎలక్షన్ పూర్తి చేశామని, మోటర్ల బిగింపు పనులు వేగంగా సాగుతున్నాయని, 5మోటర్లు స్పైరల్‌కేసింగ్ పనులను పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ఇంత వరకు రూ.1547.65 కోట్ల విలువ గల పనులు పూర్తి చేయడం జరిగిందని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో మరింత వేగం పెంచాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు. మార్చి చివరి నాటికి 9 మోటర్లు బిగింపు పూర్తి చేసేలా పక్కా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని కోరారు. మార్చి చివరి నాటికి ట్రయల్‌రన్ నిర వ్వహించాలని ఆదేశించారు. జనవరి చివరి నాటికి నాలుగు ట్రయల్‌రన్ పూర్తి చేయాలని సిఎం గుత్తేదారులను,ఇంజనీర్లను ఆదేశించారు. పనుల్లో వచ్చే ఆటంకాలను అధిగమిస్తు సకాలంలో పని పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఖరీఫ్‌లో వ్యవసాయానికి సాగునీరు అందించాలని కోరారు. పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని తెలిపారు. మరింత ఉదృతంగా ముందుకు సాగాలని సిఎం కోరారు. సకాలంలో పనులు పూర్తి చేయడానికి మూడు షిఫ్ట్‌ల్లో పని చేయాలని ఆదేశించారు. కార్మికులు, యంత్రాల సంఖ్య పెంచాలని సూచించారు. అందుకు అవసరం అయిన అన్ని చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. మార్చి చివరి వరకు కాళేశ్వరం వద్ద కాపర్‌డ్యామ్ నిర్మించి పనులు పూర్తి చేసి నీరందించాలన్నారు. వందశాతం నీరు అందించేలా పనుల్లో వేగం పెంచాలని కేసిఆర్ ఏజెన్సిలను ఆదేశించారు. అన్నారం పంపుహౌజ్ పనులను కూడా సమాంతరంగా వేగంగా చేస్తు ఫిబ్రవరి చివరి నాటికి పూర్తి చేయాలని కోరారు.

పంపుహౌజ్ పరిధిలో 8 పంపుల్లో భాగంగా 6పంపుమోటర్లు వచ్చాయని మిగితా మోటర్లు త్వర లోనే వస్తాయని వాటి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.అనంతరం జగిత్యాల జిల్లాలోని ఇబ్రహింపట్నం మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, మల్యాల మండలం రాంపూర్‌లలో జరుగుతున్న శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు దశను మార్చేందుకు ఎస్సారెస్పి ప్రాజెక్టు పునరుజ్జీవ పథకం కింద చేపడుతున్న ఎత్తిపోత పథకం పనులను సందర్శించి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో కొంత ఆలస్యం జరుగుతుందని పనుల పురోగతిలో అధికారుల తీరుపై కేసిఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాజేశ్వర్‌రావుపేట లిఫ్ట్ పనుల దగ్గర అధికారులతో సిఎం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతు రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పిని నింపేందుకు ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయాలను విడుదల చేస్తుందని తెలిపారు. అధికారులు, గుత్తెదారులు పనులను త్వరితగతిన పూర్తి చేసి తమ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు.తెలంగాణాలో రైతన్నలు ఆనందంతో ఉండేందుకు ప్రాజెక్టులను నిర్మిస్తున్నామని అందుకోసం అధికారయంత్రాంగం ఆహర్నిశలు కృషి చేయావల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. లిఫ్ట్ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనని, మరోమారు ప్రాజెక్టుబాట చేపడుతానని ఈ సందర్భంగా కేసిఆర్ చెప్పారు. కేసిఆర్ పర్యటన సందర్భంగా ఆయా జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్‌కె జోషి ముఖ్యమంత్రి కార్యదర్శి స్మీతాసబర్వాల్, డిజిపి మహేంధర్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు డాక్టర్ వివేకానంద,మాజి స్పీకర్ సురేష్‌రెడ్డి, కరీంనగర్‌జిల్లా పరిషత్ చైర్ పర్సన్ తుల ఉమ, ఉమ్మడి జిల్లాలోని నీటిపారుదలశాఖ అధికారులు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. సిఎం రెండవ రోజు పర్యటన సందర్భంగా ఆయన పర్యటించే ప్రాంతాలలో ఆయా జిల్లాల పోలీసు అధికారులు భారి ఎత్తున భద్రత ఏర్పాట్లను చేశారు. కేసిఆర్ రెండు రోజుల ప్రాజెక్టుల బాట విజయవంతంగా పూర్తి కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సుందిళ్ల బ్యారేజ్ పనులపై ముఖ్యమంత్రి ఫైర్ : ప్రతిష్టాత్మకంగా చేపట్టిన



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంప్ హౌజ్‌లకు సంబందించి జరుగుతున్న వివిధ పనులతోపాటు ఫ్లడ్ బ్యాంక్ రివేట్మెంట్ పనులు పూర్తి కాకపోవడం పట్ల అధికారులు,గుత్తేదారులపై ముఖ్యమంత్రి తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజ్,అన్నారం పంప్ హౌజ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి హెలిక్యాప్టర్ ద్వారా పరిశీలించారు. అనంతరం నిర్మాణ ఏజేన్సీ ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల వివరాలను సంబందిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లడ్ బ్యాంక్ పరిధిలో రివెట్మెంట్ పనుల పురోతగిపై సీఎం అధికారులను ప్రశ్నించగా ఇప్పటి వరకు 46 శాతమే రివెట్మెంట్ పనులు పూర్తి అయినాయని చెప్పడంతో సీఎం తీవ్ర అసహనానికి లోనైయ్యారు. చెప్పిన గడువులోగ పనులను ఎందుకు పూర్తి చేస్తాలేరంటూ నవయుగ కంపెనీ సంస్థ చైర్మన్ విశేశ్వర్‌రావును సీఎం ప్రశ్నించారు. అయితే అన్నారం బ్యారేజీ, పంప్ హౌజ్ పనులను పరిశీలించిన అనంతరం సుందిళ్ల బ్యారేజ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి బ్యారేజ్ పనులతోపాటు అన్నారం పంప్ హౌజ్ పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలించాల్సి ఉండగా జరుగుతున్న పనుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారుల,గుత్తేదారుల నిర్లక్ష్యంపై ఆగ్రహంతో ముఖ్యమంత్రి తన సుందిళ్ల పర్యాటనను అర్ధంతంగా ముగించుకుని వెళ్లిపోయాడు.

మొదటి పేజీ తరువాయి

క్యాబినెట్‌కు పంచాయతి గండం

బదిలీ చేయరాదని ఈసీ స్పష్టం చేసింది. బతుకమ్మ చీరల పంపిణీ, రైతుబంధు చెక్కుల పంపిణీ వంటివి వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే, పాలక మండళ్లు ఉన్న చోట జిల్లా, మండల, మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చునని, కానీ, విధాన పరమైన నిర్ణయాలు తీసుకోకూడదని సూచించింది. రోజుకు రూ. 50 వేలు నగదు మాత్రమే వెంట తీసుకెళ్లేందుకు ఈసీ అనుమతించింది. జిల్లాల్లో, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు చేసి.. తనిఖీలు నగదు పంపిణీపై తనిఖీలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది.

రాక్షస పాలన మనకొద్దు

రామారావు ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. తీన్‌మార్ డప్పులు, సాంప్రదాయ తప్పిటిగుళ్ళు కళాకారులతో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చుతూ పూర్ణకుంభం వేదమంత్రాలు సాక్షిగా, కాబోయే ముఖ్యమంత్రి జగన్ , వైసీపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ జగన్‌ను ఆహ్వానించారు. ముందుగా పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలిరాగా, రాణిగాం వరకు జగన్‌కు తోడుగా పాదయాత్ర కొనసాగిస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు. రాణిగాంలో పాదయాత్ర అడుగుపెట్టగానే ఇచ్ఛాపురం నియోజక వైసీపీ శ్రేణులు జెండాలు పట్టుకొని బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ పాదయాత్రలో వైసీపీ నేతలు డాక్టర్ నిమ్మాన దాస్, ఇప్పిలి కృష్ణారావు, కంచిలి ఎంపీపీలు ఇప్పిలి లోలాక్షి, కవిటి మాజీ ఎంపీపీ బెందాళం కిరణ్‌కుమారఇ, సోంపేట మాజీ ఎంపీపీలు మంగి గణపతి, ధనలక్ష్మి, ఇచ్ఛాపురం పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మాజీ ఛైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్, అగర్వాల్ (లల్లూ), సోమశేఖర్, తడక జోగారావు, పొడుగు కామేశ్వరరావు, కాళ్ళ దేవరాజ్, ఉలాల కుటంబీకులు, పసువులేటి ఆదిరెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త కాయల వెంకటరెడ్డి, పూడి నేతాజీ, శ్యాంపురియా, కడియాల ప్రకాశ్, రజనీదౌలాయి, బల్ల గిరిబాబు, జగన్నాయకులు, అగ్గున సూర్యారావు, రాపాక శేషగిరి, జుత్తు నీలకంఠం, దువ్వాడ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతం కానున్న మొబైల్, ఫైబర్ నెట్ , వైఫై సేవలు



(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) : ఏపీటీఎల్ (ఏపీ డిజిటల్ ఇన్ఫ్రా), ఏపీ ఫైబర్ నెట్ కార్యక లాపాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా సచివాలయంలో ఉన్నత అధికా రులతో సమీక్ష నిర్వహిం చారు. వారికి కావా ల్సిన ప్రభుత్వ స్థలాలను న్యాయమైన ధరలకు అద్దెకు ఇవ్వాలని ఆయన సూచిం చారు. ఏపీ డిజిటల్ ఇన్ఫ్రాతో జాయింట్ వెంచర్ తో ఒప్పందం చేసుకున్న కంపెనీకి వచ్చే ఆదాయం నుంచి ప్రతి సంవత్సరం 30.33 శాతం ప్రభుత్వానికి సమకూరుతుందని ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్, సీఎస్ దృష్టికి తీసు కువచ్చారు. రాబోయే మూడు సంవత్సరాల్లో 5జీ సేవల కోసం 12000 టవర్ల అవసరం ఉంటుందని, ప్రభుత్వం ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా, కేవలం స్థలాలను ప్రయివేట్ కంపెనీకి అద్దెకు ఇవ్వడం ద్వారా స్థానిక సంస్థలతోపాటు, పలు శాఖలకు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వ స్థలాలు, భవనాలపై ఏర్పాటు చేసే టవర్లకు ఎంత అద్దె వసూలు చేయాలనే దాని పై, పొరుగు రాష్ట్రాల్లో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సీఎస్ అనిల్ చంద్ర పునేఠా సూచించారు. రాష్ట్రంలోని 110 మునిసిపాలిటీల్లో 970 ప్రాంతాల్లో ఉచిత వైఫై ఇచ్చే కార్యక్రమం ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 15వ తేదీనాటికి 1000 కేంద్రాలు ప్రారంభించాలని ఏపీ ఫైబర్ నెట్ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం రూ.53 కోట్ల ఖర్చయ్యే ఈ ప్రాజెక్టులో బహుళజాతి సంస్థ గూగుల్ పాలుపంచుకోనుంది. గూగుల్ సంస్థ నెట్ సేవలను ఉచితంగా అందిం చనుంది. ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో ప్రభుత్వానికి 70 శాతం గూగు ల్, ప్రభుత్వానికి చెల్లించనుందని అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రజలకు ఇంటర్ నెట్ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయని అధికా రులు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, వారి కార్యాలయాల్లో వైఫై బాక్సులు పెట్టుకునేందుకు సహకరించాలని సీఎస్, పలు శాఖల కార్యదర్శులను ఆదేశించారు.

ప్రగతి పథంలో నవ్యాంధ్ర

• ఆర్థిక లోటులోనూ ఆగని అభివృద్ధి పథకాలు • నదుల అనుసంధానంతో చరిత్ర సృష్టించిన చంద్రబాబు • నాలుగేళ్ల టిడిపి పాలనపై ప్రజల్లో పెరిగిన సంతృప్తి • ఎన్నడూ లేని విధంగా దర్శి నియోజకవర్గం అభివృద్ధి బాట • జన్మభూమితో జన సంద్రమైన దర్శి పట్టణం సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ విజయ్ కుమార్ • 'జన్మ భూమి-మా ఊరు' సభలో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు



దర్శి, మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో ప్రజాసమస్యలు పరిష్కరించడాని ప్రభుత్వం జన్మ భూమి మావూరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. బుధవారం దర్శి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో దర్శి గ్రామ పంచాయతీ జన్మ భూమి మా ఊరు గ్రామ సభ జరిగింది. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అట వీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోస ము చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటాని ప్రజలను కాపాడాలని ముఖ్య మం త్రి కేంద్రము పై పోరాడుతు న్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన అ న్యాయం పై ముఖ్యమంత్రి చంద్రబాబు ధర్మపోరాట దీక్ష చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో 16 వేల 500 కోట్ల రూపాయల లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి అభివద్ధి సంక్షేమ ,సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారన్నారు. రాష్ట్రం లో రైతులు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అమలు చేశారన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం చేపట్టి ఛాలెంజ్‌గా తీసుకుని పోలవరం ప్రాజె క్టును రాష్ట్ర సొంత నిధులతో వేగవంతంగా పూర్తి చేస్తున్నార న్నారు.గోదావరి నదిని పట్టిసీమ ద్వారా కష్ణ నది అనుసంధానం చే శారన్నారు. కష్ణానదీని పెన్నా నదికి అనుసంధానం చేయడానికి నకిరేకల్ వద్ద ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారన్నారు.రాష్ట్రానికి రావాల్సిన ఆస్తుల పంప కాలు, విశాఖ రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, విభజన హామీలోని 19 అంశా లను అమలు చేయలేదని ఆయన అన్నారు. ప్రకాశము జిల్లాలో 20 వేల కోట్ల రూపాయలతో 30 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఈ నెల 9 తేదీన రామాయపట్నం వద్ద పేపర్ మిల్లుకు, రామాయపట్నం ఓడరేవు కు ఉద్యాన వన యూనివర్సిటీకి, చిరు ధాన్యాలు పరిశోధన కేందానికి ముఖ్య మంత్రి చంద్రబాబుశంఖుస్థాపన చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టును వేగవంతం పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారన్నారు.దర్శి నియోజకవర్గ పరిధిలోని 3వేల కోట్ల రూపాయలతో అభివద్ధి సంక్షేమ కార్య క్రమాలు చేపట్టారన్నారు. దర్శిలో గడచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో 144 కోట్ల రూపాయల అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న శాసన మండలి సభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ జిల్లాలో దర్శి నియోజకవర్గాన్ని మంత్రి శిద్దా రాఘవరావు ప్రధమ స్థానంలో నిలిపారన్నారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యలు పై వెంటనే స్పందించి ప్రజలకు సేవలను అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మంత్రి సేవలు ఉపయోగించు కోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడానికి అనేక చర్యలు తీసుకోవడము జరిగిందన్నారు. జిల్లాలో రైతుల వద్ద నిల్వలు ఉన్న కంది,శనగ, పత్తి పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడము జరిగిందన్నారు. రైతులకుసాగునీటి సమస్యలు రాకుండా పంటలకు సాగర్ కాలువల ద్వారా సాగునీరు అందించడము జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ మాట్లాడుతూ జిల్లాలో 1028 గ్రామ పంచాయతీల్లో, 330 మున్సిపల్ వార్డుల్లో ఈ నెల2 వతేదీ నుండి 11 వరకు జన్మ భూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించడము జరుగుతుందన్నారు. జన్మ భూమి మాఊరు కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఒక్క రోజు అంతా గ్రామాల్లో ఉండి ప్రజల నుండి అర్జీలు తీసుకోవడము జరుగుతుందని ఆయన చెప్పారు. జిల్లాలో 2లక్షల 10 వేల మందికి రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఉమ్మడి కుటుంబాలనుండి విడిపోయి వారికి ప్రత్యేకంగా ఈ జన్మ భూమి మాఊరు కార్యక్రమంలో రేషన్ కార్డులను పంపిణీ చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. జిల్లాలో ఎన్.టి.అర్ భరోసా క్రింద 3 లక్షల 52 వేల మందికి పెన్షన్లు మంజూరు చేశామన్నారు. కొత్తగా జిల్లాలో 16వేల మందికి పెన్షన్లు మంజూరు కావడము జరిగిందన్నారు. ఈ నెల 11 వతేది జన్మ భూమి మాఊరు కార్యక్రమంలో రేషన్ కార్డులు, పెన్షన్లు పంపిణీ చేస్తామని ఆయన అన్నారు. జిల్లాలో చంద్రన్న భీమా పథకము క్రింద 14 వేల మందికి 160 కోట్ల రూపాయలు పంపిణీ చేయడము జరిగిందన్నారు. జిల్లాలో చంద్రన్న పెళ్లి కానుకలు పథకము క్రింద 50 వేల నుండీ లక్ష రూపాయల వర కు వివాహ ప్రోత్సాహకాల క్రింద 3.50 కోట్ల రూపాయలు పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. జిల్లా ఎన్. టి.ఆర్‌గృహనిర్మాణం పథకము క్రింది 95 వేలగృహాలను మంజూరు చేయడము జరిగింద న్నారు.జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద 640 కోట్ల రూపాయల తో 2 వేల200 కిలో మీటర్లు సిమెంటు రోడ్డులు నిర్మించడం జరిగిందన్నారు.జిల్లాలో పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలు క్రింద 246 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. జిల్లాలో టంగుటూరి ప్రకాశము పంతులు పేరుతో యూనివర్సిటీ ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.జిల్లాలో పేపర్ మిల్లు స్థాపించడాని జిల్లా కు 30 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు పేపర్ ఫుల్ప్ కంపెనీ ముందుకు వచ్చింద న్నారు.రాబోయే రోజుల్లో ప్రకాశము జిల్లా వేగవంతం గా అభివ ద్ధి చెందు తున్నదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జన్మ భూమి మాఊరు ప్రతిజ్ఞను ప్రజలతో మంత్రి చేయించారు. 78స్వయం సహాయక సంఘాల మహిళలకు2 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చెక్కును మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపా రావు, దర్శి ఎంపీపీ వూసల సంజీవయ్య, దర్శి జడ్పీటీసీ జీస్టీవెన్,దర్శి నియోజ కవర్గ ప్రత్యేక అధికారి బి.రవి,డ్వామా పి.డి.వెంకటేశ్వర్లు, ఎస్.సి.కార్పొరేషన్ ఇ. డి.కష్ణ వేణి ,ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసిల్దార్ విజయ్ కుమారి, కనీసవేతనాలు అమలు బోర్డ్ డైరెక్టర్ శోభారాణి, వైస్ ఎంపీపీ మారేం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు పట్టణాభివృద్ధి సంస్థలు



అమరావతి, సూర్య బ్యూరో : రాష్ట్రంలో మరో మూడు పట్టణాభివద్ధి సంస్థల (ఉడా)ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవల్‌పమెంట్ అథారి టీస్ యాక్ట్, 2016 మేరకు కడప, ఒంగోలు, ఏలూరు కేంద్రాలుగా వీటిని ఏర్పాటు చేసింది. వీటికి అధ్యక్షులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుందని, ఉపాధ్యక్షులుగా వ్యవహ రించబోయే ప్రభుత్వ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని పేర్కొంది. సభ్యులుగా వురపాలక– పట్టణాభివద్ధి శాఖ ఓఎస్డీ లేదా జాయింట్ లేదా డిప్యూ టీ సెక్రటరీ, ఆర్థికశాఖ జాయింట్ లేదా డిప్యూటీ సెక్రటరీ, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నలుగురు అధికారులతో పాటు ఆయా జిల్లా కలెక్టర్లు, డీటీసీపీ లేదా ఆయన నియమించే నామినీ, పట్టణాభివద్ధి వ్యవహారాల్లో ముగ్గురు నిపుణులు వ్యవహరిస్తారని జీవోలో పేర్కొన్నారు. కడప కేంద్రంగా అన్నమయ్య అర్బన్ డెవల్‌పమెంట్ అథారిటీ (ఎ.యు.డి.ఎ.), ప్రకాశం జిల్లా ఒంగోలు కేంద్రంగా ఒంగోలు అర్బన్ డెవల్‌పమెంట్ అథారిటీ (ఒ.యు.డి.ఎ.) పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు కేంద్రంగా ఏలూరు అర్బన్ డెవల్‌పమెంట్ అథారిటీ (ఇ.యు.డి.ఎ.) పనిచేయనున్నాయి.

ఐదురోజుల భవానీ దీక్షలలో 5 లక్షల మంది దర్శనం



విజయవాడ, సూర్య బ్యూరో : ఇంద్రకీలాద్రిపై ఐదు రోజులు జరిగిన భవానీ దీక్షల విరమణ ఉత్సవాల్లో 5 లక్షలమంది భవానీలు అమ్మవారిని దర్శించు కున్నట్లు ఈవో కోటేశ్వరమ్మ తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గగుడి యాగశాలలో జరి గిన మహా పూర్ణాహుతి కార్యక్రమంలో ఆమె పాల్గొ న్నారు. ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సంప్రదా యాలు, వూజలు శాస్త్రోక్తంగా నిర్వహించటం వల్లే ఎలాంటి ఆటంకాలు తలెత్తలేదని ఈవో అభిప్రాయపడ్డారు. భవానీలు ఇంకా వస్తున్నందున దీక్షల విరమణ కోసం చేసిన ఏర్పాట్లు రేపు కూడా కొనసాగుతాయని తెలిపారు. దుర్గగుడి ఉద్యోగులతో పాటు అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలు జయప్రదమయ్యాయని చెప్పారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ భవానిలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన ఏర్పాట్లు చేశామని వివరించారు. ఉత్సవాల ఫలాన్ని భక్తజనమందరికీ పంచేందుకు వూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించినట్లు దుర్గగుడి స్థానాచార్యులు శివప్రసాదశర్మ తెలిపారు.

సేవా కార్యక్రమాల నుండి వ్యాపారరంగంలోకి ప్రవేశం

అమరావతి, సూర్య బ్యూరో : బి.వి.ఆర్. మెమోరియల్ శుభమస్తు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలురకాల సేవా కార్యక్రమాలను అందిస్తున్నట్లు ఫౌండేషన్, సంస్థ ప్రతినిధులు బయ్యా శ్రీనివాసులు, వెంకట రవికుమార్ తెలిపారు. గుండెపోటు నుండి తాత్కాలికంగా బయటపడేందుకు లోడింగ్ డోస్ టాబ్లెట్లను కూడా ఉచితంగా తమ శుభమస్తు వస్త్ర సముదాయంలో అందు బాటులో వుంటా యని తెలిపారు. సేవా కార్యాక్రమాలతోపాటు వ్యాపారం ధనార్జనే కాకుండా శుభమస్తు వస్త్ర సముదాయాన్ని నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజల కోసం నగరంలో ప్రారంభించామన్నారు. ఈ సముదాయంలో పేద, మధ్యతరగతి వారి నుంచి ఉన్నత వర్గాల వారి వరకు చీరలు, వస్త్రాలు, రెడీమేడ్ల వంటి వేలాది రకాల వస్త్ర ఉత్పత్తులు, ఫ్యాషన్, విభిన్న వెరైటీలలో అందుబాటులో వుంటాయని తెలిపా రు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దక్షిణాది తార అనుపమ పరమేశ్వరన్, బిగ్‌బాస్ సీజన్ 2 విజేత కౌశల్ పాల్గొనడం అభినందనీయమన్నారు.

గృహనిర్మాణ ప్రాజెక్టులను నిర్దేశిత గడువు ప్రకారం పూర్తి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ



అమరావతి, సూర్యప్రధానప్రతినిధి : రాష్ట్రంలో ఎపి టౌన్షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా చేపట్టిన వివిధ పట్టణ గృహనిర్మాణ ప్రాజెక్టులను నిర్దేశిత గడువు ప్రకారం సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం అమరావతి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో ఏపిటిడ్కో కు సంబంధించిన రాష్ట్రస్థాయి సాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన గృహనిర్మాణ ప్రాజెక్టులు అన్నిటినీ నిర్దేశిత గడువు ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈగృహాపా నిర్మాణ పథకాలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక ఏమిటని మొదటి,రెండవ దశ ప్రాజెక్టు పనులు ఎప్పుడు మొదలు పెట్టారు ఎప్పటికి పూర్తిచేస్తారన్నవివరాలడిగి తెల్సుకున్నారు. మొదటిదశ ప్రాజెక్టు పనులను రానున్న నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. మంజూరు చేసిన గృహాలన్నిటినీ త్వరితగతిన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఈగృహాలకు కేంద్రం నుండి రావాల్సిన నిధులను సకాలంలో రాబట్టేందుకు కృషి చేయడంతో పాటు రాష్ట్ర వాటాగా సమకూర్చాల్సిన నిధులను సకాలంలో విడుదల చేయాలని ఆర్థికశాఖ అధికారులను సిఎస్ పునేఠ ఆదేశించారు. ఎపిటిడ్కో ఎండి బియం దివాన్ మైదీన్ పట్టణ గృహ నిర్మాణ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ ఎన్టిఆర్ నగర్స్ కింద వివిధ పట్టణాల్లో 5లక్షల 29వేల 786 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 4లక్షల 60వేల 492 గృహాలకు టెండర్లు ఖరారై 3లక్షల 60వేల 365 గృహాలు నిర్మాణం ప్రారంభం కాగా వాటిలో లక్షా 33వేల 631 ఇళ్లు స్లాబు స్థాయికి చేరాయని వివరించారు. అదే విధంగా ఎన్టిఆర్ అర్బన్ హౌసింగ్‌కు సంబంధించి 4లక్షల 28వేల 444 గృహాలు మంజూరు కాగా వాటిలో లక్షా 61వేల 751 ఇళ్లకు పరిపాలనామోదం ఇవ్వగా వాటిలో లక్షా 9వేల 757 ఇళ్లు గ్రౌండ్ కాగా 71వేల గృహాలు నిర్మాణం పూర్తయిందని తెలిపారు. మొదటి దశ పనులను మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. 11 అర్బన్ లోకల్ బాడీస్ మరియు 5 అర్బన్ డెవలప్మెంట్ అథారిటీస్ 41 డిపిఆర్లు (సవివర ప్రాజెక్టు నివేదికలు)ప్రతిపాదనలు వచ్చాయని వాటిద్వారా 57వేల 433 గృహాలు నిర్మాణించాల్సి ఉందని అన్నారు. ఇందుకు మొత్తం 3వేల183కోట్ల రూ.లు వ్యయం కానుండగా కేంద్రం నుండి 861కోట్ల రూ.లు,రాష్ట్ర ప్రభుత్వం నుండి 676కోట్ల రూ.లు సమకూర నుండగా మరో 453కోట్ల రూ.లను రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల నిమిత్తం ఖర్చు చేయనుండగా మిగతా 1191 కోట్ల రూ.లను లబ్ధిదారుల వాటాగా భరించాల్సి ఉంటుందని ఎండి మైదీన్ వివరించారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాములు,మున్సిపల్ మరియు పట్టణాభివృఎద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికల వలవన్,మున్సిపల్ శాఖ కమీషన్ కె.కన్నబాబు, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే,ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి డా.కెవి.సత్యనారాయణ,ఇంకా ఎపిటిడ్కో ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన 30వ విజయవాడ పుస్తక మహోత్సవం



విజయవాడ, సూర్య బ్యూరో : విజయవాడ స్వరాజ్య మైదానం (పీడబ్ల్యూడీ గ్రౌండ్స్)లో జనవరి 1 నుంచి 11 వరకూ జరిగే వుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. ఇక్కడ దొరకని వుస్తకాలు, ఆడియోలు, వీడియోలుకాని వుండదని అభిమానుల అభిప్రాయం. ఒకటి కాదు రెండు కాదు లక్షాయాభై వేల వుస్తకాలు, 290 స్టాళ్లతో ఏర్పాటుతో చేయబడింది. మంగళవారం జాతి పిత మహాత్మా గాంధీ మనవడు, చరిత్రకారుడు ఆచార్య రాజమోహన్‌గాంధీ, శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సాహిత్య అకాడమీ వురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సిసోడియా తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమైంది.

1989 మొదటి వుస్తక మహోత్సవం...

మంచి ప్రచురణలు, పఠనాన్ని ప్రోత్సహించడానికి స్థాపించిన నేషనల్ బుక్‌ట్రస్ట్ 1989 అక్టోబరులో మొదటి విజయవాడ వుస్తక మహోత్సవాన్ని నిర్వ హించింది. దీనికి మంచి ఆదరణ లభించడంతో ఏటా నగరంలో వుస్తక మహో త్సవం నిర్వహించాలని సంకల్పించారు. నేషనల్ బుక్‌ట్రస్ట్ సహకారంతో ఇక్కడి ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు కలిసి విజయవాడ వుస్తక మహోత్సవ సంఘం (వీబీఎఫ్‌ఎస్)గా ఏర్పడ్డారు. 1991 నుంచి ఏటా జనవరిలో వుస్తక మహోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. 1989లో 84 స్టాళ్లతో వుస్తక ప్రదర్శన నిర్వహించగా, 2015లో నిర్వహించిన 26వ వుస్తక మహోత్సవంలో అత్యధికంగా 389 స్టాళ్లను పెట్టి రికార్డు సష్టించారు. ఏటా జనవరి 4న విజయవాడలో వుస్తక ప్రియులు పాదయాత్ర కూడా నిర్వహిస్తారు. విజయవాడకు అంతగా విమాన సౌకర్యం లేని రోజుల్లోనే కుష్వంత్ సింగ్, ఆర్కే లక్ష్మణ్, రొమిల్లా థాపర్ వంటి జాతీయ అంతర్జాతీయ సాహితీవేత్తలు ఈ ప్రదర్శనలో నిర్వహించే సాహితీ సభలకు అతిథులుగా హాజరయ్యారు. ఆరుద్ర, సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ, కాళీపట్నం రామారావు, మధురాంతకం రాజారాం, బావు రమణ ఇలా తెలుగు సాహిత్యానికి వన్నెలద్దిన రచయితలంతా ఈ ఉత్సవానికి తరచుగా వచ్చి వెళ్లేవారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

విజయవాడ, సూర్య బ్యూరో : సంక్రాంతి పండగ రద్దీ నేపథ్యంలో మరో 13 ప్రత్యేక ఛార్జీల రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇందులో రెండు మినహా మిగిలినవి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ నగరాల నుంచి హైదరాబాద్‌కు పండగ తర్వాత తిరిగి వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని నడు పనున్నవే. కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు ఏడు, నర్సాపూర్ నుం చి సికింద్రాబాద్‌కు మూడు, విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు ఒకటి.. సికిం ద్రాబాద్ నుంచి కాకినాడకు రెండు ప్రత్యే క ఛార్జీల రైలు సర్వీసులు తిరగ నున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. మొత్తం 13 ప్రత్యేక రైళ్లలో 11 సర్వీసు లు భారీ ఛార్జీలుండే సువిధ ప్రత్యేక రైళ్లు కావడం గమనార్హం. వీటిలో టికెట్లు అయిపోయేకొద్దీ ఛార్జీలు పెరుగుతూ ఉంటాయి. గరిష్ఠంగా మూడు రెట్ల అదనపు ఛార్జీలు ఉంటాయి. కాకినాడ– సికింద్రాబాద్ సువిధ రైళ్లు. 16, 17, 20 తేదీల్లో రెండేసి. 18న ఒకటి. నర్సా పూర్–సికింద్రాబాద్ (సువిధ) 18, 19, 20 తేదీల్లో ఒక్కోటి. విజయ వాడ–సికింద్రాబాద్ (సువిధ) 17న ఒకటి. సికింద్రాబాద్–కాకినాడ: ప్రత్యేక ఛార్జీల రైళ్లు. 13, 20 తేదీల్లో ఒక్కోటి.

కానిస్టేబుల్ నిజాయతీ

జగిత్యాల: జగిత్యాల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శాంతయ్య అనే కానిస్టేబుల్ తన నిజాయతీని చాటుకున్నాడు. డిసెంబరు 29న గొల్లపల్లి రోడ్డులో గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన సౌమ్య అనే మహిళ పర్సు పోగొట్టుకుంది. అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న శాంతయ్యకు పర్సు లభించింది. అందులో రూ.99 వేల నగదు లభ్యమైంది. వివరాలు సేకరించగా గొల్లపల్లి మండలం రాఘవపట్నంకు చెందిన సౌమ్యగా గుర్తించారు. మంగళవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలికి పోగొట్టుకున్న పర్సును ట్రాఫిక్ ఎస్సై ఆరోగ్యం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ శాంతయ్యను ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితా విడుదల



31 వరకు అభ్యంతరాల స్వీకరణ
జిల్లా ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్: శాసనమండలి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయుల నియోజకవర్గం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో జాబితాను ప్రచురించడమైందని అన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ఓటరు జాబితాలోని అభ్యంతరాలను సవరించేందుకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, ఫిబ్రవరి 15వ తేదీన వాటి పరిశీలన అనంతరం సప్లమెంటరీని విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 25న ఓటర్ల తుది జాబితాను విడుదల చేస్తామని చెప్పారు. జనవరి 31వ తేదీ వరకు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను బూ త్‌లవారీగా వెబ్‌సైట్‌లోగాని, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లోగాని సమర్పించవచ్చని, ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొత్త ఏడాది నిరుద్యోగులకు కొలువుల పండగ



• 1,386 పోస్టులు, 7 నోటిఫికేషన్లు
• భారీగా గ్రూప్-1, 2 లెక్చరర్ ఉద్యోగాలు

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) : నిరుద్యోగులకు రాష్ట్రంలో కొత్త సంవత్సరం కొలువుల పండగ రాబోతుంది. వివిధ ప్రభుత్వ విభాగాలు, పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 1,386 పోస్టులను భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ 7 నోటిఫికేషన్లు విడుదల చేసింది. గ్రూప్–1, గ్రూప్–2 సర్వీసెస్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్లు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, ఫిషరీస్ డెవల్‌పమెంట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ పోస్టులు ఉన్నాయి. నోటిఫికేషన్లను వెబ్‌సైట్‌లో ఉంచారు.

169 పోస్టులతో గ్రూప్–1: ప్రధానమైన గ్రూప్–1 సర్వీసెస్‌లో 169 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులు జనవరి 7 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజును జనవరి 27వ తేదీ రాత్రి 11.59లోవు చెల్లించాలి. జూన్ 10 నుంచి 22 వరకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతవురంలో మెయిన్స్ నిర్వహిస్తారు. మార్చి 10న నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో 2 పేపర్లు 120 మార్కుల చొప్పున నిర్వహిస్తారు. కన్వెన్షన్ టైవులో నిర్వహించే మెయిన్స్‌లో 150 మార్కులకు తెలుగు, 150 మార్కులకు ఇంగ్లీషులో తప్పనిసరి ఉత్తీర్ణతా పరీక్షలు ఉంటాయి. అనంతరం, 150 మార్కుల చొప్పున 5 పేపర్లు నిర్వహిస్తారు. అంటే, 750 మార్కులకు మెయిన్స్ ఉంటుంది. ఇంటర్వ్యూ 75 మార్కులకు ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు రుసుము రూ.250, పరీక్ష ఫీజు రూ.120 చెల్లించాలి.

446 పోస్టులతో గ్రూప్–2: 446 పోస్టులతో గ్రూప్–2 నోటిఫికేషన్ జారీ అయింది. వీటిలో 292 నాన్ ఎగ్జిక్యూటివ్, 154 ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయి. డిగ్రీ అభ్యర్థులు జనవరి 10 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజును 30 రాత్రి 11.59లోవు చెల్లించాలి. మే 5న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. జూలై 18, 19 తేదీల్లో మెయిన్స్ నిర్వహిస్తారు. ఆఫ్‌లైన్‌లో నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌లో 150 ప్రశ్నలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో నిర్వహించే మెయిన్స్‌లో 450 ప్రశ్నలు ఉంటాయి. దరఖాస్తు ఫీజు కింద రూ.250, ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.80 చెల్లించాలి.

43 పోస్టులతో ఎఫ్‌డీవో నోటిఫికేషన్: 43 ఫిషరీస్ డెవల్‌పమెంట్ ఆఫీసర్స్(ఎఫ్‌డీవో) పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిషరీస్ సర్వీస్‌లో బ్యాచ్‌లర్ డిగ్రీ చేసిన అభ్యర్థులు అర్హులు. జనవరి 17 నుంచి ఫిబ్రవరి 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష ఫీజును ఫిబ్రవరి 7 రాత్రి 11.59లోవు చెల్లించాలి. మే 21, 22 తేదీల్లో మెయిన్స్ నిర్వహిస్తారు. ఈ రెండు పరీక్షలు ఆబ్జెక్టివ్ టైవులోనే నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే మెయిన్స్‌లో 450 ప్రశ్నలు ఉంటాయి. అప్లికేషన్ ఫీజు రూ.250, ప్రాసెసింగ్ ఫీజు రూ.120 చెల్లించాలి.

10 పోస్టులతో ఏఐఎఫ్ నోటిఫికేషన్: 10 పోస్టులతో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫీషరీస్ నోటిఫికేషన్‌ను ఏపీపీఎస్సీ జారీచేసింది. ఫిషరీస్ టెక్నాలజీలో డిప్లొమా లేదా పీజీ డిప్లొమా అభ్యర్థులు జనవరి 18 నుంచి ఫిబ్రవరి 8 వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఫీజును ఫిబ్రవరి 7రాత్రి 11.59లోవు చెల్లించాలి. మే 21, 22 తేదీల్లో మెయిన్స్ నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో నిర్వహించే మెయిన్స్‌లో 300 ప్రశ్నలు ఉంటాయి. ఫీజు రూ.250, ప్రాసెసింగ్ ఫీజు రూ.80 చెల్లించాలి.

అన్ని ఉద్యోగాలకు కామన్ నిబంధనలు: 2018 జూలై ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండి 42 ఏళ్ల వయసు మించని అభ్యర్థులు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు మరో 5 ఏళ్లు, పీహెచ్ అభ్యర్థులకు 10 ఏళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది. దరఖాస్తుల సంఖ్య 25 వేలకు మించితే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. స్క్రీనింగ్ టెస్ట్ ఆఫ్‌లైన్‌లోను, మెయిన్స్‌ను ఆన్‌లైన్‌లోను నిర్వహిస్తారు. దరఖాస్తులు 25 వేలలోవు వస్తే నేరుగా మెయిన్స్ ఒక్కటే ఉంటుంది. రాత పరీక్షలో నెగిటివ్ మార్క్ ఉంటుంది.

సమస్యలుండగానే ఎన్నికలా?: గూడూరు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఓటర్ల జాబితా, బీసీ రిజర్వేషన్లు.. ఇలా అనేక సమస్యలను పరిష్కరించకుండానే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలకు వెళ్లడంపై టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి మండిపడ్డారు. 22లక్షల ఓట్లు గల్లంత య్యాయని, వాటిని పరిశీలించకుండానే ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల కేసు కోర్టులో ఉండగానే ప్రభుత్వం నోటిఫికేషన్ ఎలా జారీ చేస్తుందని ప్రశ్నించారు. అలాగే మంత్రివర్గంలేకుండా బీసీ రిజర్వేషన్లు తగ్గించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ విషయం కోర్టులో తేలిపోతుందన్నారు.

కొట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం రసాబాసగా మారింది. సమావేశంలో కార్యకర్తలు కొట్టుకున్నారు. కాంగ్రెస్ నేతల మధ్య రగడ నెలకొంది. మైనార్టీ నేత సాబిద్‌ఖాన్‌పై ఓ కార్యకర్త ఆరోపణలు చేశాడు. ఇది సహించని సాజిద్ అనుచరులు రెచ్చిపోయారు. ఆరోపించిన వ్యక్తిపై పిడిగుద్దులతో దాడి చేశాడు. వేదికపై ఉన్న నేతలు వారించినా కార్యకర్తలు ఆగలేదు. దీంతో సమావేశం గందరగోళంగా మారింది.

టీడీపీ హయాంలో ఇబ్బందులు

వైసీపీ బ్రాహ్మణ అధ్యయ కమిటీ

విజయవాడ, మేజర్‌న్యూస్:వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి బ్రాహ్మణ అధ్యయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో తొలిసారిగా బ్రాహ్మణ సమస్యలపై వైఎస్ జగన్, అధ్యయన కమిటీ వేయడం హర్షణీయమన్నారు. టీడీపీ హయాంలో బ్రాహ్మణులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణుల కోసం రూ.1000 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని బాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రాహ్మణులను బాబు ఆదుకోకుండా వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పేరు చెప్పి టీడీపీ కార్యకర్తలకు లోన్‌లు ఇస్తున్నారని వైసీపీ బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యులు ఆరోపించారు.

సత్తెనపల్లి జన్మభూమిలో స్పీకర్ కోడెల

సత్తెనపల్లి, సూర్య ప్రతినిధి : సత్తెనపల్లి పట్టణం ఒకటో వార్డులో జన్మభూమి 6వ విడత కార్యక్రమంలో ఏపీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల మాట్లాడుతూ 2018 సత్తెనపల్లి పట్టణానికి కోత్త అందాలు తెచ్చిందన్నారు. విస్తారమైన రోడ్లు, కేంద్రీయ విద్యాలయం, చెరువు, స్టేడియం, పార్క్, వావిలాల ఘాట్, ప్రభుత్వ కార్యాలయాలు ఇలా సత్తెనపల్లి పట్టణానికి కోత్త అందాలు తెచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా జరగని అభివ ద్ధి సత్తెనపల్లి పట్టణంలో చేయడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు వెనుకబడిన సత్తెనపల్లి నియోజకవర్గం వైపు నేడు జరిగిన అభివ ద్ధితో ప్రపంచం మొత్తం సత్తెనపల్లి వైపు చూస్తుందన్నారు. 100శాతం సిమెంట్ రోడ్లు వేయడం జరిగిందన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులు, మహిళల అభివ ద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణంలోని పేదలకు 640ఇళ్లు నిర్మించడం జరుగుతుందన్నారు. నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబు పరిపాలనా దక్షితతో అభివ ద్ధి సంక్షేమంలో దూసుకుపోతుందన్నారు. కోటి 47లక్షల కుటుంబాలకు రేషన్ అందించడం జరుగుతుందన్నారు.పేద యువతుల వివాహనికి ఆర్థికంగా చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. మీరు ఒక్కరోజూ వేసే ఓటు 18వందల రోజులు మీకు పనులు చేయడం జరుగుతుందన్నారు. పక్క రాష్ట్ర సీఎం మాట్లాడే బాష అభ్యంతకరంగా ఉందన్నారు. అలాంటి వారికి బుద్ధి చెప్పాలంటే ఈ సీఎంని మళ్లీ మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో కష్టపడే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలన్నారు. ప్రభుత్వం అభివద్ధి కోసం కషి చేస్తుంటే, ప్రతిపక్షాలు అరాచకాల కోసం చూస్తున్నాయన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 37స్వయం సహయక సంఘాలకు కోటి 65లక్షల విలువచేసే చెక్కులను స్పీకర్ అందజేశారు.



ఎపి ఆర్థికంగా ముందడుగు



- సమర్థవంతమైన నాయకత్వం కావాలి
- 2029 నాటికి దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా ఏపి
- నూతన అధ్యాయానికి శ్రీకారం
- ఏపీలో కుట్ర రాజకీయాలు చేస్తున్నారు
- శ్వేతపత్రం విడుదలచేసిన ప్రభుత్వం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి):ఎపి రాష్ట్ర విభజనానంతరం ఎదురైన ఆర్థిక, సామాజిక ప్రతికూలతలను అధిగమించి అనేక కష్టనష్టాలకు ఎదురొడ్డి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అభివద్ధిపథంలోకి తీసుకొచ్చామని రాష్ట్ర ప్రభుత్వం శ్వేతప్రంలో ప్రకటించింది.విభజనతో భారీ రుణాలు, తీవ్రమైన రెవెన్యూ లోటును ఇచ్చినా పరిమిత వనరులతో అద్భుత ఫలితాలను సాధించామని పేర్కొంది. ఇప్పటికే రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 11.22 శాతం వద్ధిరేటు సాధించామని, 2022 నాటికే ఆంధ్రప్రదేశ్ సుస్థిర లక్ష్యాలను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేసింది. ఈ మేరకు ఆర్థికరంగంపై శ్వేతప్రం విడుదల చేసింది. తక్కువ వడ్డీకి రుణాల సమీకరణ, రుణాల వునర్వ్యవస్థీకరణతో ఆర్థిక ఆటంకాలను అధిగమిస్తున్నామని పేర్కొంది.

ఎపికి వ్యవసాయమే జీవనాడి:విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపైనే ఆధారపడింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ రంగం వాటా 2013-14లో 23 శాతంగా ఉంటే విభజన సమయంలో ఇది 30.2 శాతంగా ఉంది. 2017-18నాటికి 34.4 శాతానికి చేరింది. ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటా 34.4 శాతంగా ఉంది. పారిశ్రామిక రంగం వాటా 22.1%, సేవలం రంగం 43.5%గా ఉంది. గత నాలుగేళ్లలో రుతుపవనాలు అనుకూలంగా లేనప్పటికీ.. జాతీయ సగటు వ ద్ధి 2.4 శాతం ఉండగా నవ్యాంధ్ర వ్యవసాయం, అనుబంధ రంగాల్లో సగటు వద్ధిరేటు 11 శాతంగా కనిపిస్తోంది. ప్రస్తుత ధరల్లో వ్యవసాయ, అనుబంధ రంగాల ఆదాయ వద్ధి 2013-14లో రూ.1.28 లక్షల కోట్ల నుంచి 2017-18 నాటికి 2.53 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక రంగంలో ఆదాయ వ ద్ధి 2013-14లో రూ.1.07 లక్షల కోట్ల నుంచి 2017-18లో రూ.1.62 లక్షల కోట్లకు, సర్వీసు రంగంలో 2013-14లో 1.90 లక్షల కోట్ల నుంచి 2017-18 నాటికి రూ.3.20 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది.

సంస్కరణలతో విజయాలు:నవ్యాంధ్రలో విభజన సమస్యలను అధిగమించ డంతోపాటు అనేక సంస్కరణలను తీసుకురావడంతో ఎన్నో విజయాలు వరించాయి. ట్రెజరీల పనితీరులో మార్పు వల్ల ప్రజలు, వినియోగదారులు వాటిని సందర్శించాల్సిన అవసరం లేకుండాపోయింది. రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు 10వ వేతన సవరణ సంఘం 29 శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేయగా 2015 సవరించిన వేతన స్కేలులో వేతన నిర్ణయం కోసం మూలవేతనంలో 43 శాతం ఫిట్‌మెంట్‌ను అనుమతించారు. 29వేల ఖాళీ ఉద్యోగాల భర్తీకి అనుమతిచ్చారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పారితోషికాన్ని భారీగా పెంచారు.

తెలంగాణ కంటే మెరుగ్గా:ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జనాభాను 58.32: 41.68 నిష్పత్తిలో విభజించారు. అయితే జీఎస్‌డీపీ వాటా 50.7:49.3 దామాషాలో ఉంది. రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వ్యత్యాసం రూ.12,692 కోట్లు (1.4 శాతం). గత నాలుగేళ్లలో ప్రస్తుత ధరలలో సగటు వద్ధిరేటు 14.72 శాతంతో ఆంధ్రప్రదేశ్ స్థిరమైన పనితీరు కారణంగా 2017-18లో జీఎస్‌డీపీ వాటా 52.3:47.7 దామాషాలో ఉంది. స్థాపిత రాజధాని, ఉపాధికల్పన, ఆదాయ సమీకరణ , హైదరాబాద్ వంటి ప్రయోజనాలను కోల్పోయినా.. తెలంగాణ కంటే అధిక వద్ధిరేటును సాధించాం.

కేంద్రం సహాయ నిరాకరణ:విభజన హామీల అమలుకు కేంద్రం ఏమాత్రం ఆసక్తిచూపడం లేదు. ప్రతికూలతలు ఉన్నా, సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని సవాళ్లను అధిగమించాం. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఏడు మిషన్‌లు, ఐదు గ్రిడ్‌లు, 5 ప్రచారాలు చేపట్టాం. ప్రతి రంగం కింద వెలికితీయని వనరులను గుర్తించి ఉపయోగించుకున్నాం. 2014-15లో జీఎస్‌డీపీ వ ద్ధిరేటు 9.2 శాతం ఉంటే 2017-18 నాటికి 11.22 శాతం సాధించాం. గత నాలుగేళ్లలో అఖిల భారత సగటు వ ద్ధిరేటు 7.3 శాతం, తెలంగాణ సగటు వద్ధి 9.7 శాతం, నవ్యాంధ్ర 10.52 శాతం సగటు వద్ధిని సాధించింది. ఆదాయ వద్ధి నాలుగేళ్లలో నికర పెరుగుదల రూ.3.4 లక్షల కోట్లు.

వాస్తవ రెవెన్యూలోటు రూ.20,582 కోట్లు:ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాలకు 14వ ఆర్థిక సంఘం రెవెన్యూలోటు గ్రాంటును సిఫారసు చేసింది. నవ్యాంధ్రకు రూ.22,113 కోట్ల మొత్తం(11.53 శాతం) గ్రాంటు రూపంలో ఇచ్చారు. వాస్తవికంగా ఇంకా రూ.20,582 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 2015-16లో రూ.13,911 కోట్లు, 2016-17లో రూ. 22,161 కోట్లుగా ఉన్న లోటు 2017-18లో రూ.20,582 కోట్లుగా ఉంది. కేంద్రం నుంచి గ్రాంటు అందాక కూడా ఈ లోటు కొనసాగుతోంది. రాష్ట్రం తన రెవెన్యూ రాబడులు, జీఎస్‌డీపీ, మూలధన వ్యయాన్ని పెంచుకోగలిగినప్పటికీ కొత్తగా ఏర్పాటైన రాష్ట్రానికి చాలా నిధులు అవసరమవుతాయి. ఇందుకోసం తన ఆర్థిక వనరులను పెంచుకోవలసి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోవడం వల్ల రెవెన్యూ, ద్రవ్యలోటు పెరిగింది.



కుప్పం ఇంజనీరింగ్ కళాశాల హెలిపాడ్ వద్ద 6వ విడత జన్మ భూమి - మాఊరు కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెకర్ పి.ఎస్.ప్రద్యుమ్న, ప్రజాప్రతినిధులు కుప్పం సూర్య ప్రధాన ప్రతినిధి:

అనంతపురంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి కాలవ



అనంతవురం, సూర్య ప్రతినిధి : అనంతవురంలో 6వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా రాయదుర్గం పట్టణంలో వార్డు సభల్లో మంత్రి కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదు విడతల్లో వచ్చిన వినతుల్లో 90శాతం పరిష్కరించాం, రేషన్ కార్డులు, ఫించన్లు, ఇళ్లు వంటి సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలన్నీ ఈ విడతలో పరిష్కరిస్తాం, సమస్యల పరిష్కార వేదికగా జన్మభూమి - మా ఊరు కార్యక్రమం నిలుస్తుందన్నారు. గత నాలుగేళ్లలో రాయదుర్గం నియోజకవర్గంలో రూ.4,000 కోట్లతో అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2024 నాటికి నియోజకవర్గంలో లక్ష ఎకరాకలకు సాగునీటిని అందించాలన్నదే లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం సవతితల్లి ప్రేమను చూపిస్తోంది, విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. కేంద్రం ఆదుకోకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు.

తెలంగాణ కన్నా ఏపీ వృద్ధిరేటు అధికం

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) :రాష్ట్రంలో ఆర్థిక వనరులు, ఆర్థికాభివృద్ధిపై నాలుగున్నరేళ్లుగా జరిగిన అభివద్ధిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన ఇంతవరకు జరగలేదని, ఏపీని కేంద్రం అణగదొక్కడానికి ప్రయత్నించడమే దుర్మార్గమని ఆయన విమర్శించారు. ఏపీలో 10.52 శాతం వద్ధిరేటు ఉంటే, తెలంగాణలో 9.7 శాతమే ఉందని ఆయన వివరించారు. నాలుగేళ్లలో వ్యవసాయం, అనుబంధ రంగాల వద్ధి రెట్టింపు అయిందని చంద్రబాబు తెలిపారు. ఏపీలో కుట్రరాజకీయాలు చేస్తున్నారని, ఏపీలో బలహీనమైన ప్రభుత్వం ఉంటే వాళ్లు పనిచేయకపోయినా గొప్పగా చెప్పుకోవచ్చని అనుకుంటున్నారని చంద్రబాబు ఆరోపించారు. వాళ్లు చెప్పినట్టు వినే ప్రభుత్వం రావాలని భావిస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. విభజనానంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర వునర్ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించడం వల్ల ఏర్పడిన సవాళ్ళను రాష్ట్రం ఎదుర్కోవడమే కాకుండా 2014, ఆంధ్రప్రదేశ్ వునర్ వ్యవస్థీకరణ చట్టంలోని చట్టబద్ధత నిబంధనలను, ప్రత్యేక హోదాను, హామీలను అమలుపరచడంలో కేంద్ర ప్రభుత్వం ఆసక్తిని కూడా చూపడంలేదన్నారు. గత నాలుగు సంవత్సరాలలో అఖిల భారత సగటు వృద్ధి 7.3 శాతం, తెలంగాణా సగటు వృద్ధి 9.7 శాతం కాగా 10.52 శాతం (స్థిర ధరలలో) సగటు వృద్ధిని నమోదు చేసిన ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఆర్థిక నిర్వహణదారుగా నిలిచిందన్నారు. విభజన సమయంలో ఎపి, తెలంగాణా మధ్య జనాభాను 58.32 : 41.68 నిష్పత్తిలో విభజించడమైందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయ స్వభావం కలిగి వుందన్నారు. 201314 కాలంలో ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగం వాటా 23 శాతంగా వుండే, విభజన సమయంలో ఇది 30.2 శాతం వరకు 201718 (ఎఇ) కాలంలో మరింత పెరిగి 34.4 శాతానికి చేరిందన్నారు. భౌగోళికంగా రాష్ట్రంలో కరువులు, తుఫాను తాకిడి చాలా అధికం. మొత్తం 13 జిల్లాలలో 5 జిల్లాలు వుంటే అనంతవురం, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాలు దీర్ఘకాలికంగా కరువు ప్రభావిత జిల్లాలుగా వుందన్నారు. పారిశ్రామికరంగ ఆర్థిక వ్యవస్థ 201314 సంవత్సరంలో 1.07 లక్ష కోట్ల నుండి ప్రస్తుత ధరలతో 201719 (ఎఇ) సంవత్సరంలో రూ. 1.62 లక్ష కోట్లకు గణనీయంగా పెరిగిందన్నారు. సర్వీసు రంగ ఆర్థిక వ్యవస్థ 201314 సంవత్సరంలో రూ. 1.90 లక్ష కోట్ల నుండి ప్రస్తుత ధరలతో 201718 (ఎఇ) సంవత్సరంలో రూ. 3.20 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగిందన్నారు. 201415 సంవత్సరంలో జాతీయ తలసరి ఆదాయంకంటే ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం 8.4 శాతం ఎక్కువ అని అన్నారు. గత నాలుగు సంవత్సరాల్లో దేశంలో అత్యధిక సగటు పిసిసి వృద్ధి (14.4 శాతం) వున్నప్పటికీ, రూ. 1.42 లక్షల తలసరి ఆదాయంతో ఆంధ్రప్రదేశ్ ఇతర దక్షిణ భారతీయ రాష్ట్రాలలో వెనుకబడి వుందన్నారు. స్వయం సహాయక బృందాలకు



ఆర్థిక సహాయం కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడమైందన్నారు. యుఎన్ నిర్దిష్టపరిచిన 2030 కాలవ్యవధి కంటే ముందుగానే 2022 నాటికి ఎస్.డి.జి మైలురాళ్ళన సాధించడానికి గ్రామీణ మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, హరిత ఆర్థిక వ్యవస్థ దార్శనికత, ఉపాధిని కల్పించడానికి పెట్టుబడిదారులతో విశ్వాసాన్ని పెంపొందించడం, నైవుణ్యం, ఆవిష్కరణల విషయంలో పర్యావరణ వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా పోటీపడే నగరాలు, మౌలిక సదుపాయాల ఏర్పాటు చేయడం, రియల్ టైం గవర్నెన్స్ కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వంటి వాటికి ఒక కార్యాచరణను రూపొందించి 2022 నాటికి దేశంలోని మూడు అత్యుత్తమ రాష్ట్రాలలో ఒకటి గాను, 2029 నాటికి దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దే వ్యూహంలో చేర్చడమైందన్నారు.

వైశ్యాబ్యాంక్‌లో కరెంట్ ఎకౌంట్ల స్తంభన

మేనేజర్ తీరుపై ఖాతాదార్ల ఆందోళన

రూ. కోట్లలో నిలిచిపోయిన లావాదేవీలు

అమరావతి, సూర్య బ్యూరో : ప్రధాని నరేంద్రమోదీ జీరో బ్యాలెన్స్‌తో బ్యాంక్ ఖాతాలు ప్రారంభిస్తున్న తరుణంలో సత్యనారాయణవురం వైశ్యాబ్యాంక్ అధికారులు, సిబ్బంది దశాబ్దాల తరబడి కొనసాగుతున్న కరెంట్ ఎకౌంట్ ఖాతాదారులను వేధిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల కొద్దిరోజులుగా కోట్ల రూపాయల్లో ఇక్కడ ఆర్థిక లావాదేవీలు స్తంభించాయని ఖాతాదారులు వాపోతున్నారు. సాధారణంగా ఈ బ్యాంక్‌లో చెక్‌బుక్ కోసం రూ. 5 వేలు, కరెంటు ఎకౌంట్‌కు రూ. 10 వేలు నగదు నిల్వ వుంచితే చాలు. గత మేనేజర్లు ఆ ప్రాంతంలోని చిరువ్యాపారులు అందరిచేత కరెంటు ఎకౌంట్లు ప్రారంభింపజేశారు. అయితే ప్రస్తుత మేనేజర్ ఆయా ఎకౌంట్లలో వున్న కోట్లాది రూపాయల లావాదేవీలు జరక్కుండా స్తంభింపజేశారు. అదేమని బాధితులు వెళ్ళి అడుగుతుంటే కరెంటు ఎకౌంట్ అంటే వ్యాపారం ఏమిటి, దానికి బోర్డు, ఇంటి అడ్రస్ కావాలని, అన్నింటికీ మించి కార్మిక శాఖ కార్యాలయం అనుమతి తేవాలని, దానిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈఎస్ఐ, పీఎఫ్, ఆపై జీఎస్టీ అనుమతి పత్రాలు వుంటేనే మీ డబ్బులు రిలీజ్ చేస్తామని అంటున్నారు. అయితే దీనిపై బ్యాంక్ అధికారుల సంఘం నాయకులు మాత్రం కొత్త ఎకౌంట్లకే నిబంధనలు వున్నాయి తప్ప పాత ఎకౌంట్లను స్తంభింపచేసే అధికారం మేనేజర్‌కు లేదని స్పష్టం చేస్తున్నారు. దీనిపై సత్యనారాయణవురానికి చెందిన ఖాతాదారులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

విజయవాడలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం



విజయవాడ, సూర్య బ్యూరో : జన్మభూమి-మా ఊరు కార్యక్రమాని 42వ డివిజన్ జింఖానా (గ్రౌండ్స్) నందు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన అందించాలనే లక్ష్యంగా ఈ జన్మభూమి మా ఊరు కార్యక్రమాని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, అర్హులైన ప్రతి వారికి సంక్షేమ పథకాలను ఎటువంటి అవి నీతికి ఆసకారం లేకుండా అమలు చేస్తున్నామని, విభజన తరువాతలో-బడ్జెట్ రాష్ట్రంలో సమర్థుడైన ముఖ్యమంత్రిగా వుంటే ప్రజలకు ఏలాంటి సంక్షేమం జరుగుతుందో ప్రజలే చూస్తున్నారని, ఈరోజునా సంతోషాన్ని, సంతప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు, అంత ముందు అధికారులు సంక్షేమ పథకాలు ఏ విధంగా అప్లే చేసుకోవాలో వివరించారు నూతనంగా మంజురైన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు, విద్యార్థులకు కులదవీకరణ సర్టిఫికేట్‌లు, సంక్రాంతి కాను కలు అందచేసారు. ఇటీవలే మరణించిన మల్లిరెడ్డి భార్యకు చంద్రన్నభీమా ద్వారా 2లక్షలరూపాయలు ఎమ్మెల్యే బొండా ఉమా అందచేసారు. ఈ కార్యక్రమంలో నగర డివ్యూటీ మే యర్ గోగుల రమణా రావు, కార్పొరేటర్ ముప్పా వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, (ఈ.ఈ) శ్రీధరన్ (జోనల్ కమీషనర్), సివిల్ సప్లైయస్ ఎ.యస్.ఓ రామరావు, రెవిన్యూ అధికారులు, నగరపాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులు జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ జీవన పత్రం సమర్పించాలి

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :జనవరి 1వ తేదీ, 2019 నుంచి ఫించనుదారులు తప్పనిసరిగా జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా డిజిటల్ జీవన ప్రం (లైఫ్ సర్టిఫికేట్) సమర్పించాలని ప్రభుత్వ కార్యదర్శి పియూష్ కుమార్ సర్కులర్ మెమో జారీచేశారు. అందుబాటులో ఉన్న ఇంటర్ నెట్ కేంద్రాలు, మీసేవా కేంద్రాలు, ఫెన్షనర్ సర్వీస్ అసోసియేషన్స్, గుర్తింపు పొందిన వారి వద్ద నుంచి ఫించనుదారులు డిజిటల్ జీవన పత్రం సమర్పించవచ్చు. ఈ సేవలు ఉపయోగించుకున్నందుకు ఫించనుదారులే కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. సబ్ ట్రెజరీలు, డిస్ట్రిక్ ట్రెజరీల్లో కూడా ఫించనుదారులు డిజిటల్ జీవన పత్రాలు సమర్పించవచ్చు. వేలి ముద్రలు పడనివారు ఐరిష్ స్కానర్ల ద్వారా జీవన పత్రం సమర్పించవచ్చు. వేలి ముద్రలు పడకపోవడం, ఐరిష్ కూడా అందుబాటులో లేకపోతే అలాంటి వారి నుంచి భౌతికంగా జీవన పత్రం తీసుకుంటారు. అలాంటి వారు, సబ్ ట్రెజరీ, ఫించను తీసుకునే బ్యాంకు పరిధిలోని గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన పత్రం సమర్పించాలి. వేలిముద్రలు పడనివారు నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీవో, ఏటీవోలు పరిశీలించిన అనంతరం భౌతిక జీవన పత్రం సమర్పించవచ్చు. కదలలేని పరిస్థితుల్లో ఉన్న ఫించనుదారులు ఎక్కడ ఉంటే అక్కడ నుంచే డిజిటల్, సాధ్యకాని పక్షంలో భౌతిక జీవన పత్రం ఇస్తారు.

అలా జారీ చేసిన పత్రాన్ని రిజిస్టర్ పోస్టులో సబ్ ట్రెజరీ అధికారికి పంపాల్సి ఉంటుంది. ఆ పత్రం ఎస్ టీ వోకు అందాక, వారు వీడియో కాలింగ్ ద్వారా ఫించనుదారుని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. విదేశాల్లో నివశిస్తున్న ఫించనుదారులు అటార్నీ లేదా వారి ప్రతినిధులకు భౌతిక జీవన పత్రం ఇవ్వాలి. వారు మనదేశం వచ్చినవ్వుడు తప్పనిసరిగా ట్రెజరీ అధికారి ముందు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రతి సంవత్సరం ఫించనుదారులు డిజిటల్ లేదా భౌతికంగా జీవన పత్రం సమర్పించకపోతే వారు సమర్పించే వరకు ఫించను నిలిపివేస్తారు. వచ్చేఏడాది (2020) నుంచి జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే జీవన పత్రం ఇవ్వాల్సి ఉంటుందని సర్కులర్ మెమోలో పేర్కొన్నారు.

వెంకటాచలంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి



వెంకటాచలం, సూర్య ప్రతినిధి : వెంకటాచలం మండలం కంటేపల్లిలో 6వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే మంత్రి సోమిరెడ్డి ఆదేశాలిచ్చారు. 61 మంది పేదలకు పట్టాలు పంపిణీ, మరింత మంది పేదలకు పట్టాల పంపిణీకి ఆదేశాలిచ్చారు. రైతులకు మోటార్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ రూర్బన్ ప్రాజెక్టుతో వెంకటాచలం మండలం రూపురేఖలు మార్చామన్నారు. ఒక్క కంటేపల్లిలోనే రూ.8కోట్లతో అభివద్ధి పనులు చేపట్టామన్నారు. సీజేఎఫ్‌ఎస్ భూములకు సంబంధించి లబ్ధిదారులకు పట్టాలు ఇస్తూ జిల్లాలో 7 వేల కోట్ల విలువైన ఆస్తికి యజమానులను చేస్తున్నామన్నారు. వెంకటాచలం మండలంలో 900 ఎకరాలు సీజేఎఫ్‌ఎస్, 800 ఎకరాల అనాధీన భూమి ఉంది. మొత్తం 1700 ఎకరాలపై పేదలకు భూయాజమాన్య హక్కులు కల్పించబోతున్నామన్నారు. వీధిలైట్ల సమస్య పరిష్కారానికి ప్రతి స్తంభానికి ఎల్‌ఈడీ బల్బు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో పరిస్థితి ఏంటి, ఇవ్వుడు మేం చేసిన అభివద్ధి ఏంటో ఏ గ్రామంలోనైనా చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చేసిన అభివద్ధిని ప్రజల్లో ధైర్యం చెవ్వుకునే అవకాశాన్ని ప్రతి కార్యకర్తకు చంద్రబాబు నాయుడు ఇచ్చారన్నారు. తెలంగాణ కంటే అభివద్ధి, సంక్షేమం ఎక్కువ చేశామన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో దశాబ్దాలుగా హామీలకే పరిమితమైన సాగునీటి ప్రాజెక్టులను సాకారం చేస్తున్నామన్నారు. మంత్రులుగా, జెడ్పీచైర్మన్‌గా, ఎమ్మెల్యేలుగా ఉన్న వారు ఏం చేశారన్నారు. చరిత్రలో లేని విధంగా అభివద్ధి చేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న మాకే ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయన్నారు.

అనంతగిరి 6వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో మంత్రి కిడారి

విశాఖపట్నం, సూర్య ప్రతినిధి : అనంతగిరి మండలం టోకూరు పంచాయతీలో జరిగిన 6వ విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో గిరిజన సంక్షేమ, ప్రాథమిక ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని మా నాన్న ఆశయం, వారి ఆశయా సాధనకు నేను కషి చేస్తానన్నారు. చిన్న వయస్సులో ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చింది, అందరికి న్యాయం చేస్తానన్నారు. గిరిజన గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా న్యాయం చేసిందన్నారు. ఇటువంటి ప్రభుత్వం మరలా అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ సహకరించాలన్నారు. బగామరవలస గ్రామానికి రూ.7.5 లక్షలతో రక్షిత మంచినీటి పథకం మంజూరు. బొర్రా జంక్షన్ లో యాత్రికుల కోసం సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రిని కోరారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని రహదారులను అభివద్ధి చేస్తున్నామన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు స్థలం ఇస్తామని హామీ చేశారు. జన్మభూమిలో 700 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. గిరిజన ప్రాంతాల్లో కూడా అన్ని గ్రామాల్లో కరెంటు



సరఫరా చేస్తున్నామన్నారు. చంద్రన్నభీమా గొప్ప పతకమన్నారు. వెలుగు సిబ్బంది సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దష్టికి తీసుకెళ్లానన్నారు. వెలుగు ఉద్యోగులకు అన్ని విధాలుగా సిఎం అండగా ఉంటామన్నారు. ప్రాధాన్యత వారిగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ఒక్కో గిరిజన కుటుంబానికి చలిని తట్టుకునేందుకుగాను రెండు రగ్గులు పంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు

(వెలగపూడి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :ఆయా శాఖలు, అధికారులు, సమన్వయంతో పనిచేయడం వల్ల ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడమే కాకుండా, ప్రజల మన్ననలు కూడా పొందుతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర వునేఠ అన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో పలు శాఖల ముఖ్యకార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. గత నెల 29న జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పలు శాఖలు మరింత పనితీరు మెరుగుపర్చుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించిన విషయాన్ని సీఎస్ గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ప్రజల సంత ప్తి స్థాయి 90 శాతం దాటాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం



81 శాతంగా నమోదైందని, పౌర సరఫరా శాఖాధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ సీఎం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో స్కిల్ డవలప్ మెంట్ ద్వారా తీసుకుంటున్న చర్యలను సంబంధిత అధికారులను సీఎస్ అడిగి తెలుసుకున్నారు. విద్య, పరిశ్రమల శాఖలతో ప్రతి 15 రోజులకొకసారి సమావేశమవుతూ, పరిశ్రమల అవసరాలరీత్యా విద్యార్థుల్లో స్కిల్ డవలప్ మెంట్ పెంవుదలకు క షి చేయాలన్నారు. తాగునీటి పంపిణీపై పగడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎస్ అనిల్ చంద్ర వునేఠ ఆదేశించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ప్రగతి ఎంత వరకూ వచ్చిందని సీఎస్ ప్రశ్నించారు. ప్రతి వారమూ మున్సిపల్, జలవనరుల శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించుకుంటూ తాగునీటి పంపిణీలో అడ్డంకులను ఎప్పటికవ్వుడు అధిగమించాలన్నారు.ప్రస్తుతం జరుగుతున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని విజయవంతానికి కషి చేయాలన్నారు. ఇతర శాఖలతోనూ ఎప్పటికవ్వుడు సమీక్షలు, సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాయుతంగా పనిచేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు వంద శాతం మేర విజయవంతమవుతాయన్నారు.ఈ సమీక్షలో ముఖ్య కార్యదర్శులు నీరబ్ కుమార్ ప్రసాద్, రవిచంద్ర, అజయ్

నాయకులకు, కార్యకర్తలకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపిన పవన్



విజయవాడ, సూర్య బ్యూరో : నూతన సంవత్సరంలో జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్ ఎన్నికల నగారా మోగించారు. అమరావతి రాజధాని కేంద్రంగా ఉన్న విజయవాడ నుంచే ఈ యేడాదిలో రానున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి నాంది పలుకుతున్నట్లు ఆయన తెలిపారు. బంగారు ఆంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా జనసేన ముందుకు సాగుతుందని తెలిపారు. అవినీతిరహిత పాలన కోసం ప్రతి ఒక్కరు కూడా జనసేనకు సహకరించాలని కోరారు. జన సైనికులు ఇక నుంచి ప్రజల మధ్యలోనే వుండి పార్టీ అజెండాను విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ జిల్లా జాయింట్ కో ఆర్డినేటర్ పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ పవనిజం బాటలో ప్రజల సంక్షేమం కోసం, పార్టీ అభివద్ధికి కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పార్టీ నాయకులు రావెల కిషోర్‌బాబు, పార్టీ ముఖ్యులలో ఒకరైన హరిప్రసాద్ తదితరులు ఆయనను కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ తలాక్‌పై చర్చ జరగాలి:నాగుల్‌మీరా

విజయవాడ, సూర్య బ్యూరో : ట్రివుల్ తలాక్ మీద సమాజానికి అవగహన లేదని, దీనిపై సమాజానికి అవగహన లేదని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.నాగుల్‌మీరా అన్నారు. బుధవారం కష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగుల్‌మీరా మాట్లాడుతూ రాష్ట్రంలో దూదేకుల ముస్లింలు బాగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. దుదేకుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.40 కోట్లు నిదులు మంజూరు చేశారని, ఆ సామాజిక వర్గం అంతా చంద్రబాబు నాయుడుకు అండగా ఉంటారని పేర్కొన్నారు. రాజకీయ రంగాలలో కూడా అవకాశం కల్పించారని, మైనారిటీ వర్గాలను అందరిని సంతోషపెట్టారని తెలిపారు. సంక్షేమంలో రూ.11 వందల కోట్లు మంజూరు చేశారని అన్నారు. ట్రివుల్ తలాక్‌పై చర్చ జరుగుతుందని, దీనిపై కొంతమందికి అవగహన లేదన్నారు. ట్రివుల్ తలాక్ మీద సమాజానికి అవగహన లేదన్నారు. ఈ రోజు ట్రివుల్ తలాక్ చేబితే మూడు నెలలో మూడు సార్లు చెప్పి ఉండాలన్నారు. ఈ మూడు నెలలు కలసి ఉన్న ఎటువంటి మార్పులు రాకపోతే భార్య భర్తలు విడిపోవడం జరుగుతుందన్నారు. మూడు సార్లు చెప్పి మహిళలను చిన్నచూవు చూస్తున్నారని తెలిపారు. బిజెపి ముస్లింలను చిన్న చూవు చూస్తుందన్నారు. ట్రివుల్ తలాక్‌పై చర్చ జరగాలి.. వచ్చే ఎన్నికల్లో ప్రదానమంత్రిని ఏవరు అనే విషయంలో చంద్రబాబు నాయుడు ప్త్రా ఉంటుందని నాగుల్‌మీరా పేర్కొన్నారు.



రాజకీయ పార్టీలా? కార్పొరేట్ కంపెనీలా?





భారతదేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదని, అంతా పారదర్శకంగా జరుగుతోందని మనం చెప్పకుంటాం. కాని ఈ దేశంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన రాజకీయ పార్టీలే తాము జనం గురించి పనిచేసే కీలక రాజ్యాంగ వ్యవస్థ లో ఉన్న విషయాన్ని మరచి, అధినేతలంతా పార్టీలని తమ తమ కార్పొరేట్ సంస్థలుగా, వాటికి తాము సిఇఓలుగా భావిస్తున్నారు. ఈ క్రమంలోనే మన దేశంలో రాజకీయాలను విదేశీ నిధులతో కూడా శాసించే పరిస్థితి కొనసాగింపే కాదు. ఆయా కంపెనీలు రాజకీయ పార్టీలకు కోట్లాది రూపాయల నిధులు విరాళాల రూపంలో ఇస్తే కూడా ఎవరూ ప్రశ్నంచకూడదన్న తీరుగా వ్యవహరిస్తున్నారు. ఇలా వచ్చిన నిధులతో కార్పొరేట్ కంపెనీలను మించి తమ ప్రచారాలను జనం ముందుకు తీసుకుపోయేందుకు సామాజిక మీడియాను వేదిక చేసుకోవటంతో పాటు వీటిని నిర్వహించేందుకు నెలవారీగా లక్షలలో చెల్లింపులు చేస్తున్నాయి. తమకు ఎక్కడి నుంచి నిధులు వస్తున్నాయో చెప్పనవసరం లేదన్న తీరుగా వ్యవహరించడం ఇందుకు అన్ని పార్టీలు వంత పాడటం ప్రజాస్వామ్యానికి ముప్పే.

లాభం లేనిదే వ్యాపారి వరదన పోడు అన్న సామెత తెలిసిందే ! మన దేశంలో పాలకవర్గమూ అలాగే తయారంది. వారికి యుద్ధమూ లాభమే, పోరు నిలిపి వేతా లబ్ది చేకూర్చేదే, విపక్ష విమర్శలను కూడా తమకు అనుకూలంగా మార్చేసు కుంటారు. అవసరమైనా అదే విపక్షంతో తమదైన మేళవింపులు చేసి, సభలలో గందరగోళం సృష్టించుకుని, సభావాయిదాల నడుమ తమకు అనుకూల చట్టాలను ఆమోదింప చేసుకుం టారు. అంటే దేనికైనా సిద్ధపడతాయిమన రాజకీయ పార్టీలు అన్నది సుస్పష్టం. నిజానికి కార్పొరేట్ పాలన అంటే, ఉత్తమ వ్యాపారం, ప్రమాణాత్మకత్వం, బాధ్యత మరియు సమగ్రతతో యాజమాన్య కార్యకలాపాలను నిర్దేశించించడం మరియు నియంత్రించడం ద్వారా వాటా దారులు మరియు ఇతర మధ్యవర్తుల అవసరాలను తీర్చే విధానాలు, ప్రక్రియలు మరియు ప్రజలు కలిగి ఉన్న ఒక అంతర్గత వ్యవస్థ కానీ రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను పక్కకు పెట్టి కార్పొరేట్ సంస్థలలా ఎదుగుతున్నట్టు కనిపిస్తోంది. ఈ పార్టీలు తమకు అనుగుణంగా ఉన్న నిబంధనలను అన్వయించేసుకుని మరీ చక్కగా అమలు చేసుకుంటాయి దీంతో రోజు రోజుకూ తాము చేసిన చట్టాల్ని, తాము ఏర్పర్చిన వ్యవస్థల్ని ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలే నీరు కారుస్తుండటం సర్వ సాధారణమైపోయింది. అంతా గుట్టుగా సాగిపోతుంది.

సామాజిక మీడియా వేదికగా

అంతెందుకు తెలంగాణలో టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పాటు కొత్తగా ఏర్పాటైన తెలంగాణ జనసమితి కూడా తమ ప్రచారానికి సోషల్ మీడియాను వేదికగా చేసుకునేందుకు ప్రచారం ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇందుకోసం సిబ్బందిని, వలంటీర్లను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టారు. కోదండరామ్ ఇటీవలే పెట్టిన కొత్త పార్టీని సామా జిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఐదు వేల మంది కార్యకర్తలు (వలంటీర్లు) కావాలని ఇటీవల జరిగన ముందస్తు ఎన్నికల నేపథ్యంలో ఫేస్‌బుక్, ట్విటర్ వేదికగా ప్రకటించారు. ఇక దేశంలో మిగిలిన రాజకీయ పక్షాలు సైతం సామాజిక మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటున్నాయి. నేరుగా పార్టీ అధినేతలే విపక్షాలపై తన సెటైర్ల పరంపర కురిపిస్తుంటారు.



ప్రత్యేక విభాగాలు

రాజకీయ పార్టీలు తమ సోషల్ మీడియా ఖాతాలను నేరుగా కార్యాలయం నుంచి నడిపిస్తుండగా... ప్రజాప్రతినిధులు, నేతలు విడిగా వారి నియోజకవర్గాల్లో వ్యక్తిగతంగా క్యాంపెయిన్ బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. వీరికితోడు రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న పలు వురు ఎన్నారైలు, నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న పలువురు నేతలు.. సోషల్ మీడియా క్యాంపెయిన్ కోసం పలు సంస్థల సేవలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు నెలకు రూ. లక్ష నుంచి రూ. 2.5 లక్షల వరకు చెల్లిస్తున్నారు. ఆయా పార్టీలను సందర్శించినప్పుడు అక్కడున్న కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరిజ్ఞనాన్ని చూస్తుంటే మనం రాజకీయ పార్టీ కార్యాలయానికి వచ్చామా? ఏదో కార్పొరేట్ సంస్థకి వచ్చామా? అన్న భావన సాగుతుంది. వీరు కాక వర్క్ ఫ్రం హోం పేరుతో మరికొందరు పనిచేస్తుండటం మనం గమనించదగ్గదే. గద్దెలో ఉన్న పెద్దల విద్యార్హతల గురించి సమాచారం ఇవ్వమని కోరినా ఆయా విశ్వవిద్యాలయాలు కోర్టులకు వెళ్లడం విడ్డూరం. అదేదో పెద్ద నేరంగా పరిగణించడం మరింత ఆశ్చర్య కరం. సమాచార కమిషన్కు కోరలు లేవు. మానవ హక్కుల కమిషన్‌కు కోరలు లేవు. ప్రశ్నల డిగిన వారిపై కోరలు చాచడమే నేడు అధికారం లో ఉన్న వారి పనిగా మారింది. పార్లమెంట్‌లో ప్రతిష్టంభన జరిగినంత మాత్రాన ఏదీ ప్రతి ష్టంబించినట్లు కాదు. గందరగోళం మధ్య తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు చట్టాలు చేసుకోవచ్చు. గందరగోళం లేని చోట్ల ప్రశాం తంగా వేల కోట్ల కుంభకోణాలకు పథకాలు రచించుకోవచ్చు.

రుణమాఫీ లబ్ది ఎవరికి?

గత 13 సంవత్సరాల్లో బ్యాంకులు లక్ష కోట్ల రుణాలను రద్దు చేశాయి. వాటిలో 95 శాతం భారీ రుణాలే. ప్రతి ఒక్కరూ వ్యవసాయ ఋణ మాఫీ గురించి మాట్లాడుతూ ఉంటారు. కానీ ఎన్పిఏలలో సగం వాటా మధ్య తరహా మరియు భారీ కంపెనీలదే అన్నది వాస్తవం. వ్యవ సాయ రుణాలు మాఫీ చేస్తే ప్రభుత్వాలు దాచి పెట్టుకోవు. టాం టాం వేసి చెప్పు కుంటా యి. దేశంలో 70 శాతం జనాభా వ్యవసాయం పైనే బతుకుతున్నారు కదా మరి. రైతుల రుణాలు మాఫీ చేసిన విషయం టాం టాం చేస్తే ఓట్లు రాలతాయి. అదే కార్పొరేట్ రుణా లు మాఫీ చేసినట్లు టాం టాం వేస్తే ఓట్లు మూడతాయి. అందువల్ల కార్పొరేట్ రుణాల మాఫీని రహస్య కార్పెట్ల కిందా, జాతీయ భద్రతా పరదాల వెనకా దాచి పెట్టి రైతు రుణాల మాఫీని డప్పు కొట్టి చాటుతారు. దానితో రుణాల మాఫీ జరిగేది కేవలం సన్నకారు రైతులకు మాత్రమేనని కార్పొరేట్లు బుద్ధిగా రుణాలు చెల్లిస్తూ ఉంటారని అమాయక జనం భ్రమిస్తూ ఉంటారు. కానీ వీటి ద్వారా లబ్ది పొందిన వారంతా ఆయా పార్టీలకు విరాళాలిస్తూ జైకొడతారు. ఎన్నికలలో తమకు అనుగుణంగా ఉన్న అభ్యర్థుల ఖర్చులకు పెట్టుబడులు పెడతారు.

విదేశీ విరాళాలు ఎంతో?

గతంలో లండన్‌కు చెందిన వేదాంత సంస్థ బిజెపి, కాంగ్రెస్ రెండు పార్టీలకూ భారీ ఎత్తున నిధులు అందజేసింది. దీనిపై ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఏడీఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు రెండు పార్టీలపై నేరా రోపణ చేసింది. అయితే 2017లో కూడా మోదీ ప్రభు త్వం ఆర్థిక బిల్లులో మరో రెండు కీలక మార్పులుచేసింది. దీని ప్రకారం కార్పొ రేట్లు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల పరిమితి లేదు. అంతే కాదు, తమ లాభ నష్టాల పట్టీలో ఏ పార్టీకి విరళాలు ఇచ్చామో కూడా చెప్పనవ సరం లేదు. ఇక ఏపార్టీ అయినా ఆగ మేఘాలపై భారీ భవంతులు కట్టుకోవడంలో ఆశ్చర్యం ఏమున్నది? 2016-17లో మొత్తం కార్పొరేట్ విరాళాల్లో 89 శాతం బిజెపికే దక్కాయని ఏడీఆర్ నివేదికలో వెల్లడైనందుకు కూడా ఆశ్చర్యపోనక్కర్లేదు. అంతే కాదు, తాజా సవరణతో కోర్టు విచార ణ నుంచి విముక్తి లభించినట్లయింది.



నిధుల సేకరణలో కమల వికాసం

కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ ఆదాయం అంతకంతకూ పెరుగుతున్నదని.. కేవలం ఏడాది కాలంలోనే ఆ పార్టీ ఆదాయం 81.18 శాతం పెరిగి రూ. 1,034.27 కోట్లకు చేరుకుంది. ఆదాయపరంగా బీజేపీనే ధనిక జాతీయ పార్టీగా ఉండగా.. కాంగ్రెస్ రాబడి మాత్రం 14.45 శాతం మేర తగ్గిందని.. అసోసి యేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్ (ఏడీఆర్) రిపోర్టును ఉటంకిస్తూ తెలిపింది. 2016-17లో అన్ని పార్టీల ఆదాయం రూ. 1,559.17 కోట్లయితే.. ఖర్చు రూ.1,228.26 కోట్లుగా ఉన్నది. 2015- 16లో రూ. 570.86 కోట్లుగా ఉన్న బీజేపీ ఆదాయం.. 2016- 17లో రూ. 463.41 కోట్లు పెరిగి రూ. 1,034.27 కోట్లకు చేరింది ఇక రూ. 261.56 కోట్లు ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆదాయం రూ. 225.36 కోట్లకు పడిపోయింది. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కా రును ప్రసన్నం చేసుకోవడానికి కార్పొరేట్లు కోట్లు కుమ్మరించడానికి సిద్ధమయ్యారని రిపోర్టు ధ్రువీకరిస్తున్నది. ఎలక్షన్ కమిషన్(ఈసీ) నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదిక రూపొందించినట్టు ఏడీఆర్ పేర్కొన్నది. ప్రధానంగా మూడు పద్ధతుల్లో (గ్రాంట్లు, డొనేషన్లు, కాంట్రిబ్యూషన్లు) పార్టీలకు ఆదాయం సమకూరుతున్నదన్నదీ స్పష్టమైంది. ఈ లెక్కన అన్ని పార్టీలు లెక్కలో లేని ఆదాయం ఏపాటిదో ఓరకంట చూస్తున్న జనం అందోళన చెందుతున్నారన్నది వాస్తవం. ప్రభుత్వం నుంచి లబ్ది పొందు తున్న పార్టీలు ప్రజలకు మాత్రం లెక్కలు చెప్పవట.

జనానికి తెలియనివ్వరా?

పార్టీల ఆదాయ వ్యయాలు జనంకి తెలియనీయకూడదన్న భావనలో అన్ని పార్టీలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గత ఏడాది మార్చి 13న లోక్ సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆర్థిక బిల్లులో మరో కీలక అంశాన్ని చేర్చారు 2010కి చెందిన విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం, భారతదేశంలో రాజకీయ పార్టీలకు విదేశీ నిధులు రాకుండా నిషేధించింది. కానీ. 1976 నుంచీ రాజకీయ పార్టీలు పొందుతున్న విదేశీ నిధులకు సంబంధించి ఎలాంటి ప్రశ్నలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు లోక్ సభ ఈ బిల్లులో భాగంగా చాలా నిశ్శబ్దంగా ఒక చట్టాన్ని సవరించింది.

స.హ. పరిధిలోకి రాబోమని మొరాయింపు

ప్రభుత్వం నుంచి గుర్తింపుతో పాటు ఏ మాత్రం అందుకున్నా ఆ సంస్థలన్నీ స.హ. చట్ట పరిధిలోనివే అని స.హ. చట్టం స్పష్టంగా చెపుతోంది. ప్రభుత్వం నుంచి భవనాల కోసం స్థలాలందుకున్నా అసలు స.హ. పరిధి తమకు వర్తించదని మొరాయిస్తున్నాయి. విదేశీ విరాళాల విషయంలోనే పారదర్శకంగా వ్యవహరించని రాజకీయ పార్టీలను సమాచార చట్టం పరిధిలోకి తీసుకువస్తామంటే ఎందుకు ఒప్పుకుంటాయి? బిజెపి, కాంగ్రెస్, ఎన్సిపి, బిఎస్పీ, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఆర్టీఐ పరిధిలోకి వస్తాయని 2013లోనే సమాచార కమిషన్ పూర్తి బెంచ్ తీర్పు చెప్పింది. దీని పై హైకోర్టు కానీ సుప్రీంకోర్టు కానీ తమ వ్యతిరేకతను వ్యక్తం చేయ లేదు. కాని ఏ రాజకీయ పార్టీ ఈ తీర్పును ఇంతవరకూ గౌరవించ లేదు. ఆర్టీఐ క్రింద వచ్చిన ఏ ప్రశ్నకైనా జవాబు చెప్పకుండా బుట్టదాఖలు చేస్తూ వచ్చాయి. మరోవైపు రాజకీయ పార్టీలపై సమాచార హక్కుకు సంబంధించి ఉన్న కేసులను ఆరు నెలల్లో తేల్చవలసింది గా ఢిల్లీ హైకోర్టు సమాచార కమిషన్‌ను ఆదేశించింది. దీంతో మళ్లీ స.హ. కమిషన్‌ని కొందరు ఆశ్రయించగా ముగ్గురు సభ్యుల బెంచ్ కమిషన్ ఏర్పాటు చేసింది. కానీ బెంచ్ తీర్పు వెలువరించే సమయానికి బిమల్ జుల్కా అనే సభ్యుడు వేరే ఆధికార పనులున్నందున బెంచి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రక టించారు. ఆపై మరో సభ్యుడిని బెంచ్‌లో నియమించే ఆసక్తి ప్రధా న కమిషనర్ మాథుర్ చూపించనే లేదంటే రాజకీయ వత్తిడి జరిగిందన్నది స.హ. కార్యకర్తలు భావన. పైగా మాడభూషి శ్రీధరాచార్య సారథ్యంలో బెంచిని రద్దు చేసి తన ఆధ్వర్యంలో నలుగురితో కూడిన మరో బెంచిని నియమించారు మాథుర్. రాజకీయ పార్టీలు ఆర్టీఐ పరిధి క్రిందకు వస్తాయని 2013లో కమిషన్ ఇచ్చిన ఉత్తర్వునే అమలు చేయలేని దుస్థితి ఒకటైతే, కమిటీ సభ్యులకు కూడా తెలియకుండానే బెంచ్‌లు రద్దు చేసేయటం చూస్తుంటే స.హ. కమిషన్ విశ్వసనీయత అన్ని కేంద్ర సంస్థలలానే దిగజార్చేసారన్నది వాస్తవం. సమాచార కమిషన్‌ను కేంద్రంలో ఎవరు శాసిస్తున్నారన్నది అప్రస్తుతం. కానీరాజకీయపార్టీలు సమాచార హక్కు పరిధి క్రిందకు వస్తే తమ గుట్టు రట్టవుతుందని అధికారంలో ఉన్న పార్టీతో పాటు విపక్ష పార్టీలు భయపడుతున్నట్టే కనిపిస్తోంది. ఆ క్రమంలోనే పరస్పరం సహకరిం చుకుని గందరగోళాల నడుమ ఆర్థిక బిల్లులో భాగంగా సవరించారు. ఒక టి కాదు, రెండు కాదు, 42 సంవత్సరాలుగా ఏ ఏ పార్టీ ఎంత మేరకు విదేశాల నుంచి నిధులు పొందిందీ ఎవరికీ చెప్పనక్కర్లేదన్నమాట. ఎక్కడి నుంచి అక్రమ నిధులు వచ్చినా ఎవరూ ప్రశ్నించే ఆస్కారం కూడా లేదు. లోక్ సభలో గందరగోళం మూలంగా ప్రభుత్వం ప్రవే శపెట్టిన 218 సవరణలను ఒకే వేటుతో సభ ఆమోదించింది. అందులో విదేశీ విరాళాలకు సంబంధించిన సవరణ ఒకటి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ కూడా దీనికి ఏ మాత్రం స్పందించలేదు. ఇద్దరూ కూడబలుక్కున్నట్లుగా అంతా జరుగుతుంటే ఎవరు మాత్రం ప్రశ్నిస్తారున్నది సహజంగానే సామాన్య జనంలో ప్రశ్న తయారవుతోంది. అలాగే నల్లధనాన్ని అరికడతానని భీషణ ప్రతిజ్ఞ చేసిన నరేంద్రమోదీ తమ పార్టీలకు వచ్చిన నల్లధనాన్ని గురించే నోట్లరద్దంటూ గొప్పాలు కొడుతున్నారు. జిఎస్టీలో సాధా రణ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనంటారు. కానీ కార్పొరేట్ కంపెనీల తరహాలో తమ వ్యవహారాలను బైటకు చెప్పంఏదుకు, పారదర్శకతగా నిలచేందుకు వెరుఎవరెం త నిలదీసినా, జవాబే కరువు. మాకు నచ్చినట్టు చేసుకుంటాం అంటూ చట్టాలపై కనీస చర్చ లేకుండా వరుస వాయిదాల సభలో తెరవెనుక ఆమోదాలు జరిపేసుకుంటుందంటే ఎవరేమి చేయగలరు?



– సత్యగోపాల్, హైదరాబాద్



ఒత్తిడి తగ్గాలంటే కౌగిలి కావాల్సిందే



అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ఈ చిత్రాన్ని జనవరి 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఈ చిత్రం టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ టీజర్‌లోని అఖిల్ స్టెప్స్, యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా ఉన్నాయి. అలాగే 'మీరు స్టూడెంట్‌గా ఉన్నప్పుడు, స్ట్రెస్ ఫీల్ అయినప్పుడు మీరేం చేసేవారు?' అంటూ అఖిల్ అడిగిన ప్రశ్నకు 'చాక్లెట్ తినేదాన్ని' అని ఓ అమ్మాయి చెప్పిన సమాధానానికి అఖిల్ 'ఆ రోజుల్లో చాక్లెట్స్‌తో పనైపోయేది. కానీ, టుడేస్ స్ట్రెస్ లెవల్స్‌కి హ్యూమన్ టచ్ కావాలి, 'ప్రపంచంలోని అందరమ్మాయిలు నా ఒక్కడి కోసమే పుట్టలేదు నిక్కీ. వాళ్ళకీ ఓ లైఫ్ ఉంటుంది. అండ్ ఐ రెస్పెక్ట్ దట్" అంటూ అఖిల్ అక్కినేని చెప్పే డైలాగ్స్ యూత్‌కి బాగా కనెక్ట్ అవుతాయి. అలాగే థమన్ ఇచ్చిన మ్యూజిక్ కూడా యూత్‌ఫుల్‌గా ఉంది అని చెబుతున్నారు నిర్మాత బి.వి.యస్.ఎన్.ప్రసాద్!!

నటన జీవితంలో అంతర్భాగం కావొచ్చు
కానీ నటనే జీవితం కారాదు -భారతీబాబు



188 సినిమాలతోపాటు పలు సూపర్‌హిట్ టీవీ ప్రోగ్రామ్స్, సీరియల్స్‌కి సంభాషణలు, 1600 పాటలు రాసి.. చేయి (నోరు) తిరిగిన రచయితగా పేరు గడించిన భారతీబాబు తొలిసారి దర్శకుడిగా మారి తెరకెక్కించిన చిత్రం నటన. మహీధర్, రఘువర్మ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో శ్రావ్యారావు, సూర్యశ్రీ హీరోయిన్లు. కుబేర ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి గురు చరణ్ నిర్మాణ సారథి. తరంగ వెంకటేశ్వరరావు-అక్కినేని శ్రీను ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న నటన ఈనెల 4న ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే సమకూర్చి దర్శకత్వం వహించిన బహుముఖ ప్రతిభాశాలి భారతీబాబు సూర్య సినిమాతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

డైరెక్టర్‌గా నాకు ఇంతకుముందు కూడా కొన్ని అవకాశాలు వచ్చినా.. సరైన నిర్మాత కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నా మిత్రుడు, సహ రచయిత గురుచరణ్ ద్వారా కుబేర ప్రసాద్ పరిచయమయ్యారు. నిజానికి వేరే సబ్జెక్ట్‌తో సినిమా చేయడానికి సన్నాహాలు చేసుకుంటూ ఆయన నన్ను సంప్రదించారు. అది బాగానే ఉన్నా.. నా దగ్గర అప్పటికే సిద్ధంగా ఉన్న నటన సబ్జెక్ట్ వారికి చెప్పాను. ప్రసాద్‌గారికి విపరీతంగా నచ్చింది. కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే మీరే రాసుకున్నారు కాబట్టి.. డైరెక్షన్ కూడా మీరే చేయండి అని ఆ బాధ్యతను నాపై పెట్టారు. గురు చరణ్ నిర్మాణ సారథ్యంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ తరంగ వెంకటేశ్వరరావు-అక్కినేని శ్రీనుల పర్‌ఫెక్ట్ ప్లానింగ్‌తో సినిమా అద్భుతంగా వచ్చింది. హీరోలు మహీధర్, రఘువర్మ, హీరోయిన్లు శ్రావ్యారావు, సూర్యశ్రీ, భానుచందర్, రఘుబాబు, ప్రభాస్ శ్రీను, జబర్దస్త్ ఫణి, అప్పారావు, దొరబాబుల నటన... వాసు కెమెరా పనితనం, ప్రభు ప్రవీణ్ లంక సంగీతం, నాగిరెడ్డి ఎడిటింగ్, విజయకృష్ణ ఆర్ట్, నందు ఫైట్స్ చార్లీ కొరియోగ్రఫి మా చిత్రానికి ఆయువుపట్టుగా నిలుస్తాయి. మా కో-డైరెక్టర్స్ ప్రభాకర్, రామయ్యరాజుల సహకారాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. తెల్లారి లేచిందగ్గర్నుంచి ప్రతి ఒక్కరం సందర్భానుసారం నటిస్తూనే ఉంటాం. నటన మనందరి జీవితంలో ఓ అంతర్భాగం అయినప్పటికీ.. నటనే జీవితం కాకూడదు అని చెప్పే చిత్రం నటన. వినోదాన్ని పుష్కలంగా అందిస్తూనే ఒకింత ఆలోచింపజేసే చిత్రమిది. రచయితగా నేను సంపాదించుకున్న పేరును మరింత పెంచి.. డైరెక్టర్‌గా నాకు మంచి గుర్తింపు తెచ్చే చిత్రమవుతుందన్నది నా నమ్మకం. నాకు దర్శకుడిగా అవకాశమివ్వడమే కాకుండా, సినిమా బాగా రావడానికి ఖర్చుకు వెనకాడకుండా మా యూనిట్‌ని ప్రోత్సహించిన మా నిర్మాత కుబేర ప్రసాద్‌గారికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ చిత్రంతో నిర్మాతగా పరిచయమవుతున్న ఆయనకు కూడా నటన శుభారంభాన్నిస్తుందనే నమ్మకం నాకుంది!!

సప్తగిరిధర గోవింద



స్టార్ కమెడియన్‌గా రాణిస్తూ 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్', 'సప్తగిరి ఎల్ఎల్‌బీ' చిత్రాలతో హీరోగా తనకంటూ ఓ రూట్‌ని ఏర్పరుచుకున్నారు సప్తగిరి. ఆయన హీరోగా 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' తెరకెక్కించిన దర్శకుడు అరుణ్ పవార్ డైరెక్షన్‌లో శివ శివమ్ ఫిలింస్ పతాకంపై నరేంద్ర యెడల, జీవీఎన్ రెడ్డి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'వజ్ర కవచధర గోవింద' అనే టైటిల్‌ను ఖరారు చేశారు.

వైభవీ జోషీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అర్చనా వేద, టెంపర్ వంశీ, అప్పారావు, అవినాష్, రాజేంద్ర జాన్ కొట్టోలి, వీరేన్ తంబిదొరై తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: ప్రవీణ్ వనమాలి, ఎడిటింగ్: కిషోర్ మద్దాలి,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాలన బాలగోపాలరావు!!

సినారెగా రాంజో



ఎన్టీఆర్ ప్రోత్సాహంతో రచయితగా వెలుగొందినవారిలో సి.నారాయణరెడ్డి ఒకరు. సినారెగా సుప్రసిద్ధులైన నారాయణరెడ్డి పాత్రను ఎన్టీఆర్ బయోపిక్‌లో ప్రముఖ గీత రచయిత రామ జోగయ్యశాస్త్రి పోషించారు. రామ జోగయ్యశాస్త్రికి దేవిశ్రీప్రసాద్ రాంజో అనే పొట్టి పేరు పెట్టారు. అప్పటి నుంచి ఆయన ఆత్మీయులంతా రాంజో అని పిలుస్తూ ఉంటారు!!

వసూళ్ల వేట సాగించే పేట



అశోక్ వల్లభనేని

రజనీకాంత్, కార్తీక్ సుబ్బరాజ్ కాంబినేషన్‌లో సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం 'పేట్ట' ఈ చిత్రాన్ని తెలుగులో అశోక్ వల్లభనేని పేట పేరుతో జనవరి 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అశోక్ వల్లభనేని మాట్లాడుతూ -బస్ కండెక్టర్ స్థాయి నుంచి రజనీ ఆలిండియా సూపర్‌స్టార్‌గా ఎదిగారు. రేపు కాబోయే ముఖ్యమంత్రి అని కూడా అంటున్నారు. ఆయన నాకు స్ఫూర్తి. అందువల్లే రజనీకాంత్‌గారితో సినిమా చేయగలిగే స్థాయిని అందుకోగలిగాను. ఆయనలో ఎన్నో సేవాగుణాలున్నాయి. తమిళ ప్రజలకు ఎంతో మేలు చేసిన రజనీకాంత్‌గారు తెలుగు ప్రజలకు ఏం చేశారనే ప్రశ్న వస్తుంది. అందుకోసమని ఈ నెల 6న జరగబోయే 'పేట' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మంచి సేవను అందిస్తోన్న రెండు, మూడు అనాథ శరణాలయాలకు రజనీకాంత్‌గారి చేతుల మీదుగా కొంత నగదును చెక్స్ రూపంలో అందించబోతున్నాం. ఇక దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ విషయానికొస్తే ఆయన రజనీకాంత్‌గారికి వీరభక్తుడు. ఒక ఫ్యాన్‌గా రజనీని ఆయన ఎలా చూడాలనుకున్నాడో.. పేటలో రజనీని అలా చూపించారు. రజనీ సూపర్‌హిట్ సినిమాలు బాషా, నరసింహా వంటి చిత్రాల కోవలో పేట వసూళ్ల వేట సాగిస్తుందని ఘంటాపథంగా చెప్పగలను. అనిరుధ్ మనసు పెట్టి మ్యూజిక్ అందించారు. పాటలకు చాలా మంచి రెస్పాన్స్ వస్తుంది. తెలుగులో మణిరత్నం నవాబ్‌ను నేనే రిలీజ్ చేసి హిట్ కొట్టాను. అదేవిధంగా సర్కార్ సినిమాను అనుకున్న టైంలో రిలీజ్ చేసి విజయ్‌గారికి తెలుగులో ఓ మార్కెట్‌ను క్రియేట్ చేశాం. అదే నమ్మకంతో సన్‌పిక్చర్స్ సంస్థ నాకు ఈ సినిమా తెలుగు హక్కులను ఇచ్చారు. తెలుగులో స్ట్రయిట్ సినిమాను ఈ ఏడాది ప్లాన్ చేస్తున్నాం. కథలు వింటున్నాను. మంచి కథ, హీరో దొరకగానే అనౌన్స్ చేస్తాం. లేకుంటే.. చిన్న బడ్జెట్ చిత్రాలు చేసుకుంటాను.

ఆర్‌ఎక్స్ 100 కోవలో కెఎస్ 100




చంద్రశేఖరా మూవీస్ పతాకంపై ఇంటర్నేషనల్ మోడల్స్ సమీర్ ఖాన్, శైలజలను హీరో హీరొయిన్‌లుగా పరిచయం చెస్తూ వెంకట్ రెడ్డి "కెఎస్100" చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షేర్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది.

దర్శకుడు షేర్ మాట్లాడుతూ.. "కెఎస్100" టైటిల్ తగ్గట్టుగానే వైవిధ్యమైన కంటెంట్‌తో తెరకెక్కుతొన్న చిత్రం. హారర్, సస్పెన్స్ థ్రిల్లర్, రొమాంటిక్ జోనర్స్‌లా ఆడియెన్స్‌ను ఇన్స్పైర్ చేసేలా తీశాము. త్వరలొనె సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామన్నారు.

అక్షిత, అషి, సునీత, శ్రద్ధా, నందిని, కల్పన అజీమ్, పూరివి, సుమన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: వంశీ, ఎడిటర్: లోకేష్ చందు, నాగార్జున, సాహిత్యం: భాష్యశ్రీ, మ్యూజిక్: నవనీత్‌చారి, కొరియోగ్రఫీ: జొజొ, యాక్షన్: మాలేష్, బిజిఎమ్: రామ్ మోహన్ చారి, అసొషియెట్ డైరెక్టర్: రవితేజ, ఆర్ట్: సుదర్శన్!!

లక్ష్మీ బావ





వెంకటేష్-వి.వి.వినాయక్ కాంబినేషన్‌లో వచ్చిన లక్ష్మి ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు మళ్లీ వీరిద్దరి కలయికలో మరో సినిమా వస్తోందని తెలుస్తోంది. వెంకీ ఇమేజ్‌కి తగ్గట్లుగా వినాయక్ సిద్ధం చేసిన స్క్రిప్ట్‌ను సురేష్‌బాబు ఓకె చేశారని అతి త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది!!

లేడీ టైగర్ వస్తోంది



లేడీ సూపర్ స్టార్ నయనతార నటించగా మలయాళంలో మంచి విజయం సాధించిన "ఎలెక్ట్రా" చిత్రం తెలుగులో "లేడీ టైగర్" పేరుతో ఈనెల 4న విడుదల కానుంది. సురేష్ సినిమా పతాకంపై.. సి.ఆర్.రాజన్ సమర్పణలో.. సురేష్ దూడల ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. శ్రీమతి సరోజ సురేష్ సహ నిర్మాత. శ్యామ్ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రముఖ హీరోయిన్ మనీషా కొయిరాలా ముఖ్య పాత్ర పోషించగా.. ప్రకాష్ రాజ్ ద్విపాత్రాభినయం చేయడం విశేషం. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన బిజూ మీనన్ మరో ముఖ్య పాత్రధారి.రాజశేఖర్ రెడ్డి మాటలు, వెనిజండ్ల శ్రీరామ్మూర్తి పాటలు అందించారు.

ఉన్మాదిగా ఎందుకు మారాడు?



ప్రవీణ క్రియేషన్స్ ప్రై.లి. పతాకంపై ప్రొడక్షన్ నెం.2గా ఎన్.కరణ్ రెడ్డి సమర్పణలో రూపొందుతోన్న చిత్రం ఉన్మాది. ఎన్.ఆర్.రెడ్డి కీలక పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించారు. ఎన్.రామారావు నిర్మాత. డేవిడ్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను రాజ్‌కందూరి ఆవిష్కరించారు. ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు.

ముఖ్యపాత్రధారి మరియు నిర్మాత ఎన్.ఆర్.రెడ్డి మాట్లాడుతూ.. నేను బేసిక్‌గా స్వర్గీయ హరికృష్ణ గారికి పెద్ద అభిమానిని, ఓరకంగా ఆయనే నా ఇన్‌స్పిరేషన్. ఉన్మాది సినిమాలో ఒక్కసారైనా ఆయనలా కనిపించాలని ప్రయత్నించాను. ఒక్క క్షణం అలా కనిపించి ఉన్నా నేను సక్సెస్ అయినట్లే.. అన్నారు.

ఏవీఎస్ తనయుడి దర్శకత్వంలో



యాక్టివ్ స్టూడియోస్ పతాకంపై ఎ.జి.ఆర్. కౌశిక్ సమర్పణలో రూపొందుతున్న చిత్రం వైదేహి. ఎ.జననీ ప్రదీప్ నిర్మాత. ఎ.రాఘవేంద్ర ప్రదీప్ దర్శకుడు. ఈయన దివంగత నటుడు ఏవీయస్ తనయుడు. ఏవీయస్ జయంతిని పురస్కరించుని జనవరి 2న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ఈ సినిమా ట్రైలర్‌ను ఎన్.శంకర్ విడుదల చేశారు. ఏవీయస్ జయంతి సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పసువులేటి రామారావు కేక్ కట్ చేశారు.

దర్శకుడు ఎ.రాఘవేంద్రప్రదీప్ మాట్లాడుతూ.. మా నాన్నగారిని గుర్తుచేసుకోవడానికి ఓ మంచి అకేషన్ ఉంటే బావుంటుందనిపించింది. ఆయన పుట్టిన రోజున మా సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనందంగా ఉంది. నన్ను ప్రోత్సహించిన వారు చాలా మంది ఉన్నారు. మా నటీనటులు, టెక్నీషియన్లను చాలా ఇబ్బందిపెట్టాను. రాత్రింబవళ్లు షూటింగ్‌లు చేసేవాళ్లం. అయినా వారందరూ చిరునవ్వుతో పనిచేసేవారు. మా కుటుంబ సభ్యులకన్నా ఎన్.శంకర్‌గారు నాకు చాలా ఆత్మీయులు. ఆయన చేతుల మీదుగా మా ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. మా బావగారు నాకు ఇచ్చే సపోర్ట్‌ను మర్చిపోలేను. చాలా సందర్భాల్లో ఆయన మా నాన్నగారిలాగా నన్ను ప్రోత్సహిస్తున్నారు.. అని అన్నారు.

సెభాష్! నేను సాధించలేనిది మీరు సాధించారు

కనకదుర్గ , బిందూలపై తృప్తి దేశాయ్ ప్రశంసలు

న్యూఢిల్లీ : శబరిమల ఆలయంలోకి ప్రవేశించడం ద్వారా నారీ శక్తి ఏమిటన్నది మరోసారి ప్రపంచానికి తెలిసి వచ్చిందని భూమాతా బ్రిగేడ్ కార్యకర్త తృప్తీ దేశాయ్ వ్యాఖ్యానించారు. నెలన్నర క్రితం తాను చేయలేకపోయిన పనిని నేడు బిందు, కనకదుర్గలు చేసి చూపించారని బుధవారం ఉదయం మీడియా ముందు వ్యాఖ్యానించిన ఆమె సుప్రీం కోర్టు తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా, ఇద్దరు మహిళలను స్వామి సన్నిధికి పంపిన కేరళ సర్కారుకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె అతి త్వరలో తాను కూడా ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకుంటానని చెప్పారు. మహిళల ప్రవేశంతో అనాదిగా వస్తున్న ఛాందస సంస్కృతి తుడిచిపెట్టుకుపోయిందని ఆమె అభిప్రాయపడ్డారు. వారి ప్రవేశం తరువాత గర్భగుడి తలుపులు మూసివేయడం, శుద్ధి చేయాలని నిర్ణయించడాన్ని ప్రశ్నించిన తృప్తి దేశాయ్ ఇది యావత్ భారత మహిళలకే అవమానమని మండిపడ్డారు.



రాఫెల్‌పై లోక్‌సభలో బిగ్‌ఫైట్

- సభలో కాగితం పడవలు వదిలిన విపక్షాలు
- రాఫెల్ రహస్యాలు పారికర్ బెడ్రూమ్‌లో
- ఆధారాలు విడుదల చేసిన కాంగ్రెస్
- అధికార విపక్షాల నడుమ ముదిరిన మాటల యుద్ధం
- రివ్యూ పిటిషన్‌తో మళ్లీ సుప్రీం ముందుకు ప్రశాంత్



న్యూఢిల్లీ : లోక్‌సభలో బుధవారం రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై వాడిగా వేడిగా చర్చ జరిగింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీపై విరుచుకుపడ్డారు. తాను సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము మోదీకి లేదన్నారు. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ కూడా రాహుల్ గాంధీకి దీటుగా సమాధానం ఇచ్చారు. రాహుల్ గాంధీ అబద్ధాలు చెబుతున్నారని జైట్లీ ఆరోపించారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ డీల్, నేషనల్ హెరాల్డ్ కేసులను ప్రస్తావించారు.

యుద్ధ విమానం అంటే ఏమిటో తెలియని వ్యక్తి కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తుండటం విచారకరమని అన్నారు. వాడిగా వేడిగా వాదనలు జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు కాగితపు విమానాలు విసిరారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ వారిని మందలించారు. 'మీరు చిన్న పిల్లలా? పెద్దవారా' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ మాట్లాడుతూ, లోక్‌సభలో అరుణ్ జైట్లీ మాట్లాడుతున్నప్పుడు తాము కాగితపు విమానాలు విసిరామని చెప్పారు. రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై చర్చ జరుగుతున్నప్పుడు జైట్లీ అగస్టా వెస్ట్‌ల్యాండ్, నేషనల్ హెరాల్డ్ గురించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. రఫేల్ డీల్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.

కేంద్రం తప్పుడు వివరాలు

రాజకీయ దుమారానికి కారణమైన రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం మళ్లీ సుప్రీం కోర్టు గడప తొక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ కేసులో బీజేపీ ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇస్తూ గత ఏడాది డిసెంబర్ 14న తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. రాఫెల్ ఒప్పందం ప్రక్రియను సందేహించ దానికి ఎలాంటి ప్రాతిపదిక కనిపించడం లేదని కోర్టు ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. యుద్ధ విమానాల అవశ్యకత, నాణ్యతపై ఎటువంటి అనుమానాలూ లేవని, ఒప్పందం రద్దు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సీనియర్ నాయకులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరి, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇచ్చిందని, అందువల్ల తీర్పు ను పునఃసమీక్షించాలని తమ పిటిషన్‌లో కోరారు. తమ రివ్యూ పిటిషన్‌పై బహిరంగ న్యాయస్థానంలో విచారణ జరిపించాలని పిటిషన్‌దారులు కోర్టుకు విన్నవించారు. తక్షణం ఈ పిటీషన్‌ని విచారణ జరపటం వల్ల జనంపై పడుతున్న వేల కోట్ల రూపాయలు కాపాడాలని కోరారు.

రాఫెల్ డీల్ ఫైల్ తన బెడ్రూంలో ఉందన్న పారికర్

రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం విషయంలో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య మొదలైన యుద్ధం తార స్థాయికి చేరుకుంది. తాజాగా, రక్షణ శాఖ మాజీ మంత్రి, ప్రస్తుత గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్, గోవా మంత్రి విశ్వజిత్ రాణే మధ్య జరిగినదిగా చెబుతున్న సంభాషణకు సంబంధించిన ఆడియో క్లిప్‌ను కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా మీడియాకు విడుదల చేసి మరింత కాక రేపారు. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన సమాచారం మొత్తం తన బెడ్ రూములోనే ఉందని, ఆ డాక్యుమెంట్లన్నీ తన ఫ్లాట్‌లో భద్రంగా ఉన్నాయని పారికర్ అందులో పేర్కొన్నారని, కేంద్రాన్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకే ఆయన వాటిని తన వద్ద దాచుకున్నారని సుర్జేవాలా ఆరోపించారు. రాఫెల్ ఒప్పందంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలన్న తమ డిమాండ్‌కు కేంద్రం అంగీకరించకపోవడం వెనుక ఉన్న కారణాల్లో ఇది కూడా ఒకటన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరో వైపు పారికర్‌కు, తనకు మధ్య జరిగిన సంభాషణగా చెబుతున్న ఆడియో టేప్ నకిలీదని గోవా మంత్రి రాణే పేర్కొన్నారు. తనపై వస్తున్న ఆరోపణలను రాణే ఖండించారు. కాగా, గత వారం గోవా కేబినెట్ సమావేశంలో పారికర్ మాట్లాడుతూ, రాఫెల్ డీల్‌కు చెందిన మొత్తం డాక్యుమెంట్లు, ఫైలు తన బెడ్‌రూమ్‌లో ఉన్నాయని చెబుతుండగా కాంగ్రెస్ విడుదల చేసిన ఆడియో టేపులో స్పష్టంగా వినిపిస్తోంది.

అనిల్ అంబానీ పేరు చెప్పవద్దా? కొత్త రూలా

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ చర్చ ప్రారంభించి, ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో సభలోని భారతీయ జనతా పార్టీ ఎంపీలు ఆందోళనకు దిగడంతో కొంత సేపు గందరగోళం నెలకొంది. ఇది ఇలా ఉండగా, రాహుల్ ప్రసంగంపై లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పలు మార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. చర్చ సందర్భంగా 'ప్రపంచంలోకెల్లా అత్యంత విలువైన ఒప్పందాన్ని అనుభవం లేని అనిల్ అంబానీకి ఎందుకు ఇచ్చారు. దేశ సంపదను కొల్లగొట్టి అనిల్ అంబానీ జేబులో వేశారు' అని రాహుల్ దుయ్యబట్టారు. అయితే, అనిల్ అంబానీ పేరు వాడడంపై స్పీకర్ అభ్యంతరం తెలిపారు. సభలో లేనివారి పేర్లను ప్రస్తావించవద్దని స్పీకర్ సూచించారు. దీనికి రాహుల్ స్పందిస్తూ, 'అనిల్ అంబానీ పేరు చెప్పకూడదా? ఇదేమైనా కొత్త నిబంధనా? కనీసం ఏ ఏ అని కూడా అనకూడదా? అయితే డబుల్ ఏ అని చెప్పవచ్చా?' అని ప్రశ్నించారు. ఆ తరువాత డబుల్ ఏ అని చెబుతూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. అంతకుముందు ఆడియో టేపులను సభలో వినిపించాలని రాహుల్ పట్టుబట్టగా స్పీకర్ అందుకు నిరాకరించారు. రఫేల్ ఒప్పందానికి సంబంధించిన కొన్ని కీలక పత్రాలు మనోహర్ పారికర్ పడకగదిలో ఉన్నాయని గోవా మంత్రి విశ్వజిత్ రాణే ఫోన్‌లో ఎవరితోనో చెప్పినట్లుగా ఉన్న ఆడియో టేప్‌ను కాంగ్రెస్ బుధవారం విడుదల చేసింది. ఈ టేపును సభలో వినిపించేందుకు అనుమతి ఇవ్వాలని రాహుల్ స్పీకర్‌ను కోరారు. అయితే, ఇందుకు ఆమె నిరాకరించారు. అంతకుముందు మనోహర్ పారికర్ గోవా సీఎం అని రాహుల్ పేర్కొన్నారని, ఆయనను రక్షణ శాఖ మాజీ మంత్రిగా సంబోధించాలని స్పీకర్ సూచించారు. ఇందుకు రాహుల్ స్పందిస్తూ, 'దీని గురించి మీరు భయపడుతున్నారు గనుక నేను ఈ ఆడియో టేపును వినిపించను' అని అన్నారు.

ప్రజలు మనల్ని చూసి నవ్వుతున్నారు

సభ్యుల నిరసనలపై భగ్గుమన్న వెంకయ్య



న్యూఢిల్లీ : కీలక అంశాలపై చర్చలు జరగకుండా సభ్యులు ప్రవర్తిస్తున్న తీరుపై రాజ్యసభ చైర్మన్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంటు సభ్యుల ప్రవర్తన చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఆయన అన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభలు పలు అంశాలపై చర్చలు జరగకుండా వాయిదాలు పడుతుండడంపై ఆయన బుధవారం రాజ్యసభలో మాట్లాడారు. 'మరి ఐదు రోజుల్లో శీతాకాల సమావేశాలు ముగియబోతున్నాయి, కానీ సభలో దేని గురించి చర్చ జరగకుండా వాయిదాల పర్వం కొనసాగుతోంది' అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'సభా కార్యకలాపాలు సక్రమంగా జరగకపోవడం వల్ల ప్రజలు మనల్ని చూసి నవ్వుకుంటున్నారు. ఇది పార్లమెంటు ప్రతిష్ఠను దెబ్బ తీస్తోంది. దయచేసి సభ సజావుగా జరిగేందుకు సహకరించండి. మరి ఐదు రోజులు మాత్రమే సమయం ఉంది. ముమ్మారు తలాక్, రఫేల్ ఒప్పందం వంటి కీలక అంశాల గురించి చర్చ జరగాల్సి ఉంది. కొన్ని తీర్మానాలను ఆమోదించేందుకు దయచేసి సహకరించండి' అని వెంకయ్య నాయుడు సభ్యులను ఉద్దేశించి అన్నారు. డిసెంబర్ 11న ప్రారంభమైన శీతాకాల సమావేశాలు ఈ నెల 8వ తేదీతో ముగియనున్నాయి. కావేరీ జలాల అంశం, రఫేల్ ఒప్పందాల గురించి కాంగ్రెస్, అన్నా డీఎంకే ఎంపీలు ఆందోళన చేయడంతో రాజ్యసభలో వాయిదాల పర్వం కొనసాగుతోంది. బుధవారం సభ ప్రారంభమైన కొద్దిసేపటికే కావేరీ నదీ జలాల విషయంలో న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ అన్నా డీఎంకే నేతలు నిరసనకు దిగారు. దీంతో సభ పలు మార్లు వాయిదా పడింది.

కొందరు నిజాలను ఇష్టపడరు

రాహుల్‌పై జైట్లీ ధ్వజం



న్యూఢిల్లీ : రఫేల్ ఒప్పందంపై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ప్రభుత్వంపై రాహుల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రఫేల్ డీల్‌కు సంబంధించిన పత్రాలు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పడక గదిలో ఉన్నాయంటూ గోవా మంత్రి ఫోన్‌లో మాట్లాడిన టేప్ ఉందని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలపై అరుణ్ జైట్లీ ధ్వజమెత్తారు. కల్పిత టేప్ అని పారికర్ ఖండించినప్పటికీ రాహుల్ అసత్య ఆరోపణలను చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. రఫేల్ ఒప్పందంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, కొందరు సహజంగా నిజాలను ఇష్టపడరని జైట్లీ విమర్శించారు. డబ్బుకు సంబంధించిన విషయాలను బాగా అర్థం చేసుకుంటారు కానీ జాతీయ భద్రతకు సంబంధించిన విషయాలను అర్థం చేసుకోలేరని జైట్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసు, అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణంతో పాటు బోఫోర్స్ కుంభకోణంలో దళారిగా వ్యవహరించిన ఖత్రోకీ పేరును ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. రక్షణ కుంభకోణాల్లోని కుట్రదారులు మోడీని విమర్శిస్తున్నారని, యుద్ధ విమానం గురించి కూడా తెలియని వ్యక్తి కాంగ్రెస్‌కు అధ్యక్షత వహిస్తున్నారని జైట్లీ దుయ్యబట్టారు.

మధ్య ప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య

వందేమాతరం వివాదం


- ప్రతి నెల మొదటి పని దినం గీతం ఆలపించాల్సిందే
- గత బీజేపీ ప్రభుత్వ హయాంలో తీర్మానం
- అమలుకు నిరాకరిస్తున్న కాంగ్రెస్ కొత్త సర్కార్
- ఇరు వర్గాల మధ్య పెరిగిన మాటల తూటాలు
- ఆనవాయతీ పునరుద్ధరించాలని కమలనాథుల డిమాండ్



భోపాల్ : మధ్య ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య మాటల యుద్ధం మొదలయింది. తాము అధికారంలో ఉండగా ప్రవేశపెట్టిన వందేమాతరం గీతాలాపన విధానాన్ని కొనసాగించకపోవడాన్ని బీజేపీ తప్పుపట్టడంతో ఇరు వర్గాల మధ్య వివాదం రాజుకుంది. వివరాల్లోకి వెళితే, మధ్య ప్రదేశ్‌లో సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం సచివాలయంలో ప్రతి నెల మొదటి పని దినం రోజున వందేమాతరం గీతం ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి ఒకటిన దీన్ని పాటించ లేదు. దీనిపై మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ తీరుపై మండిపడ్డారు. 'వందే మాతరం కేవలం జాతీయ గీతమే కాదు. అది దేశభక్తికి ప్రతీక. అది ప్రజల హృదయాల్లో నూతన ఉత్సాహాన్ని కలుగజేస్తుంది. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ దేశం, దేశభక్తి కంటే ఏదీ ఎక్కువ కాదు. తక్షణం వందే మాతర గీతం ఆలపించే ఆనవాయతీని పునరుద్ధరించాలి' అని ట్వీట్ చేశారు. తన విజ్ఞాపనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఈ నెల 6న దేశ భక్తులతో కలసి సచివాలయం ప్రాంగణంలో తాను దేశభక్తి గీతాన్ని ఆలపిస్తానని తెలిపారు. శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యాఖ్యలపై మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి కమలనాథ్ కూడా తీవ్రంగానే స్పందించారు. వందేమాతర గీతం ఆలపించని వారికి దేశభక్తి ఉండదా అని ప్రశ్నించారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూపేంద్ర గుప్తా కూడా ఘాటుగానే సమాధానం ఇచ్చారు. వందేమాతర గీతంపై బీజేపీ ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తోందో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మహంతి మంగళవారం బాధ్యతలు చేపట్టారని, ఆ పనుల్లో బిజీగా ఉండడం వల్ల ఆలపించకపోయి ఉండవచ్చునని ప్రభుత్వ చర్యపై వివరణ ఇచ్చారు

మనిషిలా బాధపడిన రాముడు దేవుడా?

కన్నడ రచయిత వివాదాస్పద వ్యాఖ్యలు



బెంగళూరు : అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ కర్నాటకకు చెందిన ప్రముఖ రచయిత కేఎస్ భగవాన్ తన తాజా పుస్తకంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కన్నడలో ఆయన రాసిన 'రామ మందిర యేకే బేడ (రామ మందిర అవసరం ఏముంది?)' పేరుతో రాసిన పుస్తకం ఇప్పుడు సంచలనమైంది. మానవుల్లా అన్ని కష్టాలు పడిన రాముడు దేవుడు ఎలా అవుతాడంటూ గొప్ప సందేహాన్ని ఆయన ఆ పుస్తకంలో వెలిబుచ్చారు. 'రామ మందిర యేకే బేడ' పుస్తకం వివాదాస్పదం కావడంతో ఆయనపై హిందుత్వ సంస్థలు మండిపడుతున్నాయి. ఆయన ఇంటి ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. రాముడు అసలు దేవుడే కాదని అర్థం వచ్చేలా రాసిన ఆయన పుస్తకాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు. రాముడిని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మైసూరు జిల్లా హిందూ జాగరణ్ వేదిక అధ్యక్షుడు కె. జగదీశ్ హెబ్బర్ భగవాన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తన రాతలతో తమ మనోభావాలను కించపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భగవాన్‌పై కేసు నమోదైంది. భగవాన్ తన రాతలతో హిందువుల మనోభావాలను దెబ్బ తీసినప్పటికీ ముఖ్యమంత్రి కుమారస్వామి ఇప్పటి వరకు ఈ విషయంపై స్పందించకపోవడంపై బీజేపీ మండిపడుతోంది. భగవాన్‌ను అరెస్ట్ చేయడమో, లేదంటే మానసిక ఆసుపత్రికి పంపడమో చేయాలని బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఎస్. సురేశ్ కుమార్ పేర్కొన్నారు.


నా కొడుకు పని తీరు బాగా లేదు : ములాయం



లక్నో : పుత్ర వాత్సల్యంతో సలహాగానే ఇచ్చారో, ఆగ్రహంతోనే చేశారో గాని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్‌పై ఆయన తండ్రి ములాయం సింగ్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీ నేతలు మంగళవారం లక్నోలో ఏర్పాటు చేసిన కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ములాయం సింగ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయమయ్యాయి. పార్టీ చీఫ్‌గా అఖిలేష్ పని తీరు అంత సంతృప్తికరంగా లేదని ములాయం అన్నారు. తన బాధ్యతలను అఖిలేష్ సరిగా నిర్వర్తించడం లేదని, దీని వల్ల రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే బీజేపీ చాలా ముందుకు వెళ్లిందని, ఇప్పటికైనా అఖిలేష్ మేలు కోకుంటే నష్టపోవడం ఖాయమని హెచ్చరించారు. ముఖ్యంగా పార్టీలో క్రమశిక్షణ పెంపొందించాల్సిన అవసరం ఉందని, పార్టీ వ్యవహారాల్లో మహిళలకు ప్రాధాన్యం పెంచాలని ములాయం సూచించారు. బీజేపీకి వ్యతిరేకంగా మహా కూటమి ఏర్పాటుకు ఓ వైపు అఖిలేష్ చురుకుగా పావులు కదుపుతున్న నేపథ్యంలోతండ్రి చేసిన వ్యాఖ్యలు చర్చనీయంగా మారాయి.

దొంగను పట్టించిన జీమెయిల్

ఐడీ, ఐపీ అడ్రస్ ఆధారంగా లొకేషన్ గుర్తింపు



న్యూఢిల్లీ : 'జీ మెయిల్' ఓ దొంగను పట్టించింది. ఏదైనా కేసును ఛేదించేందుకు పోలీసులు పలు రకాలుగా యత్నిస్తుంటారు.దానిలో భాగంగానే జీ మెయిల్ ద్వారాయత్నించిసక్సెస్ అయ్యారు. ఢిల్లీకి చెందిన నగల వ్యాపారి గురు ప్రీత్ సింగ్ వద్ద జస్వీందర్ సింగ్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. తన ఆఫీసుకు సంబంధించిన రూ. 18 లక్షల సొమ్ముతో జస్వీందర్ సింగ్ పారిపోయాడని గురుప్రీత్ డిసెంబర్ 29న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆఫీసులో జస్వీందర్ ఉపయోగించిన సిస్టమ్‌ను పోలీసులు చెక్ చేశారు. సిస్టమ్‌లో అతని జీమెయిల్ లాగ్ అవుట్ చేయలేదని గుర్తించారు. వెంటనే జస్వీందర్ ఐడీ, ఐపీ అడ్రస్ ఆధారంగా లొకేషన్‌ను గుర్తించి జస్వీందర్ చండీగఢ్‌లో ఉన్నట్టు తెలుసుకుని అతన్ని అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు.

మహిళపై ఆటోలో గ్యాంగ్ రేప్



న్యూఢిల్లీ : దేశ రాజధానిలో మరో దారుణం జరిగింది. నడుస్తున్న ఆటోలో ఓ మహిళపై కొందరు దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం స్పృహ కోల్పోయిన మహిళను ఓ దాబా పక్కనే పడేసి పరారయ్యారు. ఆరుగురు నిందితుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మరొకరి కోసం గాలిస్తున్నారు. శనివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీకి చెందిన 42 ఏళ్ల మహిళ భర్త గురుగ్రామ్‌లోని ఓ కంపెనీలో పని చేస్తుండగా ఐదేళ్ల క్రితం మరణించాడు. కంపెనీ నుంచి తన భర్తకు డబ్బులు రావాల్సి ఉండడంతో సమస్యను పరిష్కరించుకుని డబ్బులు తెచ్చుకునేందుకు మహిళ నఖ్‌రోలా చౌక్‌లో మధ్యాహ్నం 2.20 గంటల సమయంలో ఆటో ఎక్కింది. ఆమెను ఐఎంటీ– మనేసర్‌కు తీసుకువెళ్లాల్సిన ఆటో డ్రైవర్ అంకిత్ ఆమెను మరో ఆటో డ్రైవర్ దీపక్ రూముకు తీసుకువెళ్లాడు. అక్కడ ఇద్దరూ కలసి అత్యాచారానికి పాల్పడ్డారు. రాత్రి 9 గంటలకు ఆమెను ఆటోలో తీసుకువెళ్లిన నిందితులు బాధితురాలిని మరి ముగ్గురికి అప్పగించారు. వారందరూ కలసి అదే ప్రాంతంలో ఆటోను తిప్పుతూ ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం స్పృహకోల్పోయిన ఆమెను రామ్‌పురా ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న ఓ దాబా వద్ద పడేసి వెళ్లిపోయారు. స్పృహ కోల్పోయి పడి ఉన్న బాధితురాలిని చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. మరొకరి కోసం గాలిస్తున్నారు.

మోడీ ఇంటరువ్వూ పూర్తి పేరడీలా సాగింది

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఓ న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ఇంటర్వ్యూపై కాంగ్రెస్ మండిపడింది. మోడీ 95 నిమిషాల ఇంటర్వ్యూ పూర్తి స్వగతమే తప్ప మరేమీ కాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా ఎద్దేవా చేశారు. మోడీ ఇంటర్వ్యూ సారాంశం ఇదేనంటూ ట్వీట్ చేసిన ఆయన 'నన్ను, నేను, నాకు అనే విషయాలు తప్ప అందులో దేశానికి పనికి వచ్చే ఒక్క అంశం కూడా లేదు' అని ధ్వజమెత్తారు. దేశం ఐ(మోడీ), లైస్ (అబద్ధాలు)తో ఇబ్బంది పడుతోందని విమర్శించారు. మోడీ తన ఇంటర్వ్యూలో పూర్తి వాక్చాతుర్యాన్ని ప్రదర్శించారని సూర్జేవాలా ఎద్దేవా చేశారు. ఆయన ఇంటర్వ్యూ ఓ పేరడీని తలపించిందని విమర్శించారు.

అయ్యప్ప సన్నిధికి మహిళలు ఎలా వచ్చారంటే

- అనుమానం రాకుండా అంబులెన్స్‌లో మహిళలు
- ఆలయం వద్ద భక్తులు లేకుండా చూసిన అధికారులు
- భయపెట్టి నా సోదరిని ఆలయానికి పంపారు
- అధికారుల చర్యలతో అయ్యప్ప దర్శనం నిలిపివేత
- సంప్రోక్షణ తరువాత తిరిగి గుడిలోకి భక్తుల అనుమతి

శబరిమల : మహిళలను ఎలాగైనా అయ్యప్ప సన్నిధికి తీసుకువెళ్లి తీరాలని గట్టి పట్టుదలతో ఉన్న కేరళ సర్కార్ అందుకు అనువైన సమయాన్ని ఎంచుకుని, ఆద్యంతం పూర్తి రహస్యంగా బుధవారం తెల్లవారు జామున సుప్రభాత సమయంలో బిందు, కనకదుర్గలను కొండపైకి తీసుకువెళ్లింది. వీరు ఎవరి కంటా పడకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకున్న అధికారులు చిన్న పాదం వైపు కాకుండా, పంబ నుంచి సన్నిధానానికి వెళ్లే రోడ్డు మార్గం గుండా వీరిని తీసుకువెళ్లారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఓ అంబులెన్స్‌లో వీరిని కొండపైకి తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది. అప్పటికే ఈ విషయాన్ని ఆలయం వద్ద భద్రత విధుల్లో ఉన్న పోలీసులకు విషయం చెప్పగా, వారు పదునెట్టాంబడి సమీపంలో భక్తులు ఎవరూ లేకుండా చూశారు. ఆపై వీరు 18 బంగారు మెట్లపై నుంచి ఎక్కి, పరుగెత్తుతూ ఆలయంలోకి వెళుతుంటే, వెనుకే ఓ కెమెరా వీరిని అనుసరించింది. ఆ కెమెరా చిత్రీకరించిన దృశ్యాలే ఇప్పుడు బయటకు వచ్చాయి. స్వామి దర్శనం అనంతరం వీరిని అంతే వేగంగా కొండ కిందకు దింపి, ప్రత్యేక వాహనంలో నీలక్కల్ దాటించినట్టు తెలుస్తోంది. వీరిద్దరూ ఇప్పుడు ఎక్కడ ఉన్నారన్న విషయమై సమాచారం లేదు. ఇక ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన కేరళ బీజేపీ నేత రమేష్ శబరిమలలోని అన్ని సీసీటీవీ ఫుటేజ్‌లనూ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వీరు భక్తుల కంటబడకుండా కొండపైకి వచ్చారంటే అది ప్రభుత్వ కుట్రేనని ఆరోపించారు. తాము రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

అయ్యప్ప గర్భగుడికి తాళం వేసిన పూజారులు

50 ఏళ్ల వయసులో ఉన్న ఇద్దరు మహిళలు పోలీసుల సాయంతో అయ్యప్పను దర్శించుకోవడంపై మండిపడుతున్న అయ్యప్ప పూజారులు, భక్తులు గర్భగుడికి తాళం వేశారు. ప్రస్తుతం ఆలయంలో శుద్ధి కార్యక్రమాలు జరుగుతుండగా, ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. బిందు, కనకదుర్గ అనే ఇద్దరు తెల్లవారు జామున 3.45 గంటల సమయంలో ఆలయాన్ని దర్శించుకోగా, దానికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. వారు ఆలయం వద్దకు వచ్చిన వేళ, మీడియా ప్రతినిధులు ఎవరూ అక్కడ లేరు. భక్తుల రద్దీ కూడా చాలా తక్కువగా ఉంది. వారికి రక్షణగా వచ్చిన పోలీసుల సంఖ్య కూడా స్వల్పమే. కేరళ ముఖ్యమంత్రి సైతం ఈ విషయాన్ని నిర్ధారించారు. ఇద్దరు మహిళలు స్వామిని పూజించారని, వారికి పోలీసులు రక్షణగా నిలిచారని తెలిపారు. కాగా, కావాలనే కేరళ ప్రభుత్వం సమయం చూసి మహిళలను ఆలయంలోకి పంపి భక్తుల మనోభావాలను దెబ్బ తీసిందని బీజేపీ ఆరోపించింది.

తీవ్ర దుమారం, సంప్రోక్షణ

బుధవారం తెల్లవారు జామున ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలో స్వామిని దర్శించుకున్న తరువాత తీవ్ర దుమారం చెలరేగగా గర్భాలయ తలుపులను మూసివేసిన ప్రధాన పూజారులు సంప్రోక్షణ తరువాత తలుపులను తిరిగి తెరిచారు. ప్రధాన అర్చకుడి ఆదేశాలతో ఆలయాన్ని శుద్ధి చేసి, ఆపై భక్తులను దర్శనానికి అనుమతిస్తున్నామని, ఇప్పుడు పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, సంప్రోక్షణకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, జరిగిన ఘటనలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన పందల రాజ వంశీకులు అయ్యప్ప ఆలయ సంప్రదాయాలను మార్చేందుకు తాము మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు.



ఎవరో కుట్ర చేశారు : కనకదుర్గ సోదరుడు

హిందూ సంప్రదాయాలను గౌరవిస్తూ, అయ్యప్పను కొలిచే తమ కుటుంబంలోని మహిళ శబరిమలకు వెళ్లి అయ్యప్పను దర్శించుకుందంటే నమ్మలేకున్నానని కనకదుర్గ సోదరుడు వ్యాఖ్యానించారు. కోజికోడ్‌లో బుధవారం ఉదయం కనకదుర్గ ఇంటి ముందు పలువురు కేరళవాసులు నిరసనకు దిగగా, ఆయన మాట్లాడారు. తన చెల్లెలు అయ్యప్పను దర్శించుకుందంటే నమ్మలేకున్నానని, దీని వెనుక కుట్ర ఉందని అన్నారు. తన సోదరిని భయపెట్టి ఆలయానికి తీసుకువెళ్లి ఉంటారని, ప్రస్తుతం ఆమె ఎక్కడ ఉందో తమకు తెలియడం లేదని అన్నారు. ఆమె ప్రాణాలకు ముప్పు ఉందన్న ఆందోళన తమ కుటుంబంలో నెలకొని ఉందని చెప్పారు.

దేశవ్యాప్తంగా మూసుకున్న అయ్యప్ప ఆలయాల తలుపులు

శబరిమలలో ఇద్దరు మహిళలు స్వామిని దర్శించుకున్నారన్న వార్త తో దేశవ్యాప్తంగా అన్ని అయ్యప్ప ఆలయాలనూ మూసేసినట్టు తెలుస్తోంది. తమిళనాడు, కేరళ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న ఆలయాలను మూసివేయగా, సంప్రోక్షణల అనంతరం శబరిమలలో స్వామి గర్భగుడి తలుపులు తెరిచిన తరువాతే ఆలయాలను తెరవాలని గురుస్వాములు పిలుపు ఇచ్చారు. పలు ప్రాంతాల్లో అయ్యప్ప భక్తులు ఆలయాలకు చేరుకుని నిరసనలు తెలియజేస్తున్నట్టు సమాచారం. మహిళలకు దర్శనంపై సామాజిక కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తుండగా, సంప్రదాయవాదులు, కేరళ మహిళలు మాత్రం తీవ్రంగా మండిపడుతున్నారు.



కోహ్లీసేనకు పోటీనివ్వడం పైనే...


సిడ్నీ : టీమిండియాతో జరిగే నాలుగో టెస్టులో కఠిన పోటీ ఇవ్వడంపైనే దృష్టి సారించామని ఆస్ట్రేలియా సారథి టిమ్‌పైన్ అన్నాడు. గెలుపోటముల గురించి ఆలోచించడం లేదన్నాడు. భారత్ ఇంతకు ముందు ఎప్పుడూ ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవలేదు. నాలుగు టెస్టులో సిరీస్‌లో కోహ్లీసేన 2-1 తో ఆధిక్యంలో ఉంది. చరిత్ర సృష్టించేందుకు మ్యాచ్ దూరంలో నిలిచింది. కాగా చివరి టెస్టు గెలిచి సిరీస్‌ను డ్రా చేయాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. మేం మెరుగవ్వడం, వీలైనంత వరకు అత్యుత్తమ క్రికెట్ ఆడటంపైనే దృష్టి సారించాం. ఆడే ప్రతి టెస్టు గెలవాలనే కోరుకుంటాం. కొన్ని సార్లు అలా కుదరదు. ప్రస్తుతం అత్యద్భుతంగా ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ జట్టుతో మేం పోటీపడుతున్నాం. సిరీస్ చేజార్చుకోవడం గురించి ఆలోచించడం లేదు. స్ఫూర్తి పొందేందుకు ఒక్కో ఆటగాడు వేర్వేరు పనులు చేస్తుంటాడు. మేం మెరుగవ్వడం, ప్రతి సారీ పోటీపడటం, టీమిండియాతో సిసలైన సమరానికి దిగడం నాకు ప్రేరణ. మా జట్టు నిలకడగా మెరుగవుతోంది. మా బ్యాట్స్‌మెన్ పూర్తిస్థాయిలో ఫామ్‌లో లేరు. ఒకరు ఆడితే మరొకరు ఆడటం లేదు. శతకాలు చేయకుండా మ్యాచ్‌లు గెలవలేమని తెలుసు.





అచ్రేకర్ సర్ అస్తమయం

- సచిన్, కాంబ్లీతో సహా పలువురు దిగ్గజ క్రికెటర్లను దేశానికి అందజేసిన అసమాన్య క్రికెట్ గురువు
- గత జ్ఞాపకాలను నెమరేసుకున్న సచిన్, ఘన నివాళులు అర్పించిన బీసీసీఐ, ఇతర ఆటగాళ్లు



ముంబయి : క్రికెట్ దిగ్గజం టీమిండియా మాజీ ఆటగాడు సచిన్ టెండూల్కర్ గురువు రమాకాంత్ అచ్రేకర్ కన్నుమూశారు. ముంబయిలో బుధవారం నాడు ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. లెజండరీ క్రికెట్ కోచ్‌గా పేరుగాంచిన అచ్రేకర్... సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లే వంటి దిగ్గజ క్రికెటర్లను తీర్చిదిద్ది దేశానికి అందజేశారు. క్రికెట్ రంగంలో అసమాన సేవలందించినందుకు గాను ఆయనకు ద్రోణాచార్య, పద్మశ్రీ అవార్డులతో కేంద్రం సత్కరించింది.

అచ్రేకర్ సర్ సచిన్‌ను మందలించిన వేళ

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు వీరుడు ఎవ్వరంటే... సచిన్ టెండూల్కర్ అని టక్కున చెప్పేస్తారు ఎవ్వరైనా. కాని క్రికెట్లో ఎంతో మందికి ఆదర్శప్రాయుడైన సచిన్‌కు ఓనమాలు నేర్పింది మాత్రం అచ్రేకర్. అచ్రేకర్ వద్ద క్రికెట్ పాఠాలు నేర్చుకున్న సచిన్ దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చారు. బాల్యంలో ఆయన ఎంత కఠినంగా తనకు శిక్షణనిచ్చారో లిటిల్ మాస్టర్ ఎన్నో సార్లు గుర్తుచేసుకున్నారు. తన కెరీర్‌లో ఎన్నడూ బాగా ఆడావని గురువుగారు మెచ్చుకోలేదని గతంలో సచిన్ చెప్పిన సంగతి తెలిసిందే. నేను బాగా ఆడానని గురువుగారు ఎప్పుడూ చెప్పలేదు. కానీ, కొన్ని సార్లు ఆయన నాకు పానీపూరీ తినిపించేందుకు తీసుకెళ్లేవారు. మైదానంలో అద్భుతంగా ఆడినందుకు గురువుగారు సంతోషపడ్డారని దాని అర్థం అని పేర్కొన్నారు. తన ఆదేశాలను అనుసరించనందుకు ఒకసారి సచిన్‌ను అచ్రేకర్ మందలించారట. ఒక రోజు పాఠశాల ముగిసిన తర్వాత ఆయన సచిన్‌కు ప్రాక్టీస్ మ్యాచ్ ఏర్పాటు చేశారు. అదే రోజు సచిన్ చదువుకుంటున్న శారదాశ్రమ్ విద్యామందిర్ పాఠశాల సీనియర్ జట్టు వాంఖడేలో హారిస్ షీల్డ్ ఫైనల్ ఆడేందుకు వెళ్లింది. సీనియర్లను ప్రోత్సహించాలని సచిన్ మైదానానికి వెళ్లాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత అచ్రేకర్ సర్‌ను పలకరించారు. వెంటనే ఆయన మ్యాచ్‌లో ఎన్ని పరుగులు చేశావని అడిగారు. సీనియర్లను ప్రోత్సహించేందుకు ఇక్కడికొచ్చానని సచిన్ బదులిచ్చారు. ఆగ్రహించిన అచ్రేకర్ నువ్వు ఇతరులకు చప్పట్లు కొట్టాల్సిన అవసరం లేదు. నీ ఆటపై శ్రద్ధపెట్టు. ఏదైనా సాధించు. అప్పుడు ఇత రులు నీకోసం చప్పట్లు కొడతారు అని గట్టిగా మందలించారు. ఈ పాఠాన్ని తాను ఎన్నటికీ మర్చిపోలేనని సచిన్ చాలాసార్లు గుర్తుచేసుకున్నారు. ప్రతి గురుపౌర్ణమికి ఆయన అచ్రేకర్ సర్ ఇంటికి వెళ్తారు. గురువు ఆశ్వీర్వాదం తీసుకొని శాలువా కప్పి సత్కరించే సంగతి తెలిసిందే.

ఆయన పర్యవేక్షణలో క్రికెట్ స్వర్గంలా అనిపించింది

రమాకాంత్ అచ్రేకర్ మృతిపై పలువురి ట్వీట్లు

భారత క్రికెట్‌కు ఎనలేని సేవలందించిన ద్రోణాచార్య పురస్కార గ్రహీత, ప్రముఖ క్రికెట్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ ఓ సాధారణ క్రికెటరే కాదు... అదే క్రికెట్‌కు పలువురు దిగ్గజ క్రికెటర్లను కూడా అందజేసిన ద్రోణాచార్యుడు. అయితే ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ... బుధవారం సాయంత్రం కన్నుమూశారు. అచ్రేకర్ మృతిపై సామాజిక మాధ్యమాల వేదికగా ఆయనకు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

★ ఆయన పర్యవేక్షణలో క్రికెట్ స్వర్గంలా అనిపించింది. అందరి విద్యార్థుల్లాగే నేను కూడా ఆయన వద్దే క్రికెట్లలో ఏబీసీడీలు నేర్చుకున్నాను. ఆయన మార్గదర్శకత్వంలోనే నేను క్రికెట్లో ఎన్నో కిటుకులు తెలుసుకున్నాను. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలి. – సచిన్

★ ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఇక లేరు అనే నిజాన్ని మనం తెలుసుకోవాలి. ఆయన గొప్ప క్రికెటర్లను అందించడమే కాదు. వారిని గొప్ప మనుషులుగా కూడా తీర్చిదిద్దారు. భారత క్రికెట్‌కు ఆయన సేవలు మాటల్లో వర్ణించలేనివి. – బీసీసీఐ.

★ మా గ్రేట్ సర్‌కి హృదయ పూర్వక నివాళి. ఇండియన్ క్రికెట్‌కు ఆయన ఎంతోమంది ఆణిముత్యాలను అందించారు – వీవీఎస్ లక్ష్మణ్.

★ అచ్రేకర్ సర్‌కు నా నివాళి. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. సచిన్ టెండూల్కర్ రూపంలో గొప్ప కానుకను భారత క్రికెట్‌కు ఆయన అందించారు.– కైఫ్.







సిడ్నీ టెస్ట్‌కు భారత జట్టు ఎంపిక



సిడ్నీ : ఆస్ట్రేలియాతో రేపటి నుంచి సిడ్నీలో జరగనున్న నాలుగో టెస్టుకు 13 మంది సభ్యులతో భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఆశ్చర్యకరంగా ఇషాంత్ శర్మను జట్టు నుంచి తప్పించింది. అతడికి ఫిట్‌నెస్ లేదని ప్రకటించింది. గాయపడ్డడా, అనారోగ్యంతో బాధ పడుతున్నాడా అనేది వెల్లడించలేదు. అడిలైడ్‌లో జరిగిన మొదటి టెస్టులో పార్శ్వపు నొప్పి(సైడ్ స్ట్రెయిన్)తో జట్టుకు దూరమైన అశ్విన్‌కు అవకాశం దక్కింది. రెండు, మూడు టెస్టులు ఆడలేకపోయిన అతడికి చివరి టెస్ట్‌లో ఛాన్స్ ఇచ్చారు. అశ్విన్ తుది జట్టులో ఉంటాడా, లేదా అనేది మ్యాచ్ ప్రారంభానికి ముందు నిర్ణయిస్తామని బీసీసీఐ తెలిపింది. వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. తనకు కూతురు పుట్టడంతో అతడు స్వదేశానికి వచ్చాడు. చివరిదైన సిడ్నీ టెస్టులో పైచేయి సాధించి చరిత్ర సృష్టించాలని టీమిండియా భావిస్తోంది. ఒకవేళ ఈ మ్యాచ్ ఫలితం తేలకున్నా సిరీస్ భారత్ సొంతమవుతుంది.

బీసీసీఐ ప్రకటించిన భారత జట్టు వివరాలు

విరాట్ కోహ్లి (కెప్టెన్), అజింక్య రహానే (వైస్ కెప్టెన్), ఛతేశ్వర్ పుజారా, కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, హనుమ విహారి, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, రవీందర్ అశ్విన్, మహ్మద్ షమి, జస్ప్రిత్ బుమ్రా, ఉమేశ్ యాదవ్.

చరిత్ర కాదు సిడ్నీ విజయం ముఖ్యం : కోహ్లీ

చరిత్రలో నిలిచిపోవడం తనకు ముఖ్యం కాదని భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియాపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిస్తే అది అద్భుతమేనని వెల్లడించాడు. తన సారథ్యంలో జట్టు పరివర్తన సిడ్నీ నుంచే మొదలైందని పేర్కొన్నాడు. నాలుగేళ్ల క్రితం సిడ్నీ మైదానంలోనే ఎంఎస్ ధోనీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అప్పుడు ఏడో ర్యాంకులో ఉన్న టీమిండియా ప్రస్తుతం ప్రపంచ నంబర్ వన్‌గా కొనసాగుతోంది.

ఇప్పటికి నాలుగేళ్లు (సారథిగా). ఈ సిరీస్ గెలిస్తే అద్భుతమే. నేనిక్కడ పర్యటించడం నాలుగోసారి. ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలవడం ఎంత కష్టమో తెలుసు. చాలాసార్లు మంచి ప్రదర్శనలు చేశాం. కానీ విజయం సాధించడం అతి పెద్ద సవాల్. నిజం చెప్పాలంటే గత రెండు పర్యటనల్లో వ్యక్తిగత ప్రదర్శనలను పట్టించుకోలేదు. సిరీస్ గెలిస్తే గౌరవనీయుల జాబితాలో పేరు చేరొచ్చు. చివరి టెస్టు గెలవకపోతే మాత్రం దానికి అర్థం లేదు. ఇప్పటికైతే ఇదే అతి పెద్ద విజయం. నా ఒక్కడికే కాదు జట్టుకూ ఇదే పెద్ద విజయం. నిజాయతీగా చెప్పాలంటే భారత జట్టు పరివర్తన ఇక్కడే మొదలైంది అని కోహ్లీ పేర్కొన్నాడు. సిడ్నీలో ధోనీ సారథ్యం వదిలేసినప్పుడు టీమిండియా ఆరు, ఏడు ర్యాంకుల్లో ఉంది. అక్కడ్నుంచి పుంజుకొని ప్రపంచంలో నంబర్‌వన్ అయ్యాం. ఆ వారసత్వాన్ని మేం కొనసాగించాలని కోరుకుంటున్నాం. మెల్‌బోర్న్‌లో చివరి వికెట్ పడగానే మేమంతా భావోద్వేగానికి గురయ్యాం. ప్రశాంతంగా ఉండే వ్యక్తులు సైతం సంబరాలు చేసుకున్నారు. జట్టును ఒక దిశలో నడిపిస్తే పరిస్థితులు స్థిరంగా ఉంటాయి. నిజం చెప్పాలంటే నేను చరిత్ర గురించి పట్టించుకోవడం లేదు. ఆస్ట్రేలియాలో సిరీస్ గెలవడం చాలా కష్టం. వర్తమానంలో ఉంటూ మ్యాచ్‌లు గెలవడంపై దృష్టి సారించాం. మెల్‌బోర్న్‌లో విజయం మా అందరిలో నమ్మకం పెంచింది. అడిలైడ్, మెల్‌బోర్న్ విజయాలు బృంద స్ఫూర్తిని రగిలిస్తాయి అని కోహ్లీ అన్నాడు.

కొన్నాళ్లుగా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతునా : కోహ్లీ

టీమిండియా సారథి విరాట్ కోహ్లీ కొన్ని సంవత్సరాలుగా ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్నాడట. ఆ విషయాన్ని మీడియా ముందు బుధవారం కోహ్లీ వెల్లడించాడు. మెల్‌బోర్న్ టెస్టుకు ముందు కోహ్లీకి వెన్ను నొప్పి రావడంతో ఫిజియో చికిత్స చేయించుకున్నాడు. ఫిట్‌నెస్ పరంగా సమస్యలెదురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై కోహ్లీ మాట్లాడాడు.

నాకు ఫిట్‌నెస్ సమస్యలు 2011 నుంచి ఉన్నాయి. ఇప్పుడేం కొత్తగా రాలేదు. కానీ దీనిపై జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నాను. పని ఒత్తిడి ఎక్కువయితే ఆ ప్రభావం కచ్చితంగా ఫిట్‌నెస్‌మీద పడుతుంది. దీన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదు. మరిన్ని జాగ్రత్తలు తీసుకోగలిగితే రెండు మూడు రోజుల్లో కుదుటపడవచ్చు. నేను కూడా దీనిమీద ఎక్కువ ఆందోళన చెందను. కాకపోతే దానికి పరిష్కారం వెతికి ప్రత్యామ్నాయం చూస్తాను. ఫిట్‌నెస్‌పై సరైన జాగ్రత్తలు తీసుకుంటే గాయాల బారిన పడకుండా ఉండొచ్చు. ఆరోగ్య సంబంధిత సమస్యలొచ్చినంత మాత్రాన మానసికంగా కుంగిపోకూడదు. అని చెప్పుకొచ్చాడు. టీమిండియా-ఆసీస్‌ల మధ్య చివరి టెస్టు సిడ్నీ వేదికగా నేటినుంచి జరుగనుంది. అందుకు అవసరమైన 13 మందితో కూడిన టీమిండియా జట్టును బుధవారం బీసీసీఐ ప్రకటించింది.



సిడ్నీ టెస్టు ముందు కోహ్లీసేనకు గణాంకాల భయం



ముంబయి : మెల్‌బోర్న్ టెస్టు గెలిచి 2-1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియా సిడ్నీ టెస్టును గెలిచి అఖండ విజయం సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. 3-1తో సిరీస్ కైవసం చేసుకోవాలని పట్టుదలగా కనిపిస్తోంది. బౌలింగ్ దాడి దుర్భేధ్యంగా ఉండటంతో సారథి కోహ్లీ ధీమాగా ఉన్నాడు. మయాంక్, రహానె, పుజారా, కోహ్లీ ఫామ్‌లో ఉన్నారు. చరిత్ర తిరగ రాసేందుకు సిద్ధంగా ఉన్న కోహ్లీసేనను కొన్ని గణాంకాలు భయపెడుతున్నాయి. ఏడాది కాలంగా భారత లోయర్ మిడిలార్డర్ (5-8 స్థానాలు) పరిస్థితి ఘోరంగా ఉంది. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాల్లో ఓటములకు ఇదే కారణం. టీమిండియాలో లోయర్ మిడిలార్డర్ పేలవంగా ఉంది. విదేశాల్లో 2018లో ఆడిన 11 టెస్టుల్లో వీరు 1,972 పరుగులు చేశారు. సగటు 23.47. ఆతిథ్య ఆస్ట్రేలియా లోయర్ మిడిలార్డర్ భారత్ కన్నా ఘోరంగా ఉంది. 6 టెస్టుల్లో 20.68 సగటుతో 9,10 పరుగులు చేసింది. ఈ విషయంలో శ్రీలంక ముందంజలో నిలిచింది. వారు 7 మ్యాచుల్లో 37.51 సగటుతో 1,463 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ (34.50 సగటు), పాకిస్థాన్ (31.78), వెస్టిండీస్ (27.60), న్యూజిలాండ్ (26.09) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. భారత బ్యాట్స్‌మెన్ మొత్తం చేసిన పరుగుల్లో లోయర్ మిడిలార్డర్ చేసిన పరుగుల శాతం తక్కువే ఉంది. 11 టెస్టుల్లో జట్టు 5,213 పరుగులు చేయగా అందులో లోయర్ మిడిలార్డర్ చేసిన పరుగులు 1972. ఇది మొత్తం పరుగుల్లో 37.83 శాతం. వెస్టిండీస్ (54.33%), ఇంగ్లాండ్ (44.27%), శ్రీలంక (43.36%), పాకిస్థాన్ (41.95%), న్యూజిలాండ్ (40.11%) వరుస స్థానాల్లో నిలిచాయి. అంతే కాదు విదేశాల్లో భారత లోయర్ ఆర్డర్ ఆటగాళ్లు విదేశాల్లో తొమ్మిది డక్‌లు నమోదు చేయడం గమనార్హం. ఇక శ్రీలంక, ఇంగ్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్, న్యూజిలాండ్ లోయర్ మిడిలార్డర్ నుంచి దాదాపు ఒకటి, ఒకటిన్నర ఇన్నింగ్స్‌ల్లో ఒక అర్ధశతకం నమోదు అవుతోంటే భారత్, ఆస్ట్రేలియా లోయర్ మిడిలార్డర్ 2.20, 2.40 ఇన్నింగ్స్‌లు తీసుకుంటున్నాయి.

సానియా కుమారుడి పేరు ఇజాన్

హైదరాబాద్ : ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా ప్రస్తుతం అమ్మతనాన్ని ఆస్వాదిస్తోంది. గతేడాది ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఆ చిన్నారికి ఇజాన్ అని నామకరణం కూడా చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 2018లో తనకెదురైన మధురానుభూతులను పంచుకుంది. గర్భం దాల్చిన రోజు నుంచి ప్రసవం అయ్యే రోజు వరకూ ప్రతిరోజు కొత్తగా గడిచింది. ఇక ఇజాన్‌ను మొదటి సారి చూసినప్పుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నా జీవితంలో ఆరోజు నిజంగానే అద్భుతం జరిగిందనిపించింది. గొప్పగా, గర్వంగా ఫీలయ్యాను. మహిళగా నాజీవితం పరిపూర్ణమైనట్లు అనిపిస్తోంది. గర్భిణిగా ఉన్నప్పుడు ఏం తినాలన్నా నా కడుపులోఉన్న బిడ్డను దృష్టిలో ఉంచుకుని తినేదాన్ని. కానీ ఇజాన్ పుట్టిన తర్వాత ఆహార నియమాల గురించి స్వల్పంగా పక్కన పెట్టాను. ఇజాన్‌కు నేను గొప్ప తల్లిగా ఉండాలి. షోయబ్‌కు మంచి భార్యను అనిపించుకోవాలి. ఇక వ్యాయామం విషయానికొస్తే.. ఇజాన్ పుట్టి మూడు నెలలు కూడా పూర్తవ్వకముందే నేను జిమ్ బాట పట్టాను. అది నాకు వృత్తి పరంగా, వ్యక్తిగతంగా ఉపయోగపడాలనే ఉద్దేశంతో ట్రైనర్ల సలహా మేరకు ఇప్పటికీ జిమ్‌కి వెళ్తున్నా. నా ఫిట్‌నెస్ ట్రైనర్ రాబర్ట్ బెల్లార్డ్ పర్యవేక్షణలో ఫిబ్రవరి నుంచి రోజూ జిమ్‌కి వెళ్లాలనుకుంటున్నా. ఫిట్‌నెస్ పరంగా మునుపటి స్థితికి చేరుకోవాలంటే కనీసం ఆరునెలలైనా పడుతుంది. ఏది చేసినా నేను ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకునే చేస్తాను. ఒలింపిక్స్‌లో ఆడాలనేది ప్రతి క్రీడాకారుడి కల. నేను కూడా ఇక దాని మీదే దృష్టి సారించబోతున్నా అని సానియా తెలిపింది.

పంత్.. నీ స్లెడ్జింగ్‌ను స్వాగతిస్తున్నా : ఆస్ట్రేలియా ప్రధాని



సిడ్నీ : భారత్-ఆస్ట్రేలియాల బోర్డర్ గావాస్కర్ టెస్ట్ సిరీస్ ఆసాంతం టీమిండియా యువ వికెట్ కీపర్ రిషభ్‌పంత్ హాట్ టాపిక్ అవుతున్నాడు. మైదానంలో ఆసీస్ కెప్టెన్ టిమ్‌పైన్‌తో వ్యవహరించిన తీరు.. అనంతరం వారి కుటుంబంతో గడపడం, పైన్ సతీమణి బెస్ట్ బేబీసిట్టర్ అంటూ.. పంత్‌ను కొనియాడటం సోషల్‌మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే చివరి టెస్ట్ ఆడేందుకు సిడ్నీకి వచ్చిన ఇరు జట్ల ఆటగాళ్లకు ఆసీస్ ప్రధాని స్కాట్ మారిసన్ తన నివాసంలో విందు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రిషభ్ పంత్ ఆసీస్ ప్రధానికి తారసపడగా.. అక్కడున్న టీమిండియా మేనేజర్ సునీల్ సుబ్రమణ్యం పరిచయం చేయబోయ్యారు. మారిసన్ వెంటనే అయ్యో ఇతను నాకెందుకు తెలియదు.. పంత్.. నీవు స్లెడ్జ్ చేశావ్ కదా! నీ స్లెడ్జింగ్‌ను నేను స్వాగతిస్తున్నాను. మేం ఇలాంటి రసవత్తర పోరునే ఇష్టపడతాం అని చెప్పుకొచ్చారు. దీంతో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఇక మూడో టెస్ట్‌లో పైన్-పంత్‌ల మధ్య స్లెడ్జింగ్ తారాస్థాయికి చేరిన విషయం తెలిసిందే. పంత్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో పైన్.. జట్టులోకి ధోని వచ్చాడు. ఇక నువ్వు ఇక్కడే మా బిగ్‌బాష్ లీగ్ ఆడుకో. హోబర్ట్ హరికేన్స్ తరపున బ్యాటింగ్ చెయ్. అలా ఆసీస్‌లో సెలవుల్ని అస్వాదించు. అన్నట్లు నేను నా భార్య సినిమాకెళ్లి చాలా రోజులైంది. నువ్వు మా ఇంట్లో బేబీ సిట్టర్‌గా ఉంటే మేమిద్దరం సినిమాని ఎంజాయ్ చేస్తాం అంటూ స్లెడ్జింగ్ చేశాడు. దీనికి రిషభ్ కూడా దీటుగానే బదులిచ్చాడు. పైన్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మయాంక్‌తో ఈ రోజు మనం ఓ ప్రత్యేక అతిథిని చూస్తున్నాం. పెద్దగా బాధ్యతలేని పని. అదే తాత్కాలిక కెప్టెన్. ఎవ్వుడైనా ఇలాంటి తాత్కాలిక కెప్టెన్‌ను చూశామా? దాని గురించి విన్నామా? అతన్ని ఔట్ చేసేందుకు శ్రమించాల్సిన పనిలేదు బాయ్స్ (బౌలర్లనుద్దేశించి). మాట్లాడితే చాలు. అతిగా మాట్లాడటమే ఇష్టం. అంతే అని నోటితోనే బదులిచ్చాడు. ఇదంతా వివాదం కాకపోవడంతో ఈ మ్యాచ్ ఆరోగ్యకరంగానే ముగిసింది. ఇక ఈ నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉన్న కోహ్లీసేన.. రేపటి (గురువారం) నుంచి ప్రారంభమయ్యే చివరి టెస్ట్‌ను సైతం నెగ్గి చరిత్ర సృష్టించాలని భావిస్తోంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-